thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 45 కరీంనగర్ శనివారం, 27 ఏప్రిల్, 2024 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## క్షమాపణలు చెబుతూ మళ్లీ పతంజలి ప్రకటనలు

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేయనందుకు క్షమాపణలు చెబుతూ పంతజలి సంస్థ మళ్లీ పత్రికల్లో ప్రముఖంగా ప్రకటనలు ఇచ్చింది. పతంజలి ఉత్పత్తులపై తప్పుదోవ పట్టించే విధంగా ప్రకటనలు ఇవ్వవద్దంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించినందుకు క్షమాపణలు చెప్పింది.

పతంజలి సంస్థల వ్యవస్థాపకులు యోగా గురు బాబా రాందేవ్, ఆచార్య బాలకృష్ణలు వ్యక్తిగత హోదాలో కూడా క్షమాపణలు చెబుతూ పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు. పతంజలి ఉత్పత్తులపై ప్రకటనలు ఇవ్వవద్దంటూ ఇచ్చిన ఆదేశాలను ఉల్లంఘించినందుకు సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు క్షమాపణలు చెబుతూ పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలని ఆదేశించింది. అయితే ఇచ్చిన ప్రకటనలు మరీ చిన్నగా ఉండడంతో అభ్యంతరం చెప్పింది. మళ్లీ ప్రముఖంగా ప్రకటనలు ఇవ్వాలని ఆదేశించడంతో దాన్ని అమలు చేసింది.

# ఆగస్టు 15 తర్వాత...

# సిద్ధిపేటకు శని వదిలిపోతుంది




## మాజీ మంత్రిపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: పార్టీ నాయకులు, ప్రజలకు కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలు అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 14 సీట్లలో విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి నిమిషం అలర్ట్‌గా ఉండాలన్నారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ సోషల్ మీడియా కార్యకర్తలతో జరిగిన సమావేశంలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా భాజపా, భారాసపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా కార్యకర్తల రెక్కల కష్టంతో ఏర్పడిన ప్రభుత్వమిదని.. దాన్ని వారే కాపాడుకోవాలన్నారు.

**రిజర్వేషన్ల రద్దుకు భాజపా కుట్ర :** “రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ సెమీఫైనల్స్ మాత్రమే. ఇప్పుడు ఫైనల్స్ ఆడుతున్నాం. సెమీస్‌లో బంగ్లాదేశ్ జట్టు లాంటి కేసీఆర్‌ను ఓడించాం. ఇప్పుడు పాకిస్థాన్ జట్టు లాంటి మోదీతో కొట్లాడాలి. భాజపా నేతలు అమిత్‌షా, జేపీ నడ్డా సహా ముఖ్యనేతలు తెలంగాణపై ముప్పేట దాడి చేస్తున్నారు. ప్రభుత్వ ఏజెన్సీలను ఉపయోగిస్తున్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్నారు. ఇలాంటి అంశాలను సమయస్ఫూర్తితో తిప్పికొట్టాలి. దేవుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలి. భాజపాది ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం.. దేశంలో రిజర్వేషన్లు రద్దు చేయాలని కుట్ర చేస్తున్నారు. కష్టపడి తెచ్చిన ప్రభుత్వాన్ని కూల్చేయాలని చూస్తున్నారు. రేవంత్ లేకపోతే చాలు.. ఎవరైనా ఫర్వాలేదు అనే పరిస్థితికి భారాస నేతలు వచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో 12 సీట్లలో గెలిపిస్తే ఏడాదిలో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని కేటీఆర్ అంటున్నారు.. అదెలా సాధ్యం? ఇక్కడ అల్లాటప్పాగా కూర్చున్నామా? తండ్రి పేరు చెప్పుకొని కుర్చీలోకి వచ్చామా? ఇలాంటి వాటిపై అప్రమత్తంగా ఉంటూ కుట్రలను తిప్పికొట్టాలి. ఈ ఎన్నికలు దేశానికి అత్యంత అవసరం. రిజర్వేషన్లు రద్దు చేయాలనే ఉద్దేశంతోనే 400 సీట్ల నినాదాన్ని భాజపా చేస్తోంది. రిజర్వేషన్లు రద్దు చేసి ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీలకు అమ్మేసే కుట్ర జరుగుతోంది.

**కాళేశ్వరంలో దోచుకున్న రూ.లక్ష కోట్ల కంటే ఎక్కువా?...** హరీశ్‌రావు మోసానికి ముసుగు అమరవీరుల స్తూపం. మోసం చేయాలనుకున్న ప్రతిసారీ ఆయనకు స్తూపం గుర్తొస్తుంది. హరీశ్ సవాల్‌ను స్వీకరించా.. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తానని చెప్పా. ఆ తేదీ తర్వాత సిద్దిపేటకు ఆయన శని వదిలిపోతుంది. ఈ మధ్యకాలంలో ఎప్పుడైనా అమరవీరుల స్తూపం వద్దకు వెళ్లారా? రైతు రుణమాఫీతో పాటు మిగతా అంశాలను పేర్కొంటూ తన మామ చెప్పిన సీస పద్యమంతా రాజీనామా లేఖలో రాసుకొచ్చారు. స్పీకర్ ఫార్మాట్‌లో లేకుంటే రాజీనామా చెల్లుతుందా? మళ్లీ చెప్తున్నా.. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తా. హరీశ్‌రావు రాజీనామా లేఖను రెడీగా పెట్టుకోవాలి. రుణమాఫీ చేయలేకపోతే మాకు అధికారమెందుకు? దానికి రూ. 30-40వేల కోట్లు అవుతుంది. కాళేశ్వరంలో మీరు దోచుకున్న రూ.లక్ష కోట్ల కంటే అది ఎక్కువా? హైదరాబాద్ చుట్టూ ఆక్రమించుకున్న వేలాది ఎకరాల కంటే ఎక్కువా?” అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

# ఎన్నికల వేళ అసద్ కు మరో బిగ్ షాక్.. సౌత్ జోన్ డీసీపీగా లేడీ సింగం..




హైదరాబాద్ : ఎన్నికలు దగ్గర పడుతున్న కొలది తెలంగాణలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ప్రస్తుతం మరింత హాట్ టాపిక్ గా మారుతున్నాయి. సాధారణంగా ఎన్నికలు వస్తున్నాయంటే.. అధికారుల మీద ఎన్నికల సంఘం ఒక నిఘా పెడుతుంది. ముఖ్యంగా ఎవరివైపు కూడా పక్షపాతం చూపించకుండా ఉన్న అధికారులను మాత్రమే ఎన్నికల విధుల్లో ఉంచడానికి ప్రయత్నిస్తుంటుంది. ఎక్కడైన అధికారులు నేతలతో కుమ్మక్కైయ్యారని ఏమాత్రం సమాచారం అందిన కూడ వెంటనేవారిపై బదిలీవేటు వేస్తుంది. ఎన్నికలలో ముఖ్యంగా అధికార నాయకులు కానీ, అపోసిషన్ నేతలు.. ముఖ్యంగా ఐపీఎస్, ఐఏఎస్ అధికారులపై తరచుగా ఫిర్యాదులు చేస్తుంటారు. ఇలాంటి క్రమంలో ఎన్నికల సంఘం కూడా తమ నెట్ వర్క్ ఉపయోగించి సదరు అధికారులపై వచ్చిన ఆరోపణల్లో నిజమేంత అని ఆరాతీస్తుంది. ఏమాత్రం అనుమానం కల్గిన వెంటనే సదరు అధికారులను అక్కడి నుంచి తప్పించి, వెయిటింగ్ లో పెట్టేయడం, ఎన్నికలలో ఎలాంటి బాధ్యతలు ఇవ్వకపోవడం వంటికి చేస్తుంటుంది. ఇవన్ని మనంతరచుగా వార్తలలో చూస్తుంటాం. ఎఇదిలా ఉండగా.. ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి చెందిన ఎంపీ ఎన్నికలు ప్రస్తుతం తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. ఇక్కడ ఒకవైపు బీజేపీ తమ ఎంపీ అభ్యర్థిగా మాధవీలతను బరిలోకి దింపడం చేసింది. మరోవైపు బీజేపీ కు ఎందరో నేతలున్న కూడా మాధవీలతను దించడం వెనుక అనేక స్ట్రాటజీలున్నట్లు తెలుస్తోంది. ఇక మాధవీలత కూడా ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతుంది. ఓల్డ్ సిటీ అంతా పర్యటిస్తు, కులమతాలకు అతీతంగా ప్రజలకు తాను అధికారంలోకి వస్తే ఎలాంటి సదుపాయాలు, డెవలప్ మెంట్ కల్పిస్తామో కూడా చెప్తున్నారు. మాధవీలత మీటింగ్ లలో, సభలలో తరచుగా ఓవైసీ బ్రదర్స్ లపై ఫైర్ అవుతున్నారు. ఓవైసీలు పాతబస్తీకి చేసిందేమీలేదంటూ తీవ్ర స్థాయిలో ఏకీపారేస్తున్నారు. ఈక్రమంలో ఓవైసీలు ఏకంగా మమ్మల్నిచంపడానికి కొందరు కుట్రలు చేస్తున్నారు.. జైలుకు పంపుతారంటూ కూడా వ్యాఖ్యలు చేశారు. అయితే.. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం అసద్ కు మరో షాక్ ఇచ్చింది. సౌత్ జోన్ కు కొత్త డీసీపీగా స్నేహా మెహ్రాను నియమిస్తు ఉత్తర్వులు జారీచేసింది. వెంటనే ఆమె బాధ్యతలు స్వీకరించాలిన కూడా ఆదేశించింది.

అదే విధంగా.. ఇప్పటిదాక ఇక్కడ పనిచేస్తున్న సాయిచైతన్యను ఎన్నికల సంఘం.. డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేసింది. గత కొన్నేళ్లుగా సాయిచైతన్య ఇక్కడే డీసీపీగా బాధ్యతలు నిర్వర్తించడం, తెలంగాణ వ్యాప్తంగా ఐపీఎస్ ల బదిలీ జరిగిన కూడా ఒక్కసౌత్ జోన్ లోని ఈ అధికారి మాత్రం అదే స్థానంలో ఉండటం పట్ల కేంద్ర ఎన్నికల సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై గలకారణాలపై నివేదిక ఇవ్వాలని కోరింది. ఇకమరోవైపు.. సాయిచైతన్న మజ్లీస్ కు వత్తాసు పలుకుతున్నాడని బీజేపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే.. 2018 బ్యాచ్ కు చెందిన ముక్కుసూటీగా పనిచేసే అధికారిణిగా పేరున్న స్నేహా మెహ్రాను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. స్నేహ మిశ్రా బుక్ లా పాటిస్తు,ఎలాంటి రాజకీయ ఒత్తిడులకు తలొగ్గకుండా లేడీ సింగంలా తనపని తాను చేసుకుంటూ వెళ్తారనిమంచి పేరు ఉంది. ఇప్పటిదాక ఆమెపై ఎలాంటి అవినీతి మరకలు లేవు. ఈ క్రమంలోనే స్నేహా మెహ్రాను సౌత్ జోన్ డీసీపీగా నియమించినట్లు తెలుస్తోంది.




## అన్నా.. నువ్వే గెలుస్తావ్...

### ఈటల రాజేందర్‌తో మాజీమంత్రి మల్లారెడ్డి

మాజీమంత్రులు ఈటల రాజేందర్, మల్లా రెడ్డి మధ్య ఆస్తికర సంభాషణ జరిగింది. ఈటల రాజేందర్ మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ప్రచారంలో భాగంగా ఈటల రాజేందర్‌కు మల్లారెడ్డి ఎదురు పడ్డారు. గతంలో వీరిద్దరూ బీఆర్‌ఎస్ పార్టీలో కలిసి పనిచేశారు. ఈటల రాజేందర్ పార్టీని వీడి బీజేపీలో చేరిన సంగతి తెలిసిందే. మల్లారెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్నారు. లోక్ సభ ఎన్నిక, విజయం గురించి వీరి మధ్య చర్చ వచ్చింది. మల్లారెడ్డి.. నవ్వుతూ.. అన్నా, నువ్వే గెలుస్తావ్ అనడంతో అక్కడున్న వారంతో ఒక్కసారిగా నవ్వారు. మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరతారని ప్రచారం జరిగింది. ఈటల రాజేందర్‌తో మాటల నేపథ్యంలో బీజేపీలో చేరతారా..? అనే సందేహం కలుగుతుంది. ఏది ఏమైనప్పటికీ ఇద్దరు మాజీ మంత్రుల మధ్య జరిగిన చర్చ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయ్యింది.

# ఆరం... భారం... ఆయునదే...!

## కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి గెలుపు కోసం కసరత్తు
## ఖమ్మం పార్లమెంటు ఎన్నికల ఇన్‌చార్జిగా ఉన్న పొంగులేటి
## స్వయంగా వియ్యంకుడు కావడంతో పోరు మరింత ప్రతిష్టాత్మకం




ఖమ్మం : ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు బాధ్యత మొత్తం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిపై పడింది. ఇంతకు ముందే ఖమ్మం లోక్ సభ సెగ్మెంట్ కు ఎన్నికల ఇన్‌చార్జిగా పొంగులేటిని ఏఐసీసీ నియమించింది. ఇప్పుడు ఎంపీ టికెట్‌ను సొంత వియ్యంకుడే దక్కించుకోవడంతో ఈ ఎన్నికల పోరు పొంగులేటికి మరింత ప్రతిష్టాత్మకంగా మారింది. నిన్న, మొన్నటి వరకు తమ కుటుంబ సభ్యులకు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సమన్వయం చేసుకోవడం, టికెట్ ఆశించి భంగపడ్డ ఇతర నేతలను కూడా కలుపుకొని పోవడం, ఇండియా కూటమిలో భాగస్వామ్యులుగా ఉండి ఖమ్మంలో ఓటు బ్యాంక్ ఉన్న కమ్యూనిస్టు పార్టీలను కూడా ఎన్నికల ప్రచారంలో ఉపయోగించుకోవడం లాంటి అంశాలను పొంగులేటి నేరుగా చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు బీఫామ్ దక్కడంతో ఎన్నికల వ్యూహాలు రచించుకునేందుకు కూడా కాంగ్రెస్ అభ్యర్థికి తగిన సమయం లేకుండా పోయింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని ఆరు చోట్ల కాంగ్రెస్, మరొక్క చోట కాంగ్రెస్? సపోర్ట్ తో సీపీఐ అభ్యర్థి గెలిచారు. ఈ కారణంగా హస్తం పార్టీకి ఖమ్మంలో కొంత సానుకూల పరిస్థితి కనిపిస్తున్నా, మిగిలిన సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడంపైనే ఆ పార్టీ విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి.

**ఇక్కడి రాజకీయాలకు రఘురాంరెడ్డి కొత్తే! :** కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి సొంతూరు కూసుమంచి మండలం చేగొమ్మ అయినా.. వారి కుటుంబం, తండ్రి సురేందర్ రెడ్డి పొలిటికల్ కెరీర్ మొత్తం ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగానే సాగింది. నాలుగు సార్లు డోర్నకల్ ఎమ్మెల్యేగా, నాలుగుసార్లు వరంగల్ ఎంపీగా సురేందర్ రెడ్డి పనిచేశారు. ఆ ఎన్నికల సమయంలో సురేందర్ రెడ్డి తరఫున రఘురాంరెడ్డి పార్టీలో కీలకంగా పనిచేశారు. ఆయా నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగానూ వ్యవహరించారు. అయితే హైదరాబాద్? కేంద్రంగా వ్యాపార రంగంలో స్థిరపడడంతో గత రెండు దశాబ్దాల నుంచి రఘురాంరెడ్డి ప్రత్యక్ష రాజకీయాలకు కొంత దూరంగానే ఉన్నారు. ఈ కాలంలో ఒకసారి పాలకుర్తి, మరోసారి పాలేరు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించినా అవకాశం దక్కలేదు. దీంతో ఖమ్మం పార్లమెంట్ పరిధిలో రాజకీయాలు రఘురాంరెడ్డికి కొత్తే. స్థానిక నాయకులు గానీ, ఇతర భాగస్వామ్య పార్టీల లీడర్లుగానీ పరిచయం లేదు. పోలింగ్ కు కూడా మూడు వారాల్లోపే సమయముంది. ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు ఇప్పటికే రెండో విడత ప్రచారంలో ఉండగా, కాంగ్రెస్ అభ్యర్థి మాత్రం ఇప్పుడు వ్యూహాలను సిద్ధం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. అతి తక్కువ సమయంలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లను కవర్? చేయడం, ఓటర్లను కలుసుకోవడం కత్తి మీద సాముగా మారింది. దీంతో ఈ ఎన్నికలకు సంబంధించి అన్ని వ్యవహారాల్లోనూ పొంగులేటి తన సొంత ఎన్నికలుగానే భావించి పనిచేయాల్సి ఉంది.

**మరింత బాధ్యత..** 2014 పార్లమెంట్ ఎన్నికల్లో పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఖమ్మం ఎంపీగా వైసీపీ నుంచి పోటీచేసి గెలిచారు. ఆ ఎన్నికలతోనే పొంగులేటి పొలిటికల్‌ల ఎంట్రీ ఇచ్చారు. కాంగ్రెస్‌ల కు కంచుకోట లాంటి ఖమ్మంలో వైసీపీ తరఫున విజయం సాధించారు. ఆ ఎలక్షన్లతోనే పొంగులేటి సత్తా బయటపడింది. తర్వాత పరిస్థితుల్లో ఆయన బీఆర్‌ఎస్‌లో చేరడం, ఆ పార్టీలో ఎలాంటి అవకాశాలు రాకపోవడంతో గత ఐదేళ్లు ఏ పదవీ లేకుండా ఖాళీగా ఉన్నారు. గతేడాది కేసీఆర్ ను సవాల్ చేసి మరీ ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఓడించారు. ఒక్కరిని కూడా అసెంబ్లీ గేటు తాకనివ్వనంటూ చెప్పిన మాటను ఎన్నికల్లో నిలబెట్టుకున్నారు. ఇప్పుడు ఖమ్మం పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ కు సానుకూల పరిస్థితులున్నాయి. సొంత తమ్ముడు ప్రసాద్ రెడ్డికి టికెట్ ఇప్పించుకునే విషయంలో కొంత ఫెయిల్ అయినా.. తన కుటుంబాన్ని వదిలి పార్టీ టికెట్ బయటకు వెళ్లకుండా చూసుకోవడంలో విజయం సాధించారు. దీంతోనే పార్టీలో తన పట్టును నిరూపించుకున్నారు. అయితే ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో రఘురాంరెడ్డిని గెలిపించి, పార్టీ ఆయనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యత పొంగులేటిపైనే ఉంది.



## రుణమాఫీ చేసి తీరుతాం... హరీష్ రాజీనామా రెడీగా పెట్టుకో.. రేవంత్ కౌంటర్

హైదరాబాద్, ఏప్రిల్ 26: మోసం చేయాలనుకునే ప్రతీ సారి హరీష్‌కు అమరవీరుల స్థూపం గుర్తొస్తది అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావుత గన్‌పార్క్ వద్దకు రావడంపై సీఎం స్పందిస్తూ... హరీష్ మోసానికి ముసుగు అమరవీరుల స్థూపమన్నారు. ఇన్నాళ్లు ఎప్పుడైనా అమరుల స్థూపం దగ్గరకు వెళ్లారా? అని ప్రశ్నించారు.

చాంతాడంత లేఖ రాసుకొచ్చి రాజీనామా లేఖ అంటున్నారని.. రాజీనామా లేఖ అలా ఉండదని చెప్పుకొచ్చారు. హరీష్ తన మామ చెప్పిన సీస పద్యమంతా లేఖలో రాసుకొచ్చారంటూ సెటైర్ విసిరారు. స్పీకర్ ఫార్మాట్‌లో లేకుంటే రాజీనామా లేఖ చెల్లదన్నారు. హరీష్ రావు తెలివి ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు.

హరీష్ తెలివి మోకాళ్లలో కాదు... అరికాళ్లలోకి జారినట్టుందంటూ వ్యాఖ్యలు చేశారు. "హరీష్.. ఇప్పటికీ చెబుతున్నా.. నీ సవాల్‌ను ఖచ్చితంగా స్వీకరిస్తున్నాం. పంద్రాగస్టులోగా రూ.2లక్షల రైతు రుణమాఫీ చేసి తీరుతాం. నీ రాజీనామా రెడీగా పెట్టుకో" అంటూ మరోసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.

## హరీష్‌రావు రాజీనామా స్పీకర్ ఫార్మాట్‌లో లేదు: మంత్రి కోమటిరెడ్డి




హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం మాట్లాడుతూ.. హరీష్ రావు బీఆర్ఎస్ పార్టీలో చిన్న ఎమ్మెల్యే అని, ఆయన స్వేచ్ఛగా అమరవీరుల స్థూపం దగ్గరికి వచ్చారంటే ప్రజాస్వామ్య తెలంగాణ వచ్చినట్లు అర్థమని అన్నారు. హరీష్ రాజీనామా స్పీకర్ ఫార్మాట్‌లో లేదని.. అగ్గిపెట్టె నాటకం లాగా ఆయన ఇంకో నాటకానికి తెర లేపారని విమర్శించారు. ఆగస్టు 15వ తేదీలోపు రైతుల రుణమాఫీ చేస్తామని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు ఓ గుమాస్తా అని, మాట్లాడాల్సింది ఆయన కాదని, కేసీఆర్ మాట్లాడాలని అన్నారు. హరీష్ రావు వాఖ్యలకు విలువ లేదని.. మేము రుణమాఫీ చేస్తే బీఆర్ఎస్‌ను రద్దు చేస్తారా? అని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. హరీష్ రావు అమరవీరుల స్తూపం వద్దకు రావడంతో అపవిత్రం అయిందన్నారు. కాంగ్రెస్ చేసేదే చెబుతుందని.. చెప్పిందే చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తున్నానని హరీష్ రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది తొండి రాజకీయమని.. ఆయన ఇచ్చిన సవాలును తాను స్వీకరిస్తున్నానని స్పష్టం చేశారు. ఆగస్టు 15వ తేదీ లోపు ఏకకాలంలో రైతు ఋణమాఫీ చేసి, ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే తాను తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని.. మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేయనని.. తనకు పదవులు ముఖ్యం కాదని అన్నారు. రైతు రుణమాఫీ, ఇచ్చిన హామీలు చేయకపోతే రేవంత్ రెడ్డి సీఎం పదవికి రాజీనామా చేస్తారా..? ప్రశ్నించారు. ఈ విషయాలపై తాను శుక్రవారం అసెంబ్లీ ముందు ఉన్న అమరుల స్థూపం వద్దకు చర్చకు వస్తానని.. సీఎం రేవంత్ కూడా రావాలని హరీష్ రావు అన్నారు. కాగా రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు విసురుతున్న సవాళ్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూటిగా స్పందించారు. ఆగస్టు 15వ తేదీలోపు రుణమాఫీ చేసి హామీని నిలబెట్టుకుంటానని, మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ప్రతి సవాల్ విసిరారు. రైతు రుణమాఫీ చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తనకు సవాల్ విసిరారని, అటు సూర్యుడు ఇటు పొడిచినా రుణమాఫీ చేస్తానని స్పష్టం చేశారు. లంబాడ గిరిజనుల ఆరాధ్య దైవాలైన బావోజీ, సేవాలాల్‌ల సాక్షిగా ఆగస్టు 15లోగా అది జరుగుతుందని పునరుద్ఘాటించారు. తాను మాట ఇస్తే ఎలా ఉంటుందో హరీశ్‌రావు తన మామ కేసీఆర్‌ను అడిగి తెలుసుకోవాలన్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ తాను రుణమాఫీ చేస్తే.. బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని హరీశ్‌కు సీఎం ప్రతి సవాల్ విసిరారు.

## అనుకన్నట్టుగానే రాజీనామా లేఖతో గన్‌పార్క్‌కు హరీష్.. ఉత్కంఠ

హైదరాబాద్ : రైతు రుణమాఫీ అంశం ముఖ్యమంత్రికి, మాజీ మంత్రికి మధ్య పెను తుఫానునే సృష్టిస్తోంది. రుణమాఫీ చేయకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని.. చేయకపోతే సీఎం పదవికి రాజీనామా చేస్తావా అంటూ హరీష్ సవాల్ విసరడం.. అయితే రాజీనామా లేఖను జేబులో పెట్టుకుని తిరుగు అని సీఎం రేవంత్ రెడ్డి అనడం.. గన్‌పార్క్ వద్ద లేఖతో సిద్ధమంటూ హరీష్ మరో సవాల్ విసరడం తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

**రాజీనామా లేఖతో...** అయితే... అనుకన్నట్లుగానే మాజీ మంత్రి హరీష్ రావు రాజీనామా లేఖతో అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్దకు శుక్రవారం ఉదయం చేరుకున్నారు. రాజీనామా లేఖను అమరవీరుల స్థూపం ముందు ఉంచారు.

హరీష్‌రావుకు మద్దతు తెలుపుతూ తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు వివేకానంద గౌడ్, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి గన్‌పార్క్‌కుచేరుకున్నారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపానికి హరీష్, బీఆర్ఎస్ నేతలు నివాళులర్పించారు.

**దేవుళ్ల మీద ఒట్టు నిజమైతే....** ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. "మీరిచ్చే హామీ నిజమైతే రేవంత్ రెడ్డి అమరవీరుల స్థూపం వద్దకు రావాలి. ఇద్దరి రాజీనామాను పెద్ద మనిషికి ఇద్దాం. రాజీనామాకు ఎందుకు ముందుకు రావడం లేదు. దేవుళ్ల మీద మీరేసే ఒట్టు నిజమైతే రాజీనామాకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారు. నా పదవికంటే ప్రజల మేలే నాకు ప్రాధాన్యం. స్పీకర్ ఫార్మాట్‌లో నేను రాజీనామా లేఖతో వచ్చాను. నీకు ఇక్కడకు రావడం కుదరకపోతే మీ మనుషులతో పంపించండి. డిసెంబర్ 9న హామీలు అమలు చేయనందుకు రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ఇప్పటికైనా మాటకు కట్టుబడి ఆగస్టు 15న రైతు రుణమాఫీ, 6 గ్యారంటీలను అమలు చేయాలి" అంటూ హరీష్‌రావు డిమాండ్ చేశారు. కాగా.. హరీష్ రావు రాక తెలుసుకొని గన్‌పార్కు వద్దకు బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా చేరుకుంటున్నారు. అయితే వారిని పోలీసులు అడ్డుకుంటున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అనుమతి లేదంటూ వచ్చిన వారిని వచ్చినట్టే పోలీసులు వెనక్కి పంపించివేస్తున్నారు.

**నిజయితీ ఉంటే సవాల్ స్వీకరించాలి: తలసాని –** సీఎం రేవంత్‌కు నిజాయితీ ఉంటే హరీష్ రావు సవాళ్లు స్వీకరించాలని మాజీ మంత్రి



తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. హరీష్‌కు మద్దతుగా గన్‌పార్క్ వద్దకు చేరుకున్న తలసాని మీడియాతో మాట్లాడుతూ.. దేవుళ్ళ మీద ఒట్టేసి చెప్పేది నిజమే అయితే రాజీనామా లేఖతో గన్ పార్క్ వద్దకు రావాలని డిమాండ్ చేశారు. రుణమాఫీతో పాటు ఆరు గ్యారెంటీలు ఆగస్టు 15లోపు అమలు చేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు దండుకోవడానికి దేవుళ్ల మీద ఓట్ల పేరుతో కొత్త డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. డిసెంబర్ 9 వరకే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న హామీని రేవంత్ రెడ్డి నిలబెట్టుకోలేదని.. అందుకే ప్రజాస్వామ్య పద్ధతిలో తాము నిరసన తెలుపుతున్నామని తలసాని శ్రీనివాస్ పేర్కొన్నారు.

**సవాళ్లు.. ప్రతిసవాళ్లు...** కాగా.. రుణమాఫీ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి హరీష్‌రావు సవాళ్లు, ప్రతిసవాళ్లతో చేసుకున్నారు. ఆగష్టు 15 లోగా ఏకకాలంలో రైతు రుణమాఫీ చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అయితే ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని.. మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేయనని.. ఇచ్చిన హామీ నెరవేర్చకపోతే సీఎం పదవకి రాజీనామాకు సిద్ధమా అంటూ హరీష్‌రావు సవాల్ విసిరారు. దీనిపై రేవంత్ స్పందిస్తూ.. రాజీనామా పత్రాన్ని జేబులో పెట్టుకుని తిరగాలంటూ సీఎం రేవంత్ కౌంటర్ విసిరారు. అయితే ఈ విషయంపై గన్‌పార్క్ వద్ద తేల్చుకుందామంటూ హరీష్ మరో సవాల్ విసిరారు. రాజీనామా లేఖతో గన్‌పార్క్ వద్దకు రావాలని, తాను కూడా రాజీనామా లేఖను తీసుకువస్తానని హరీష్ రావు తెలిపారు. ఈ క్రమంలో కాసేపటి క్రితమే మాజీ మంత్రి గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతోందో అనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

## రేవంత్ రెడ్డిని బ్రోకర్ అంటూ మంద కృష్ణ విమర్శ

వరంగల్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ఓ బ్రోకర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యమం చేసి సీఎం కాలేదని.. బోకరిజం చేస్తూ సీఎం అయ్యారని కామెంట్స్ చేశారు. ప్రజాభిమానం ఉంటే రేవంత్ రెడ్డి కామారెడ్డిలో ఓడిపోయేవాడు కాదన్నారు. కడియం శ్రీహరిని తానే పిలిచాను అని రేవంత్ అన్నారని.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ఒక పార్టీలో గెలిచి ఇతర పార్టీలో చేరితే పిచ్చి కుక్కల్లా రాళ్లతో కొట్టామని రేవంత్ రెడ్డి చెప్పారని... ఇప్పుడు కడియంను కొట్టాల్సిందే కదా అని ప్రశ్నించారు. కడియం శ్రీహరిని రాజీనామా చేయనీయకుంటే రాళ్లతో కొట్టాల్సి వస్తుందన్నారు. రేవంత్ రెడ్డి, కడియం శ్రీహరిలపై ఎవరైనా రాళ్ళు వేయొచ్చు అని వ్యాఖ్యలు చేశారు. కడియం శ్రీహరి కులం ఎస్సీ



కాదని చెప్పిందే రేవంత్ రెడ్డి అని తెలిపారు. ఎస్సీ కాకుండానే ఎస్సీ సర్టిఫికెట్ తీసుకున్నారని మోత్కుపల్లి నర్సింహులు చెప్పారన్నారు. కడియం శ్రీహరి ఎస్సీ కానప్పుడు కడియం కావ్య ఎలా ఎస్సీ అవుతుందని మందకృష్ణ మాదిగ నిలదీశారు.



## అవసరమైతే తప్ప బయటకు రావొద్దు

హైదరాబాద్: రాష్ట్రంలో 3 రోజుల పాటు కొన్ని జిల్లాల్లో అక్కడక్కడా వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. పొడి వాతావరణం కారణంగా గత కొన్ని రోజుల కంటే రెండు నుంచి మూడు డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పగటి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడంతో ఉదయం 11 గంటల నుంచి 3గంటల వరకు అవసరమైతే తప్ప బయటకు రాకూడదని వాతావరణశాఖ తెలిపింది. ఎల్లుండి (ఆదివారం) రాష్ట్రంలో అక్కడక్కడా ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గతేడాది కంటే ఈసారి ఎండలు మండిపోతున్నాయి.. బయటకు రావాలంటేనే ప్రజలు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.




## ఎంఐఎంలో భయం మొదలైందా.. హైదరాబాద్‌లో అదే జరగనుందా..!

తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. పోలింగ్‌కు మరో 17రోజుల సమయం మాత్రమే ఉంది. ఎక్కువ సీట్లలో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వ్యూహాలను సిద్ధం చేస్తున్నాయి. అభ్యర్థులు ప్రచారాన్ని మొదలుపెట్టారు. తెలంగాణ వ్యాప్తంగా 17లోక్‌సభ స్థానాలు ఉన్నప్పటికీ.. అందరి గురి కేవలం 16 స్థానాలే.. ఈ నియోజకవర్గాల్లోనే గెలుపు కోసం అన్ని పార్టీల అభ్యర్థులు పోటీపడుతుంటారు. మరో నియోజకవర్గం గురించి అసలు ప్రస్తావనే ఉండదు.. ఎందుకంటే ఎన్నికలకు ముందే అక్కడి ఫలితం ఎలా ఉంటుందో ప్రజలందరికీ తెలుసు. అదే హైదరాబాద్ నియోజకవర్గం. ఓవైసీ కుటుంబానికి 35 ఏళ్ల నుంచి హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం అడ్డాగా మారింది. 1984 నుంచి 2004 వరకు సుల్తాన్ సలాహుద్దీన్ ఒవైసీ హైదరాబాద్ ఎంపీగా ఉండగా.. 2004 నుంచి ఇప్పటివరకు అసదుద్దీన్ ఓవైసీ ఎంపీగా ఉంటూ వస్తున్నారు. ముస్లిం ఓట్లు అధికంగా ఉండటంతో ఈ నియోజకవర్గంలో గెలుపు ఓవైసీ కుటుంబానికి సులభమైంది. ఈ ఎన్నికల్లోనూ ఎంఐఎం పార్టీ గెలుపు లాంఛనమేనని అంతా భావించారు. కానీ ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. అసదుద్దీన్ ఓవైసీ ఓడిపోతారా అనే చర్చ గత 20 ఏళ్లలో మొదటిసారి జరుగుతోంది. ఫస్ట్‌టైమ్ ఎంఐఎం పార్టీలో ఓటమి భయం మొదలైందనే చర్చ జరుగుతోంది.

**లక్షపైనే..** హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 2004 నుంచి అసదుద్దీన్ ఓవైసీ ఎంపీగా గెలుస్తూ వస్తున్నారు. ఆయన మెజార్టీ ఎప్పుడూ లక్షపైనే. తరువాతి స్థానంలో బీజేపీ ఉండేది. ఈ నియోజకవర్గంలో ప్రధాన పోటీ ఎంఐఎం, బీజేపీ మధ్య ఉన్నా.. గెలుపు ఎంఐఎందే అన్నట్లుగా ఉండేది. కానీ బీజేపీ తన అభ్యర్థి ప్రకటనతో ఓల్డ్‌సిటీ రాజకీయ స్వరూపాన్ని మార్చేసింది. మరోవైపు 5లక్షలకు పైగా ఓట్ల తొలగింపుతో ఓవైసీలో ఓటమి భయం పట్టుకుందనే ప్రచారం జరుగుతోంది. 2004 నుంచి ఓవైసీ మెజార్టీ లక్ష నుంచి 3 లక్షల మధ్య ఉండేది. హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో నకిలీ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, నియోజకవర్గంలో ఓటు ఉన్నప్పటికీ.. వారంతా ఇక్కడ నివాసం ఉండరని, అయితే ఎన్నికల సమయంలో వారంతా ఓటు వేసేవారనే ఆరోపణలు ఉన్నాయి. భారీగా రిగ్గింగ్ జరిగేదని, ఇక్కడ నివాసం ఉండని ఓటర్ల ఓట్లను ఎంఐఎం నాయకులు వేరే వ్యక్తులతో వేయించేవారనే ఆరోపణలు ఉన్నాయి. బోగస్ ఓట్లతోనే ఓవైసీ ఎంపీగా గెలుస్తున్నారని, నకిలీ ఓట్లు తొలగించనంత వరకు ఓవైసీ కుటుంబమే ఎంపీగా గెలుస్తుందని కాంగ్రెస్ నేత ఫిరోజ్‌ఖాన్ పలు సందర్భాల్లో చెప్పారు. తాజాగా 5లక్షలకు పైగా బోగస్ ఓట్లను తొలగించడంతో ఈసారి హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో పోరు రసవత్తరంగా మారే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**ప్రచారం స్పీడ్ పెంచిన బీజేపీ :** హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా మాధవీలతను ప్రకటించడంతో.. ఆమె గత కొద్దిరోజులుగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు తన మాటతీరుతో ప్రజలందరినీ ఆమె ఆకర్షిస్తున్నారు. ఓవైసీ టార్గెట్‌గా ఆమె చేస్తున్న ప్రసంగాలు వైరల్ అవడంతో ఆమె దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు. గతంలో ఎన్నికలంటే తన ప్రచారం తాను చేసుకుంటూ విపక్షపార్టీ అభ్యర్థులను లెక్కచేయని ఓవైసీ.. ప్రస్తుతం మాధవీలతను టార్గెట్ చేస్తున్నారు. మరోవైపు తనను చంపేందుకు కుట్ర చేస్తున్నారంటూ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఫస్ట్‌టైమ్ ఓవైసీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడంతో హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో ఆయన తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నారనే ప్రచారం జరుగుతోంది. ఓ వర్గం ఓట్లను పూర్తిస్థాయిలో పోలరైజేషన్ చేసేందుకే ఓవైసీ అలా మాట్లాడి ఉంటారనే అభిప్రాయం కొందరినుంచి వ్యక్తమైంది. మొత్తానికి ప్రచారంలో మాధవీలత ముందున్నట్లు తెలుస్తోంది. మాధవీలత సైతం ఓ వర్గం ఓట్లను పూర్తిగా తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారనే చర్చ జరుగుతోంది.

**ఓవైసీ ఓడిపోతారా..! :** హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో ముస్లింల ఓట్లు అధికం కావడంతో 35 ఏళ్లుగా ఎంఐఎం అభ్యర్థి విజయం సాధించడం ఆనవాయితీగా వస్తోంది. బీజేపీ మినహా ఇతర పార్టీలు అభ్యర్థులను బరిలో దింపినా.. ప్రధాన పోటీ ఎంఐఎం, బీజేపీ మధ్యనే నడుస్తుంది. ఈ క్రమంలో బోగస్ ఓట్ల తొలగింపు ఓవైసీకి నష్టమా.. లాభమా అనే చర్చ సాగుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఓవైసీకి గెలుపు నల్లేరుపై నడక కాదని, బీజేపీ అభ్యర్థి నుంచి తీవ్ర పోటీ ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. బోగస్ ఓట్లపైనే ఆధారపడి ఓవైసీ గత కొన్నాళ్లుగా గెలుస్తూ వస్తున్నారన్న ఆరోపణలు నిజమైతే మాత్రం హైదరాబాద్‌లలో ఎంఐఎం గెలుపు అంత ఈజీకాదనే ప్రచారం జరుగుతోంది. అసలు ఫలితం ఎలా ఉండబోతుందనేది జూన్4న తేలనుంది.

## ప్రభాకర్‌కు రెడ్ కార్నర్ నోటీసులపై హైదరాబాద్ సీపీ షాకింగ్ కామెంట్స్



హైదరాబాద్ : రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కొనసాగుతోందన్నారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయలేదని సపష్టం చేశారు. ఊహాగానాలతో దర్యాప్తును ఇబ్బంది పరుస్తున్నారని అన్నారు. రాజకీయ నేతల ప్రమేయంపై కూడా దర్యాప్తు కొనసాగుతుందని చెప్పారు. ప్రభాకర్ రావును పట్టుకోవడం లేదనేది వార్త అవాస్తవమన్నారు. ప్రభాకర్ దర్యాప్తు అధికారులకు అందుబాటులోకి రాలేదని.. సరైన సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసు వివరాలు వెల్లడిస్తామని చెప్పుకొచ్చారు. ప్రభాకర్ రావు ఎక్కడున్నాడో ఇప్పటివరకు తెలియదన్నారు. ఈ కేసులో నిందితులంతా చాలా స్మార్ట్‌గా, ఇంటలిజెంట్‌గా వ్యవహరించారని తెలిపారు. తమ శక్తి మేరకు ఈ కేసులో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. వ్యక్తిగత జీవితాలకు భంగం కలిగించేలా టాపింగ్ చేశారన్నారు. వ్యక్తిగత జీవితాలలోకి ప్రవేశించడం అనేది ఘోరమైన నేరమన్నారు. నలుగురు పోలీస్ ఆఫీసర్స్ ప్రమేయం ఉందని.. వారిని అరెస్ట్ చేశామని తెలిపారు. ఈ కేసులో మరి కొంత మంది పోలీసులను సాక్షులుగా పెట్టామన్నారు. సాక్షుల స్టేట్మెంట్లను రికార్డ్ చేశామన్నారు. అలాగే ప్రభాకర్ రావుపై ఎల్‌వోసీ జారీ చేసినట్లు హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

## అలాంటి వ్యక్తి వచ్చాడనే గన్‌పార్క్ వద్ద పసుపు నీళ్లతో శుద్ధి చేశా..

హైదరాబాద్, ఏప్రిల్ 26: ఆగష్టు 15లోగా ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామాకు సిద్ధమంటూ గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద మాజీ మంత్రి హరీష్‌రావు రాజీనామా లేఖను ఉంచారు. ఆ తరువాత అక్కడకు చేరుకుని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్... అమరవీరుల స్థూపాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరవీరుల చావుకి కారణమైన హంతకుడు హరీష్ రావు అంటూ విరుచుకుపడ్డారు. ఉద్యమ సమయంలో నిరుద్యోగులను, యువతను పొట్టనపెట్టుకున్న వ్యక్తి హరీష్ రావు అని..అలాంటి వ్యక్తి అమరవీరుల స్థూపం వద్దకు రావడంతో ఈ ప్రాంతం మైల పడిందన్నారు. అందుకే పసుపు నీళ్లతో శుద్ధి చేయడం జరిగిందని చెప్పుకొచ్చారు. 10 ఏళ్లుగా హరీష్ రావుకు బీఆర్ఎస్ నాయకులకు ఏనాడు అమరవీరుల గుర్తుకు రాలేదని మండిపడ్డారు. హరీష్‌రావు బీఆర్ఎస్‌లో ఒక జీతగాడు మాత్రమే అంటూ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి (%జవీ =వజ్ఞ్‌ష్ట =వుసుఎ%) ఇచ్చిన మాట ప్రకారం ఆగష్టు 15 వరకు ఏకకాలంలో రుణమాఫీ చేసి తీరుతారని స్పష్టం చేశారు. హరీష్ రావు స్పీకర్ ఫార్మాట్లో కాకుండా రాజీనామా లేఖను రాజకీయం చేశారన్నారు. హరీష్ రావు రాజీనామా లేక వృధా కానివ్వమని.. ఆగష్టు 15 తర్వాత కచ్చితంగా రాజీనామాను ఆమోదింపజేసే బాధ్యత తానే తీసుకుంటానని తెలిపారు. శాసనసభ వ్యవహారాల మంత్రిగా పని చేసిన హరీష్‌కు రాజీనామా ఎలా చేయాలో కూడా తెలీదా అని ప్రశ్నించారు. కేవలం రాజకీయం కోసం వచ్చి డ్రామాలు అడుతున్నారని విమర్శించారు. ఆగస్ట్ 15వ తేదీ లోగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తే సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు బీఆర్ఎస్ రద్దు చేస్తారో? లేదో? కేసీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు. "హరీష్ రావు ఆగష్టు 15 తర్వాత మీ రాజీనామా ఆమోదం చెందేలా ఎమ్మెల్సీగా నేను బాధ్యత తీసుకుంటాను. నిజంగా మీకు చిత్తశుద్ధి ఉంటే దొంగలా వచ్చి వెళ్ళడం కాదు. పదేళ్లలో మీరు ఏం చేశారో చెప్పండి.. రండి ఎమ్మెల్సీగా నేను మీకు సవాల్ విసురుతున్నాను" అంటూ బల్మూర్ వెంకట్ వ్యాలు చేశారు.

చురకలు

## సంపాదకీయం

# ఏపీలో కాంగ్రెస్ ఉనికి అక్కడ ఉంటుందా ?

నిజమేనా గుర్రం ఎగరావచ్చు అంటే అది కాంగ్రెస్ విషయంలో నిజమవుతుందా. ఏపీలో నోటా కంటే తక్కువ ఓట్లు తెచ్చుకున్న కాంగ్రెస్ కి 2024 ఎన్నికలు దశ మారుస్తాయా అంటే అవును అనేలా ఒక పరిణామం కనిపిస్తోంది. అదే ఒంగోలు జిల్లాలో కాంగ్రెస్ కి గెలుపు ఆశలు ఉన్నాయని అంటున్నారు. ఏపీలో మొత్తం 175 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. అందులో ఎక్కడా కాంగ్రెస్ కి ఆశలు లేవు. ఆఖరుకు ఆ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల పోటీ చేస్తున్న కడప ఎంపీ సీటులో కూడా ఆశలు అయితే లేవు. కానీ ఒంగోలులోని చీరాలలో మాత్రం కాంగ్రెస్ ఎంతో కొంత ఉనికి చాటుకునే చాన్స్ ఉందని అంటున్నారు. దానికి కారణం కాంగ్రెస్ బలం కాదు మాజీ ఎమ్మెల్యే ఆమంచి క్రిష్ణ మోహన్ అని అంటున్నారు. ఆయన 2009లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో ఇండిపెండెంట్ గా గెలిచారు. 2019లో వైసీపీ తరఫున పోటీ చేసినా ఓటమి వరించింది. ఈసారి ఆయనకు వైసీపీ టికెట్ ఇవ్వలేదు. దాంతో ఆయన పార్టీ మారి కాంగ్రెస్ నుంచి చీరాలలో పోటీ చేస్తున్నారు. దాంతో ఈసారి ఆయన తన బలాన్ని ఎంతో కొంత చాటుకుంటారు అని అంటున్నారు. నిజానికి చూస్తే 2014 విభజన అనంతరం కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేక ఏర్పడిన నేపథ్యంలో అప్పటివరకు కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడుగా ఉన్న ఆమంచి ఇండిపెండెంట్ గా పోటీ చేసి తెలుగుదేశం అభ్యర్థి పోతుల సునీతపై 10 వేల 335 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అదే క్రిష్ణ మోహన్ 2019లో వైసీపీ నుంచి పోటీ చేస్తే తెలుగుదేశం పార్టీ నుంచి పోటీ చేసిన కరణం బలరామకృష్ణమూర్తి 17వేల పై చిలుకు ఓట్లతో ఘనవిజయం సాధించారు. అయితే తనకు సొంత బలం ఉందని భావిస్తూ ఆమంచి క్రిష్ణ మోహన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన మరోసారి తన రాజకీయ అదృష్టాన్ని చూసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ తరఫున కరణం బలరామకృష్ణమూర్తి తనయుడు కరణం వెంకటేష్ పోటీ చేస్తుండగా తెలుగుదేశం పార్టీ తరఫున ఎంఎం కొండయ్య యాదవ్ పోటీకి దిగారు కాంగ్రెస్ పార్టీ తరఫున ఆమంచి కృష్ణమోహన్ రంగం లోకి దిగి పోటీని రసవత్తరం గా మార్చారు. ఈ నేపథ్యంలో ఓటరు నాడి ఎలా ఉంటుంది అన్నది చూడాల్సి ఉంది అని అంటున్నారు. కాంగ్రెస్ ఏపీలో ఎక్కువ చోట్లనే పోటీ చేస్తోంది. కానీ ఎక్కడా గెలుస్తామని గ్యారంటీ అన్నది అయితే లేదు. కానీ ఎందుకో చీరాల సీటు విషయంలో మాత్రం ఉనికి చాటుకునే ప్రయత్నం అయితే ఉంది. ఒకవేళ ఇక్కడ కాంగ్రెస్ సత్తా చూపినా ఆ క్రెడిట్ పూర్తిగా క్రిష్ణ మోహన్ అకౌంట్ లోకే అని అంటున్నారు. అంతే కాదు రేపటి రోజున ఆయన గెలిచిన కాంగ్రెస్ లో ఉంటారా అన్న సందేహాలు వ్యక్తం చేస్తున్న వారూ ఉన్నారు.

# విశాఖ ఉక్కు కర్మాగారం సాధించిన పోరాట యోధుడు అమృత రావు - ఏప్రిల్ 27...తమనంపల్లి అమృతరావు వర్ధంతి



తమనంపల్లి అమృతరావు. ఈ పేరు చాలా మందికి తెలియదు. 57 ఏళ్ళక్రితం విశాఖలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు పెద్ద ఎత్తున ఉద్యమం జరిగింది. ఒక పోరాట యోధుని మొండి పట్టు, మొక్కవోని దీక్షతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి విశాఖలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు సఫలం కాగా, నేడు కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు, పోరాడి తెచ్చుకున్న ఫ్యాక్టరీ ప్రైవేటు పరం కాబోతోంది. ఈ నేపథ్యంలో నాడు విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం దీక్షా దక్షులై విజయం సాధించి గొప్ప పోరాట యోధుని గుర్తుకు చేసుకోవాల్సిన తరుణం, సందర్భం. విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు 57ఏళ్లు దాటినా తెలుగు ప్రజల హృదయాలలో ప్రతిధ్వనిస్తున్న నినాదమది. మరచి పోలేని జ్ఞాపకాలను ఇప్పటికీ గుర్తించే అలాంటి నినాదాన్ని అమృత తుల్యం చేసి, శాశ్వతం చేసిన మహనీయుడు తమనంపల్లి అమృతరావు. అలా ఉక్కు పరిశ్రమను ఏర్పాటు, తద్వారా ఆధునిక విశాఖ నిర్మాణంలో ఆయన పాత్ర అపూర్వం, అనిర్వచనీయం. అమోఘం. 1920 అక్టోబరు 21 తేదీన గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం విశదల గ్రామంలో ఆరుళప్ప అన్నమ్మ దంపతులకు జన్మించారు. చిన్న తనం నుండి రాజకీయాల మీద ఆసక్తి ఎక్కువ ఉండేది. కర్నూలు జిల్లా డోన్లో విద్యాభ్యాసం చేసిన అమృతరావు చిన్న వయస్సు లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు జీవితం గడిపారు. నేతాజీ స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో కొంతకాలం పనిచేశారు. నైజాం ప్రాంతంలో జరిగిన రజాకార్ల ఉద్యమంలో పాల్గొన్న అమృత రావు నిజాం రైల్వే శానిటరీ ఉద్యోగ సంస్థ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. భాషా ప్రాతి పదికన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రకాశం పంతులు నివాస గృహం ఎదుట నిరాహార దీక్ష చేశారు. పొట్టి శ్రీరాములు చేస్తున్న దీక్ష నేపథ్యంలో పలువురు రాష్ట్ర నాయకుల సూచన మేరకు నిరాహార దీక్షను విరమించారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని కేంద్రం అప్పట్లో ప్రకటన చేసినా కూడా అది ఆచరణకు నోచుకోలేదు. దాంతో, రాష్ట్ర, కేంద్ర పాలకుల ఉదాశీనత ఓ వైపు, మరో వైపు ఉక్కు పరి శ్రమ వేరే రాష్ట్రాలకు తరలి పోతుందన్న ఆందోళన నేపథ్యంలో చెప్పిన మాటకు కట్టుబడి విశాఖలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాల్సిందేనని ఎలుగెత్తి అరచి ఒకే ఒక గొంతు అమృతరావుదే. అంతవరకూ విశాఖకు ఉక్కు పరిశ్రమ కావాలని కోరిన వారే తప్ప దాని, ఆచరణాత్మక కార్యక్రమాలు చేపట్టింది లేదు. పతాకస్థాయికి చేర్చి భారీ ఉద్యమాన్ని నిర్మించిన ఘనత మాత్రం అమృతరావుదే నని చెప్పాలి. ఆ 1966 సంవత్సరం అక్టోబర్ నెల 14వ తేదీ ఆరో ఓ మహోద్యమానికి శ్రీకారం చుట్టిన రోజు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 56 రోజులు అకుంఠిత దీక్ష చేపట్టి, అమరణ దీక్షలోనే అసువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు బాటను నడచి, చరిత్ర గర్వించిన మరో గొప్ప ఉద్యమానికి ఆవిష్కరణ జరిగిన రోజు. అదే "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" నినాదంతో అమృతరావు చేపట్టిన పోరు. అమృతరావు విశాఖ కలెక్టరేట్ వద్ద ఆమరణ దీక్ష చేపట్టగా.. "విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు"నినాదంతో ఆంధ్ర దేశాన్ని కుదిపేసింది. ఆ ఉద్యమంలో 32 మంది ప్రాణాలను కోల్పోయారు. విద్యార్థులు బందులు నిర్వహించారు. ఈ దీక్ష రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, విద్యార్థులను కదిలించింది. వామపక్షాలను ఉద్యమం వైపు అడుగులు వేయించింది. అన్ని రాజకీయ పక్షాలతో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో తెన్నేటి విశ్వనాథం, యం.వి.భద్రం, రావిశాస్త్రి, చౌదరి సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. అమృతరావు దీక్షకు మద్దతుగా జనసంఘ్ పార్టీ నాయకులు, ప్రజాపార్టీ నాయకులు దీక్ష చేశారు. రోజులు గుదు స్తున్నా. ఆరోగ్యం క్షీణిస్తున్నా కూడా అమృతరావు వెనక్కు తగ్గలేదు. మొక్కవోని దీక్షతో ఉక్కు కల్పమే చూపించారు. అమృతరావు దీక్ష విరమింప జేయాలని నాటి పీసీసీ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వావిలాల గోపాలకృష్ణయ్య, అప్పుడు దొర, భాట్టం శ్రీరామ్మూర్తి కొందరు కాంగ్రెస్ నాయకులు కేంద్రాన్ని కోరారు. అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పాటు, ఎంపీలు, మంత్రులు అంతా కూడా ఆయనను దీక్ష నుంచి విరమించు కోమని కోరారు. అదేం కుదరదు కచ్చితమైన ప్రకటన రావాల్సిందే, లేదా నా చావును అంతా చూడాల్సిందేనని భీష్మించుకు కూర్చున్నారు. కాసు బ్రహ్మానందరెడ్డి ఆఘమేఘాల మీద ఢిల్లీకి వెళ్లి అక్కడి పెద్దలను కలసి విశాఖ ఉక్కు ఉద్యమాన్ని గురించి వివరించారు. అప్పటికే కొత్తగా ప్రధానమంత్రి అయిన శ్రీమతి ఇందిరాగాంధీ దృష్టిలో విశాఖ ఉక్కు ఉద్యమం పడింది. అమృతరావు మొండితనాన్ని గురించి ఆమె తెలుసుకున్నారు. విశాఖలోనే ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని లిఖిత పూర్వకంగా ఇచ్చారు. కాసు బ్రహ్మానందరెడ్డి విశాఖకు నేరుగా వచ్చి, కలెక్టరేట్ వద్ద దీక్షలో ఉన్న అమ్మృతరావుకు కేంద్రం ప్రకటనను వినిపించి, నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప చేశారు. ఆ విధంగా విశాఖలో 1971లో ఉక్కు కర్మాగారం ఏర్పడింది. ఆయన సతీమణి చిరంజీవి కూడా గుంటూరులో విశాఖ ఉక్కు కోసం పది రోజులు ఆమరణ దీక్ష చేయడం గమనార్హం. అమృతరావు తమ జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేయదలచి గాంధీజీ మిషన్ అనే సంస్థను స్థాపించారు. 1956లో ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి మధ్య నిషేధ కార్యకర్తల మండలికి సభ్యులయ్యారు. గుంటూరు పట్టణం లో పొట్టి శ్రీరాములు నగర్ ఏర్పాటుకు కృషి చేసి వందలాది నిరు పేదలకు వసతి సౌకర్యం కలిగించారు 1971లో జై.ఆంధ్ర ఉద్యమంలో ఆది ఆంధ్ర సేవను స్థాపించారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులతోవారి అభ్యున్నతికి కృషి చేశారు. అమృతరావు హైదరాబాద్ జంట నగరాలలో సెట్విన్ బస్సుల ఏర్పాటుకు కృషి చేశారు. జాతీయ ప్రొహిబిషన్ కౌన్సిల్ సభ్యుడిగా వ్యవహరించారు. మన పుణ్యభూమి వారపత్రికకు సంపాదకులుగా వ్యవహరించిన అమృతరావు 1989 ఏప్రిల్ 27న కన్నుమూశారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# తెలంగాణ సాధనలో తెరాస పాత్ర సింహావలోకనం - ఏప్రిల్ 27... తెరాస (భారాస) ఆవిర్భావ దినం




తెలంగాణ రాష్ట్ర చరిత్రలో ఏప్రిల్ 27 మరిచి పోలేని రోజు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా తె.రా.స పార్టీ ఆవిర్భవించిన రోజు. ఆనాడు కేసీఆర్ మరి కొందరి భాగస్వామ్యంతో తె.రా.స ఉద్యమ పార్టీ ఏర్పాటు జరగక పోతే, నేటి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తెలంగాణ ప్రజల చిర కాల వాంచితంగానే మిగిలి పోయి ఉండేదేమో. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన తొలి దశలో ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమం స్వార్థ ప్రయోజనాల కారణంగా చల్లారి పోగా, మలి దశ ఉద్యమం కేసీఆర్ సమర్థ నాయకత్వం, వ్యూహాత్మక ఎత్తుగడలు, ప్రణాళికా బద్ధమైన కార్యక్రమాలు, రాజకీయ జేఏసీ ఏర్పాటు, ఉద్యోగ, స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు, గ్రామ గ్రామాన ఉద్యమ రూపాలు, ప్రధానంగా ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని కల్పించిన నేపద్యం వెరసి లక్ష్య సాధనకు దోహదం అయింది. తొలిదశ తెలంగాణ ఉద్యమం, మలిదశలో తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ ప్రారంభించిన కార్యక్రమాలు కేసీఆర్ పై తొలగని ప్రభావం చూపాయి. 2001లో కొత్తగా ఉత్తరాఖండ్, జార?ండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఏర్పాటు నేపద్యం తెలంగాణ ఏర్పాటు సాధ్యాసాధ్యాల గురించి చర్చలకు తెర లేపాయి. ఈ క్రమంలోనే తెలంగాణ ఉద్యమకారులతో ఏర్పాటుచేసిన సమావేశాల్లో రాష్ట్ర సాధన ఉద్యమం గురించి కేసీఆర్ విస్తృతంగా చర్చించారు. ఫలితంగా ప్రజల మనోభావాలకు అనుగుణంగా, తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటుచేయాలన్న ఆలోచనను బలపరిచాయి. ఫలితంగా, 2001 ఏప్రిల్ 27 న కల్వకుంట్ల చంద్రశేఖరరావు అప్పటి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి పదవికి, శాసనసభా సభ్యత్వానికి, తెలుగుదేశం పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి, తన ఆలోచనలతో ఏకీభవించిన కొందరు నాయకులతో కలిసి తెరాసను ఏర్పాటు చేశారు. నిజాం మనుమరాలు సలీమా బాషా (అస్మత్ బాషా కుమార్తె), ఆమె కుమార్తె రఫత్‌షా ఆజంపురాలు తెలంగాణకు మద్దతు ప్రకటించారు. పాతబస్తీలోని ముస్లిం వర్గాలు తెలంగాణకు వ్యతిరేకం కాదని అన్నారు. 2001 ఏప్రిల్ 27న కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసం జలదృశ్యంలో టీఆర్?ఎస్? పార్టీ పురుడు పోసుకుంది. సుదర్శన్ రావు, నాయిని నర్సింహారెడ్డి, హన్మంతరావు, గాదె ఇన్నయ్య, వి. ప్రకాశ్ , నిమ్మ నర్సింహారెడ్డి, నారాయణరెడ్డి, గొట్టె భూపతి, మందాడి సత్యనారాయణరెడ్డి, హరీశ్ రావు తదితరులు ఆనాటి కార్యక్రమంలో పాల్గొన్న వారిలో ఉన్నారు. సుమారు ఏడాదికి పైగా జలదృశ్యం లోనే టీఆర్ ఎస్ పార్టీ కార్య కలాపాలు సాగాయి. 2001 మే 17న కరీంనగర్ ఎస్ ఆర్ ఆర్ కాలేజీ గ్రౌండ్ లో నిర్వహించిన బహిరంగ సభ ఉమ్మడి ఏపీ రాజకీయాల్లో పెను మార్పులకు బీజం వేసింది. జేఎంఎం చీఫ్ , అప్పటి జార?ండ్ సీఎం శిబూ సోరెన్ ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొన్ని రోజుల తర్వాత తెలంగాణ రాష్ట్ర సమితి కార్యకలాపాలు నందినగర్ , హైదరాబాద్ లోని కేసీఆర్ నివాసానికి మారాయి. ఆరు నెలల తర్వాత ఎమ్మెల్యే కాలనీలోని మాజీ మంత్రి వేదంతరావు ఇంటికి పార్టీ కార్యాలయాన్ని మార్చారు. 2004లో వైఎస్ ప్రభుత్వం బంజారాహిల్స్ రోడ్? నంబర్? 12లో ప్రస్తుతం తెలంగాణ భవన్? ఉన్న స్థలాన్ని టీఆర్ఎస్ కు కేటాయించింది. రేకుల షెడ్డు వేసి టీఆర్?ఎస్? పార్టీ ఆఫీసు నిర్మాణాన్ని ప్రారంభించారు. 2006లో తెలంగాణ భవన్ ను ప్రారంభించారు. పార్టీకి సైద్ధాంతిక భూమిక కల్పించడం దగ్గర్నుంచి కార్యాచరణను నిర్దేశించడం వరకు , తెలంగాణ సమాజాన్ని, దేశ రాజకీయ వ్యవస్థ స్వభావాన్ని లోతుగా అధ్యయనం చేసి, అర్థం చేసుకుని, తెలంగాణ ఉద్యమ వ్యూహానికి రూపకల్పన చేశారు కేసిఆర్. స్ట్రీట్ ఫైట్ స్థానంలో స్టేట్ ఫైట్ ఉండాలని భావించి , అందుకు వాహకంగా తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్ )ని ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దారు. 2004 లో టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల పొత్తు పెట్టుకుని, టిఆర్ఎస్ 26 మంది ఎమ్మెల్యేలను, 5 మంది ఎంపిలను గెలుచుకుంది. తద్వారా శాసనసభ, లోకసభలలో స్థానాలను పొందింది. టిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ కేంద్ర మంత్రిగా కొంతకాలం పనిచేశారు. కొంతకాలం పోర్ట్‌ఫోలియో లేకుండా కూడా కొనసాగారు. 2006 లో తన మంత్రిత్వ శాఖకు రాజీనామా చేశారు. సెప్టెంబర్ 2006 లో కెసిఆర్ కరీంనగర్ లోక్ సభ స్థానానికి రాజీనామా చేసి ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో గెలిచారు. ఏప్రిల్ 2008 లో, టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలచే రాజీనామా చేయించి, రాష్ట్ర ప్రభుత్వం నుండి వైదొలిగారు. కానీ, ఈ ఉప ఎన్నికలో టిఆర్ఎస్ 7 ఎమ్మెల్యే, 2 లోక్ సభ స్థానాలను మాత్రమే నిలుపుకో గలిగింది. 2009 ఎన్నికలలో టిడిపి పొత్తుతో టిఆర్ఎస్ 10 ఎమ్మెల్యే సీట్లు, 2 ఎంపి సీట్లు మాత్రమే గెలుచుకో గలిగింది. తెలంగాణ రాష్ట్ర సమితి 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు, నాటి కాంగ్రెస్ అధినేత్రి సోనియాతో కరీంనగర్‌లో ప్రత్యేక తెలంగాణ ఇస్తామని ప్రకటింప జేయడం, రాష్ట్రపతి ప్రసంగంలో తెలంగాణ అంశాన్ని చేర్చడం, యూపీఏ కనీస ఉమ్మడి ప్రణాళిక (కామన్ మినిమమ్ ప్రోగ్రాం)లో తెలంగాణ అంశం చేర్చడంలో టీఆర్ఎస్ విజయం సాధించింది. తెలంగాణకు అనుకూలంగా దాదాపు 36 పార్టీలు లేఖ ఇవ్వడంలో ఢిల్లీ వేదికగా టీఆర్ఎస్ పార్టీ కృషి చేసింది. "కేసీఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో" అంటూ కేసీఆర్ నవంబర్ 29, 2009 న, కేసిఆర్ నిరవధిక నిరాహార దీక్షను చేపట్టారు. ఆయన దీక్షతో తెలంగాణలో ఉద్యమం ఉధృతం అయింది. డిసెంబర్ 7 న అఖిలపక్ష సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చింది. దీంతో దిగివచ్చిన యూపీఏ2 ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటు దిశగా ప్రక్రియ ప్రారంభిస్తామంటూ 2009 డిసెంబర్ 9న ఒక ప్రకటన చేసింది. కానీ, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి నిరసనలు వెల్లువెత్తడంతో డిసెంబర్ 23న ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. తెలంగాణ ఏర్పాటుపై అందరి అభిప్రాయాలను సేకరించేందుకు శ్రీకృష్ణ కమిటీని ఏర్పాటు చేసింది. తెలంగాణ జెఏసి, అనేక సంస్థలు, ప్రొఫెసర్ కోదండరం దాని ఛైర్మన్‌గా టిజెఎస్ ప్రారంభించిన పలు ఆందోళనలు, నిరసనలలో టిఆర్ఎస్ గ్రామస్థాయి నుండి చురుకుగా పాల్గొన్నారు. ఈ రాజకీయ ఐక్య కార్యాచరణ కమిటి ప్రత్యేక తెలంగాణ కోసం కేంద్రంపై ఒత్తిడిని తీవ్రం చేసింది. 2010 డిసెంబర్ 16న వరంగల్‌లో టీఆర్ఎస్ తలపెట్టిన మహా గర్జనకు 20 లక్షల మంది హాజరు అయ్యారు. శ్రీకృష్ణ కమిటీ నివేదిక సమర్పణ తర్వాత 2011 జనవరి నుండి టీఆర్ఎస్ అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో భాగంగా 2013 అక్టోబర్‌లో తెలంగాణ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2014 ఫిబ్రవరి 18న లోక్‌సభ, 20న రాజ్యసభ ఆమోదం తెలిపింది. మరో వైపు 2014 ఏప్రిల్‌లో సాధారణ ఎన్నికలు జరుగగా, మే 16న ఫలితాలు వచ్చాయి. తెలంగాణలోని 119 అసెంబ్లీ స్థానాలకు గాను టీఆర్ఎస్ 63, 11లోక్‌సభ స్థానాలను గెలుపొందింది. దీంతో తెలంగాణలో జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావంతో పాటు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. 2018 డిసెంబరు 7 న జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ 88 స్థానాల్లో గెలుపొంది ఘనవిజయం సాధించి, డిసెంబరు 13 గురువారం మధ్యాహ్నం 1:25 నిమిషాలకు రాజ్ భవన్‌లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేశారు. మలి సారి పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ధ్యేయంగా పార్టీని స్థాపించిన ఉద్యమ నేత కేసీఆర్ రెండు సార్లు అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా స్వయం పాలనా పగ్గాలు చేపట్టారు. తెలంగాణలోని సంఘాలు, విద్యార్థులు, రాజకీయ నేతల సహాయంతో ఉధృతంగా ఉద్యమం చేసి, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన టీఆర్?ఎస్, ఎన్నో ఆటుపోట్లను చవిచూసింది. ఎందరో పార్టీని వీడి వెళ్ళారు. ఎందరో చేరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పూర్తి స్థాయి బలమైన రాజకీయ పార్టీగా మారింది. కేసిఆర్ నేతృత్వంలో ప్రస్తుతం భారతీయ రాష్ట్ర సమితిగా పేరు మార్చుకుని, రాష్ట్ర రాజకీయాలలో కీలక పాత్ర పోషిస్తూ , ఇటీవలి సాధారణ ఎన్నికల్లో ఓటమిని చవి చూసి, అధికారాన్ని కోల్పోయి, ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ, గడ్డుకాలంలో కొట్టుమిట్టాడు తున్నది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సంకట హర చతుర్థి

కృష్ణ పక్ష చతుర్థిని సంకష్ట హర చతుర్థి అంటారు. సంకట హర చతుర్థి మంగళవారం నాడు వస్తే అంగారక సంకష్ట చతుర్థి అంటారు. వినాయకుని ఆరాధకులు సంకట వినాయక వ్రతం అనేది అత్యంత ప్రాముఖ్యమైన వ్రతంగా భావిస్తారు. ఆ రోజు అంతా ఉపవాసం వుండి సంకట గణేష పూజ సాయంకాలం జరిపి, చంద్రదర్శనం అయినాక వారి ఉపవాసంకు ముగింపు పలికి ఏదన్నా తింటారు. సంకట చతుర్థి ప్రాముఖ్యత భవిష్య పురాణంలోనూ నరసింహ పురాణంలోనూ చెప్పబడింది. సంకట చతుర్థి మహత్యం శ్రీ కృష్ణుడు యుధిష్టరునికి వివరించాడు. సంకట అంటే కష్టములు, ఇబ్బందులు, సమస్యలను హర అంటే హరించేది అని అర్థం. ఋగ్వేదంలో గణపతి వేదాలు, జ్ఞానములకు, కర్మిష్టులకు, సర్వవ్యాపక భక్తుల ప్రభువని సర్వగణాలకు అధిదేవతని, సర్వా హ్లాదకరుడని, సర్వులకు జ్యేష్టుడని, అధినాయ కుడని, ఉత్తమ కీర్తి సంపన్నుడని కీర్తించబడ్డాడు. గణపత్యథర్వ శీర్ణోపనిషత్తులో గణపతి సర్వవ్యాప్తమైన పరబ్రహ్మ స్వరూపమని సృష్టి స్థితి లయములకు కారకుడని, సర్వ కార్యము లకు సృష్టికి కర్త హర్త అని ఆనందమయుడని చిమ్మయుడని, లంబోదరుదని, శూర్పకర్ణుడు రక్తంగుడిగా అభివర్ణించారు. అటువంటి గణపతి సంకటాలను దూరం చేసేవాడని సంకట హరుడుగా పూజించడం అనాదిగా వస్తున్నదే. సంకటహరుని పూజించడానికి కృష్ణ పక్ష చతుర్థి ప్రసిద్ధి. సంకట హర చతుర్థి గురించి శ్రీకృష్ణుడు, ధర్మ రాజుకు వివరించినట్లు పురాణ కథనం. భవిష్య, నరసింహ పురాణాల ప్రకారం, ఒక సారి ఇంద్రుడు, గణేశ ఉపాసకుడైన భృషుండి అనే మహాముని ఆశ్రమం నుండి, విమానంపై ఇంద్ర లోకానికి తిరిగి వెళుతూ, శూరసేన మహారాజు రాజ్యం మీదుగా వెళ్ళే సమయాన మహా పాపాత్ముడొకడు, విమానాన్ని చూసినంతనే విమానం నేలపై దిగి పోతుంది. తేజో విరాజితమైన విమానాన్ని శూరసేనుడు చూడబోయి, ఇంద్రుడిదని తెలుసుకుని, ఆగి పోవడానికి కారణమడిగి ఇంద్రుని ద్వారా విని, మళ్ళీ లేచే ఉపాయం ఏదని




అడుగుతాడు. ఆనాడు బహుళ పంచమి ఐనందున, గత దినం చతుర్థినాడు ఉపవసించిన భక్తులు ఉపవాస ఫలాన్ని దారబోస్తేనే, విమానం మళ్ళీ లేవగలదని ఇంద్రుడు వివరిస్తాడు. శూరసేనుని ఆజ్ఞాను వర్తులైన సైనికులు రాజ్యమంతా వడబోసినా అట్టి భక్తులు దొరకనిస్థితిలో నిరాశకు లోనుకాగా, ఆసమయం లోనే మృతి చెందిన ఒక స్త్రీని గణపతి దూత తీసుకెళుతుండడం చూసి ఇదేమిటని సైనికులు అడుగుతారు. ఆమె గతదినం నిద్రలో ఉపవాసంతో ఉండి, రాత్రి చాలాసేపైనాక మెలకువ వచ్చి భోజనం చేసిందని, తెల్లవారి మృతి చెందినదని, అలాగే జీవితంలో ఒకసారైనా సంకటహర చతుర్థి ఆచరిస్తే గణపతి లోక ప్రాప్తి లభించగలదని చెప్పారు. ఆమె శరీరాన్ని తమకు ఇవ్వాలని సైనికులు కోరగా, గణపతి దూత నిరాకరిస్తాడు. అదే సమయంలో ఆమె శరీరం నుండి వీచిన పెనుగాలి ఇంద్రుని విమానాన్ని స్పృశించిన వెంటనే అది పైకి లేస్తుంది.

**సంకట హర చతుర్థి ప్రత్యేకత** : ...కృష్ణ పక్ష చతుర్థి సంకష్టహర, సంకటహర చతుర్థి అంటారు. ఈరోజు దినమంతా ఉపవాస ముండి, సాయంత్రం, నిశి పూజ, చంద్రదర్శనానంతరం భోజనాలు చేయడం, నిర్దేశిత ఆచారం. ఇలా చేస్తే సకల కష్టాలు, సంకటాలు తొలగి పోయి, సంకట నాశకుడైన విఘ్న నాయకుని కృపకు పాత్రులు, జన్మరాహిత్యం . మోక్షం సిద్ధించి, సప్త జన్మలు అవసరం లేకనే శాశ్వత గణేశ ప్రాప్తి కలుగనున్నట్లు పురాణాలు వివరిస్తున్నాయి. తలపెట్టిన పనులకు విఘ్నాలు కలుగుతూ అశాంతి, మానసిక, శారీరిక రుగ్మతలు, రుణ బాధలు, అనేక కష్టాలు కలుగుతున్నప్పుడు దుష్టగ్రహ పీడన నివారణ కొరకై ప్రతి నెలా సంకష్టహర చవితి నాడు యథాశక్తి విఘ్నేశ్వరుని పూజలు జరపడం సంప్రదాయం. కృష్ణపక్ష చవితి తిథి మంగళవారంతో కూడి వస్తే అంగారక చతుర్థి అంటారు. సంకట హర చతుర్థి నాడు కలశ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహా గణపతి అధర్వ శీర్ష పూజలు, అభిషేకం, అష్టోత్తర అర్చనలు, నివేదన, హారతి, మంత్రపుష్పం, నీరాజన, తీర్థ ప్రసాద వితరణాది సాంప్రదాయక క్రతువులను నిర్వహించడం, భక్తుల గోత్రనామాదులతో ప్రత్యేక అర్చనలు, గణపతి ఉపనిషత్ యుక్త అభిషేకాదులను నిర్వహించుకోవడం, భక్తులు తమ స్వగృహాలలోనూ గణపతి పూజ లొనరించి రాత్రి చంద్ర దర్శనానంతరం అరగించడం సనాతన సంప్రదాయం. వినాయకుని అనుగ్రహ ప్రాప్తికై, కుజుడు చేసిన తపస్సు ఫలితంగా, మాఘ కృష్ణ చతుర్థి దినాన చంద్రోదయ వేళలో పది భుజాలు కలిగిన బాలుని రూపంలో ప్రత్యక్షమై ఆ నాడు మంగళవారం కనుక కుజుని పేరు మంగళుడని నామకరణం చేసి, అంగారక సంకష్ట చతుర్థి నాడు వినాయక వ్రతాచరణ ద్వారా కుజ దోష సమస్యలు తొలగి పోగలవని, సంకటాలన్ని తొలిగి సఫలత లభించగలదని వరం ప్రసాదించారని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు



# బడికి నిధులు

ఆలేరు : యాదాద్రి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ పూర్తి కావొచ్చింది. జిల్లాలో 712 పాఠశాలలు ఉండగా గతంలో 251 పాఠశాలల్లో మన ఊరు-మనబడి ప్రణాళికలో వివిధ పనులు చేపట్టారు. సుమారు 150 పాఠశాలల్లో పనులు చేపట్టగా మిగతా 101 పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు మౌలిక వసతులకు నోచుకోని పాఠశాలలు 583 ఉన్నట్లుగా గుర్తించారు.

చేపట్టనున్న పనులు..ప్రధానంగా మరుగుదొడ్లు, బాలికల మూత్రశాలలు, విద్యుత్తు, తాగునీరు, తరగతి గదుల మరమ్మతులు చేపడతారు. మొదటి విడతగా మౌలిక వసతుల కల్పన, స్కూల్ యూనిఫాం కుట్టుకూలీ కోసం 25 శాతం నిధులు మంజూరు చేస్తారు. పాఠశాలలకు మంజూరైన నిధులను మొదటగా ఎంపీడీవోల ఖాతాల్లో జమ కానున్నాయి. పాఠశాలల్లో గరిష్ఠంగా రూ.14 లక్షలు, కనిష్ఠంగా రూ.1.35 లక్షలతో పనులు గుర్తించారు. అమ్మ ఆదర్శ కమిటీల తీర్మానం మేరకు పనులు చేపట్టనున్నారు.

నిధుల డ్రా ఇలా..పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి మౌలిక




వసతుల పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో బ్యాంకు ఖాతాలు తెరిపించారు. రూ.25వేల విలువైన పనులు చేపట్టిన అనంతరం అమ్మ ఆదర్శ కమిటీలు సమావేశమై నిధులను బ్యాంకు నుంచి తీయాల్సి ఉంటుంది. రూ.లక్ష వరకు అయితే ఎంపీడీవో అనుమతితో బ్యాంకు ఖాతా నుంచి తీయాల్సి ఉంటుంది. లక్ష రూపాయలకు పైబడి విలువైన పనులను చేపడితే జిల్లా మహిళా సమాఖ్యతో పాటు, జిల్లా ఉన్నతాధికారి అనుమతితో నిధులు డ్రా చేయాల్సి ఉంటుంది.

త్వరలో ప్రారంభిస్తాం

నారాయణరెడ్డి, డీఈవో, యాదాద్రి భువనగిరి

పాఠశాలల్లో అవసరమైన పనులకు సంబంధించి ప్రతిపాదనలు పూర్తయ్యాయి. త్వరలో పనులు ప్రాంభమవుతాయి. రానున్న విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అమ్మ ఆదర్శ కమిటీలతో చేపట్టనున్న పనులు పూర్తయితే పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు సమకూరుతాయి.

# పాఠాలకు బై.. ఆటలకు సై..!

నల్గొండ : వేసవి సెలవులు వచ్చేశాయ్.. పది నెలల పాటు నిత్యం బడుల్లో పాఠాలు చదవడం, రాయడం తదితర పనుల్లో నిమగ్నమై ఉన్న చిన్నారులకు ఈ నెల 24 (బుధవారం) నుంచి మొదలయ్యే సెలవులతో ఉపశమనం లభించింది. సెలవుల సమయంలో పిల్లలకు వినోదంతో పాటు విజ్ఞానం అందిస్తే వారిలో మానసిక వికాసం వృద్ధి చెందుతుంది. పది మందిలో ఎలా ఉండాలి..? బంధువులు, కుటుంబ సభ్యులతో ఎలా వ్యవహరించాలో తల్లిదండ్రులు మార్గనిర్దేశం చేయాల్సిన అవసరం ఉంది. కొందరు అమ్మమ్మ, నానమ్మల ఊళ్లకు పంపుతుంటారు. అక్కడ కొత్త విషయాలు నేర్చుకుంటారు. మరి కొందరు అదనపు నైపుణ్యాల పెంపునకు శిక్షణ శిబిరాలకు పంపిస్తుంటారు. ఇవన్నీ వారి ఉన్నతికి దోహద పడేవే. ఇటీవల జిల్లాలోని ఓ పాఠశాల యాజమాన్యం వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విడుదల చేసిన లేఖ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. అదే విధంగా సెలవుల్లో



ఎలా గడపాలో పిల్లలకు సూచనలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఆయా పాఠశాలలకు మార్గదర్శకాలను విడుదల చేసింది. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా మొత్తం 3,210 పాఠశాలలుండగా 2,11,009 మంది విద్యార్థులున్నారు.

ప్రభుత్వ పరంగా చిన్నారులకు సూచనలు..

ఆరుబయట ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ఆడుకోవాలి.

చెరువులు, కుంటలు, బావులు, నదుల్లోకి ఈతకు వెళ్లకూడదు.

మంచినీరు సరిపడా తాగాలి. నిమ్మరసం. కొబ్బరినీళ్లు వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలి.

బయటి చిరుతిళ్లు కాకుండా ఇంట్లో తయారు చేసిన తాజా ఆహారాన్ని మాత్రమే తినాలి.

వీలైనన్ని కథలు, జీవిత చరిత్రల పుస్తకాలు చదివించాలి.

చిత్రలేఖనంపై ఆసక్తి కలిగించేలా తల్లిదండ్రులు ప్రేరణ కల్పించాలి.

సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న లేఖ..

విద్యార్థుల తల్లిదండ్రులూ ఒక్కసారి ఆలోచించండి..

గత పది నెలలుగా మీ పిల్లలను మా పాఠశాలల్లో సంరక్షించాం. ఈ రెండు నెలలు మీతో గడుపుతారు. ఈ సమయం వారికి ఉపయోగకరంగా, సంతోషంగా ఉండేలా మేము మీకు కొన్ని చిట్కాలను అందిస్తున్నాం. అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం. మీ పిల్లలతో కలిసి భోజనం చేయండి. రైతుల కష్టం వివరించి, ఆహారాన్ని వృథా చేయనీయకండి. వారు భోజనం తిన్న ప్లేట్లను వారినే శుభ్రం చేయమనండి. దుస్తులు సర్దడం లాంటి చిన్న చిన్న పనులు వారితో చేయించండి. వంట తదితర పనుల్లో పిల్లల సహాయం తీసుకోండి. ఇరుగు పొరుగువారి ఇళ్లకు తీసుకెళ్లండి. సెలవుల్లో అమ్మమ్మ, నానమ్మల ఇంటికి పంపండి. అక్కడే వారితో కొన్ని రోజులు గడపనివ్వండి. వీలైతే పిల్లలను పని ప్రదేశాలకు తీసుకెళ్లాలి. తద్వారా కుటుంబ పెద్దలు పడే కష్టం వారికి అర్థం అవుతుంది. వారితో మొక్కలు నాటించి సంరక్షణ బాధ్యతలు అప్పగించాలి. మీ బాల్యంలోని జ్ఞాపకాలను వారితో పంచుకోవాలి. కుటుంబ చరిత్ర తెలియజేయాలి. రంగురంగు చిత్రాలతో కూడిన కథల పుస్తకాలు చిన్నారులకు బహుమతులుగా ఇవ్వాలి. పిల్లలను టీవీ, చరవాణి, కంప్యూటర్లు తదితర వాటికి దూరంగా ఉంచేలా శ్రద్ధ చూపాలి.

# ప్రజారోగ్యంతో బంతాట



హైదరాబాద్: కోటి మంది జనాభా ఉన్న హైదరాబాద్ నగరంలో ప్రజారోగ్యానికి భరోసా కొరవడింది. జీహెచ్ఎంసీ పరిధిలో ఆహారకల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం 24 మంది ఆహార భద్రతాధికారులను నియమించగా అందులో ప్రస్తుతం పనిచేస్తున్నది ఏడుగురు మాత్రమే. మిగిలిన వారిలో నలుగురు సెలవు పెట్టి పోటీ పరీక్షల సన్నద్ధతకు వెళ్లిపోయారు. ఓ వైపు ఆహారకల్తీ పెచ్చుమీరుతుండగా..అరికట్టాల్సిన అధికారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు.

తనిఖీలు లేవు..

జీహెచ్ఎంసీ పరిధిలో ఆహార పదార్థాలను విక్రయించే రకరకాల దుకాణాలు, వ్యాపార కేంద్రాలు, హోటళ్లు, రెస్టారెంట్లు 50 వేల వరకు ఉన్నాయి. వాటిలో ఏది నాణ్యమైన వస్తువు..? ఏది కాదనే విషయమై నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత జీహెచ్ఎంసీదే. బల్దియాలో పనిచేస్తున్న 24 మంది ఆహార భద్రతాధికారులు, 30 సర్కిళ్లలో పనిచేసే సహాయ వైద్యాధికారులు ఆయా విక్రయ కేంద్రాల్లో తనిఖీలు చేస్తూ.. ప్రజారోగ్యాన్ని కాపాడాలి. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల ఖాళీలను 90 శాతం భర్తీ చేసినా గ్రేటర్‌లో ఆశించిన ఫలితాలు రావడం లేదు.

నలుగురిపై చర్యలు

కమిషనర్, అదనపు కమిషనర్, జోనల్ కమిషనర్లు, ఉపకమిషనర్ల ఆధ్వర్యంలో పనిచేయాల్సిన ఎఫ్ఎస్ఓలలో కొందరు నెలకోసారి కూడా జోనల్ కమిషనర్లకు తనిఖీలపై వివరణ ఇవ్వడం లేదు. ఈ ఏడాది మార్చి 1న అధికారులు మౌలిక, సౌమ్య, రాకేశ్, నిహారిక దీర్ఘకాలిక సెలవు కోరుతూ ఆరోగ్య విభాగంలో లేఖ అందజేశారు. వీరు గ్రూప్-1 పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వెళ్లారని, సెలవు మంజూరు చేయలేదని జీహెచ్ఎంసీ చెబుతోంది. దీనిపై వివరణ ఇవ్వాలని ఇటీవల కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఆదేశించినా స్పందన లేకపోవడంతో వారిని సస్పెండ్ చేసినట్లు చెబుతున్నారు.

ప్రస్తుతం ఉన్నది ఏడుగురే..

టీఎస్‌పీఎస్సీ ద్వారా 26 మంది ఎఫ్ఎస్ఓలు నాలుగేళ్ల కిందట జీహెచ్ఎంసీలో నియమితులయ్యారు. కోర్టు కేసుల కారణంగా ఇద్దరు ఇప్పటికీ బాధ్యతలు తీసుకోలేదు. ఇటీవల ముగ్గురు బాధ్యతలు తీసుకుని శిక్షణ తీసుకుంటున్నారు. మిగిలిన 21 మందిలో ఒకరు ఉద్యోగానికి రాజీనామా చేయగా, నలుగురు తాజాగా సస్పెండ్ అయ్యారు. ఇద్దరు మహిళా అధికారులు ప్రసూతి సెలవులో ఉన్నారు. సీఎం వద్ద విధులకు ఇద్దరిని కేటాయించగా, నలుగురు ఎన్నికల విధులకు వెళ్లారు. ఒకరిని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ బృందానికి కేటాయించడంతో ప్రస్తుతం ఏడుగురు ఎఫ్ఎస్ఓలే ఉన్నట్లు యంత్రాంగం చెబుతోంది.

# బలం ఉంది.. భరోసా కొరవడింది




హైదరాబాద్ : రాజధాని పరిధిలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో భారాసకు బలమైన నేతలున్నారు. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశిస్తే చాలు దూసుకుపోయే క్యాడర్ ఉంది. ఈ నేతలు, క్యాడరే మొన్నటి శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీకి నగరంలో అఖండ విజయాన్ని సాధించి పెట్టారు. అదే క్యాడర్ లోక్‌సభ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా ఉండిపోయింది. ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్నా.. నియోజకవర్గ స్థాయి నేతలు, బల్దియా కార్పొరేటర్లు, క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు ముందుకు కదలడం లేదు. కొంతమంది ఎమ్మెల్యేలు తూతూమంత్రంగా పని చేస్తున్నారు. దీంతో పార్టీ అగ్రనేతలు ఒకవైపు ఆందోళన, మరోవైపు ఆగ్రహంతో ఉన్నారు. కాంగ్రెస్‌లోకి వలసలకు కట్టడి చేస్తూనే.. శ్రేణులను నడిపించడానికి అగ్ర నాయకత్వం కష్టపడాల్సి వస్తోంది.

మెజారిటీ ఎమ్మెల్యేలున్నా..

మొన్నటి శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. రాజధాని పరిధిలో మాత్రం ఫలితాలు పూర్తిగా భిన్నంగా వచ్చాయి. మొత్తం 29 నియోజకవర్గాలకు 18 మంది భారాస ఎమ్మెల్యేలు గెలవగా.. కాంగ్రెస్ మూడింటికే పరిమితమైంది. లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎన్నికల్లో పని చేసినా ఎలాంటి ప్రయోజనం ఉండదనే భావన చాలామందిలో ఉంది. నగరంలో ఆరేడుగురు ఎమ్మెల్యేలు మాత్రమే అభ్యర్థుల విజయానికి వారికి అప్పగించిన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. మిగిలిన ఎమ్మెల్యేలు మాత్రం ఆసక్తి చూపడం లేదు.

కార్పొరేటర్లదీ ఇదే తీరు..

భారాసకు 40 మందికి పైగా కార్పొరేటర్లు ఉండగా.. వీరిలో సుమారు 30 మంది వరకు పార్టీ ఆదేశాలను పెడచెవిన పెడుతున్నారనే మాటలు వినిపిస్తున్నాయి. కేవలం పదిమంది మాత్రమే తిరుగుతున్నారు. కొందరు కార్పొరేటర్లు పోలింగ్ తరువాత లేదా.. అంతకుముందే కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇటీవల ముగ్గురు సిద్ధం కాగా.. వారి పరిధిలోని ఎమ్మెల్యే ఆపారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఎన్నికల తరువాత చూద్దామంటూ ఆపినట్లు సమాచారం.

# ఆయుధాలు అప్పగించారు..



గోదావరిఖని : వ్యక్తిగత భద్రత కోసం లైసెన్సు తీసుకొని వెంట ఉంచుకున్న ఆయుధాలను ఉమ్మడి జిల్లావాసులు ఠాణాలకు అప్పగించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆయుధాలను అప్పగించాలని పోలీసు శాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు వంద శాతం డిపాజిట్ చేశారు. ఆయధాల చట్టం 1959 సెక్షన్ 21 ప్రకారం వ్యక్తిగత తుపాకీ లైసెన్సు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలో తమ పరిధిలోని ఠాణాల్లో ఆయుధాలను అప్పగించాల్సి ఉంటుంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉండటంతో ఈ నిబంధన అమలులో ఉంది.

నిబంధనలు వర్తిస్తాయి

ఉమ్మడి జిల్లాలో మొత్తం 263 లైసెన్సుడ్ ఆయుధాలున్నాయి. ఇందులో వ్యక్తిగతంగా వినియోగిస్తున్న 201 ఆయుధాలను సంబంధిత వ్యక్తులు ఠాణాల్లో అప్పగించారు. మిగతా 62 ఆయుధాలను వివిధ బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల భద్రత కోసం వినియోగిస్తున్నారు. అప్పగించిన ఆయుధాలను లైసెన్సుదారులు జూన్ 7న తిరిగి పొందే అవకాశం ఉంటుంది.

ఎన్నికల నోటిఫికేషన్ నాటికే లైసెన్సు కలిగిన ఆయుధాలను అప్పగించాలని పోలీసు శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఆలోపే పోలీసు శాఖ నుంచి వెళ్లిన సమాచారం మేరకు లైసెన్సుదారులు తమ పరిధిలోని ఠాణాలకు అప్పగించారు.

వ్యక్తిగత భద్రత కోసం ఎవరైనా ఆయుధాలు పొందే అవకాశం ఉంది. 1959 చట్టం ప్రకారం తుపాకీ లైసెన్సు కావాలనుకునే వారు ముందుగా జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. అతడికి ప్రాణ హాని ఉందా? అన్న విషయాన్ని ఆ ప్రాంత ఠాణా పరిధి పోలీసులు పరిశీలిస్తారు. ఆ వివరాలను సీఐ, డీఎస్పీ, ఎస్పీలకు నివేదిస్తారు. ఈ మేరకు కలెక్టర్ లైసెన్సు మంజూరు చేస్తారు.

సాధారణంగా రాజకీయ నాయకులతో పాటు వ్యాపారులు, గుత్తేదారులు ఎక్కువగా ఆయుధ లైసెన్సులు తీసుకుంటారు. కేవలం ఆత్మరక్షణ కోసమే వీటిని వినియోగించాలి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం, ఇతరులను బెదిరించడానికి ఉపయోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

లైసెన్సు పొందిన వ్యక్తులు నాన్ ప్రొహిబిటెడ్ బోర్(ఎన్‌పీబీ) తుపాకులను మాత్రమే కొనుగోలు చేయాలి. ఎన్నికల సమయంలో తప్పకుండా ఠాణాల్లో అప్పగించాలి.

శాంతిభద్రతలకు భంగం వాటిల్లకూడదనే..

ఎన్నికల సమయంలో హింసాత్మక ఘటనలకు తావు లేకుండా ఆయుధాలను అప్పగించాల్సి ఉంటుంది. శాంతిభద్రతలకు భంగం కలగకూడదన్న ఉద్దేశంతోనే ఈ మేరకు ఆదేశిస్తాం. జాతీయ బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల్లో పని చేసే భద్రతా సిబ్బంది, గార్డు విధులు నిర్వహించే వారికి మినహాయింపు ఉంటుంది. -ఎం.శ్రీనివాస్, రామగుండం సీపీ'ఒక జిల్లా.. ముగ్గురు ఎంపీలుజగిత్యాల జిల్లా మూడు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో ఉంది. మొత్తం 20 మండలాలు, 5 అసెంబ్లీ సెగ్మెంట్లున్నాయి. కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాలు నిజామాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో, చొప్పదండి సెగ్మెంట్‌లోని మల్యాల, కొడిమ్యాల, వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి మండలాలు కరీంనగర్ ఎంపీ పరిధిలోకి వస్తాయి. ఇక ధర్మపురి నియోజకవర్గం పెద్దపల్లి లోక్‌సభ స్థానం పరిధిలో ఉంది. - రాయికల్

# వరికే ప్రాధాన్యం

నిజామాబాద్ : రానున్న వర్షాకాలంలో నైరుతి రుతుపవనాలు ఆశాజనకంగా ఉంటాయనే వాతావరణ శాఖ సమాచారంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది సైతం సమృద్ధిగా వానలు పడితే జలాశయాలు నిండి పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరివ్వొచ్చనే అంచనాలతో వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. గతేడాది సాగు విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ఈ సారి ఏ పంట ఏ మేరకు సాగవుతుందనే దానిపై తాజాగా జిల్లా వ్యవసాయశాఖ వానాకాలం ప్రణాళిక విడుదల చేసింది. ఏయే పంటలకు ఎన్ని విత్తనాలు, ఎరువులు అవసరమో ప్రతిపాదనలు తయారు చేసినట్లు వెల్లడించింది.గతేడాది కంటే మెరుగ్గానే..2023 వానాకాలం కంటే ఈ సారి కాస్త సాగు పెరుగుతుందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా వానాకాలంలో అత్యధికంగా వరికే రైతులు ప్రాధాన్యం ఇస్తారని అంచనా వేస్తున్నారు. మొత్తం సాగులో ఇది ఒక్కటే 78 శాతం ఉంటుందని చెబుతున్నారు. ఇందుకు 1,29,165 క్వింటాళ్ల విత్తనం అవసరమని ప్రతిపాదించారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (టీఎస్ సీడ్స్ కార్పొరేషన్) వద్ద అవసరమైన నిల్వలున్నట్లు గుర్తించారు. అలాగే ప్రైవేటు విత్తన కంపెనీలు సైతం సరిపడా ఇచ్చేందుకు ముందుకొస్తున్నాయి.ఆరుతడి అంతంతే!జిల్లావ్యాప్తంగా ఆరుతడి పంటల సాగు అంతంతే ఉండబోతుందని అధికారులు చెబుతున్నారు. మార్కెట్‌లో పసుపు, సోయా, మొక్కజొన్న పంటలకు మంచి గిట్టుబాటు ధర ఉన్నప్పటికీ గతంలో మాదిరిగా సాగు ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు.

# ప్రచార తీరు.. మారింది గురూ..!

నల్గొండ : ఒకప్పుడు ఎన్నికలు వచ్చాయంటే ఊరూరా ర్యాలీలు, మైకుల హోరుతో ప్రచారం జోరుగా సాగేది. శాసనసభ, లోక్‌సభ స్థానాల బరిలో నిలిచిన అభ్యర్థులు కనీసం ఒక్కసారైనా ప్రతి గ్రామాన్ని చుట్టేసి వచ్చేవారు. ఇప్పుడు నియోజకవర్గ, మండల కేంద్రాల్లో అడపాదడపా ర్యాలీలు, కార్యకర్తల సమావేశాలకే అభ్యర్థులు, ముఖ్యనేతలు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రధాన పట్టణాల్లో ఉదయం పూట వాకర్స్‌ను కలిసి కాసేపు ముచ్చటిస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, సామాజికవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఇంటింటికీ తిరిగి ఓటు అభ్యర్థించే బాధ్యతలను స్థానిక నాయకులు భుజానికెత్తుకుంటున్నారు.

కానరాని హంగూ ఆర్భాటాలు

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో హంగూ ఆర్భాటాలు కనిపించటం లేదు. పోలింగ్‌కు సుమారు 20 రోజుల వ్యవధే ఉన్నా కనీసం ఫ్లెక్సీలను ఏర్పాటు చేయట్లేదు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో మండల నాయకులు సైతం పెద్దగా కాలు కదిపేందుకు అయిష్టత చూపుతున్నారు. ఎన్నికలపై గ్రామాలు, పట్టణాల్లో రచ్చబండ చర్చలు అంతంతమాత్రంగానే జరుగుతున్నాయి.



ఆచితూచి అడుగులు

గతంలో పట్టణాలకు అభ్యర్థులు, ముఖ్యనాయకులు వచ్చినప్పుడు పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించి బలాన్ని ప్రదర్శించేవారు. ఇందుకోసం రోజువారీ కూలీలను రప్పించేవారు. ప్రచారం అనంతరం వారికి కూలితో పాటు భోజనం, మద్యం వంటివి పంపిణీ చేసేవారు. దీనివల్ల ఖర్చు తడిసిమోపెడయ్యేది. ర్యాలీలో ఎంతమంది పాల్గొన్నారు..? కండువాలు, టోపీలు ధరించనవారెందరు..? ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు ఎన్ని ఉన్నాయి..? వాటి ఇంధనం ఖర్చు తదితరాలను ఎన్నికల అధికారులు లెక్కిస్తుండటంతో వ్యయ పరిమితి దాటుతుందనే భయంతో అభ్యర్థులు వీటికి ఆసక్తి కనబరచటం లేదు. కేవలం నామపత్రాల దాఖలు సమయంలో మాత్రమే పెద్దఎత్తున ర్యాలీలు నిర్వహించేందుకు మొగ్గుచూపుతున్నారు.

ఓటర్లకు చేరవయ్యేందుకు..

ప్రధాన పార్టీల అభ్యర్థులు స్మార్ట్ ప్రచారంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. వాట్సప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల ద్వారా ఓటర్లకు చేరవయ్యేందుకు యత్నిస్తున్నారు. సంక్షిప్త సందేశాలు, వాయిస్ కాల్స్‌పై ఆధారపడుతున్నారు. ప్రముఖ దినపత్రికల్లో ఆకట్టుకునే నినాదాల ప్రకటనలతో ఓటర్ల మదిని గెలుచుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

# సాగర్‌లో పూడిక.. తొలగించాలిక


కామారెడ్డి: ఉమ్మడి జిల్లా వరదాయిని నిజాంసాగర్‌లో పూడిక పేరుకుపోయింది. ప్రస్తుతం 17 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్నట్లు అధికారులు చెబుతున్నా.. ఆ స్థాయిలో నీరు లేదు. నిర్మాణ సమయంలో 29.70 టీఎంసీలు, ఆయకట్టు 2.75 లక్షల ఎకరాలు ఉండగా కాలక్రమేణా పూడిక చేరడంతో సామర్థ్యం తగ్గింది. పూడిక తొలగించేందుకు చేస్తున్న కార్యాచరణపై కథనం.

ప్రభుత్వానికి ప్రతిపాదన

రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారుల బృందం ఇటీవల రాజస్థాన్‌లోని బీసల్‌పుర్ జలాశయంలోని పూడిక తొలగించేందుకు ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రక్రియ పరిశీలించింది. ప్రైవేటు గుత్తేదారు ఆధ్వర్యంలో 25 ఏళ్ల కాలపరిమితితో అక్కడ పూడిక తొలగిస్తున్నారు. ఇదే మాదిరిగా నిజాంసాగర్‌తో పాటు రాష్ట్రంలో మరో ఐదు ప్రాజెక్టుల్లో పూడిక తొలగించేందుకు కార్యాచరణ రూపొందించారు. ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ముందుంచి ఆమోదముద్ర వేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కానరాని వరద కుంటల నిర్మాణం

1965లో పూడిక పేరుకుపోయి నీటి నిల్వ సామర్థ్యం 11.2



టీఎంసీలకు పడిపోయింది. 1974-78 మధ్య కాలంలో గేట్లు ఎత్తు పెంచి అదనంగా మరో 20 వరద గేట్ల నిర్మాణం పూర్తిచేసి 17.9 టీఎంసీలు నిల్వ ఉండేలా ఆధునీకరించారు. నిబంధనల ప్రకారం ప్రాజెక్టులోకి వరద వచ్చే ప్రాంతాల్లో కుంటల నిర్మాణం చేపట్టి పూడిక పేరుకుపోకుండా చూడాల్సి ఉంటుంది. ప్రస్తుతం అలాంటి ఏర్పాట్లు లేవు. ఎగువ భాగంలో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో వరద దిగువకు రాని పరిస్థితి. పోచారం, సింగూర్ జలాశయాలు నిండిన సమయంలో వదిలిన వరద కారణంగానే పూడిక వస్తున్నట్లు నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

ఆయకట్టుకు జీవం

నిజాంసాగర్ కింద 2.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. పూడిక తొలగిస్తే వానాకాలంలోనే నిండి రెండు సీజన్లకు సరిపడా సాగునీరు సరఫరా జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఆయకట్టు ప్రాంత ప్రజాప్రతినిధులు పూడిక తొలగించే ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడేలా చూడాల్సిన అవసరం ఉంది.

# పనులకు ఆటంకాలు.. రాకపోకలకు అవస్థలు

పెద్దపల్లి : రెండు జిల్లాల సరిహద్దులోని మానేరు వాగు దాటడానికి ఇరువైపులా గ్రామాల ప్రజలు దశాబ్దాల తరబడి నానా అవస్థలు పడుతున్నారు. ఎట్టకేలకు వంతెన నిర్మాణం పనులు ప్రారంభం కావడంతో కష్టాలు తీరతాయని భావించారు. ఎనిమిదేళ్లయినా అతీగతీ లేకపోగా పనుల్లో నాణ్యత లోపాలు బయటపడుతుండటంతో నిరాశే మిగిలింది.

ముత్తారం మండలం ఓడేడ్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామాల మధ్య మానేరు వాగుపై నిర్మించతలపెట్టిన వంతెనకు అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి. పనులు ప్రారంభించిన రెండేళ్లకు ప్రధాన గుత్తేదారు చేతులెత్తేయగా, ఉప గుత్తేదారుకు చెందిన యంత్రాలు, సామగ్రి వరదలకు కొట్టుకుపోవడంతో ఆయన కూడా వదిలేశారు. దీంతో వారధి పనులు అసంపూర్తిగా మిగిలాయి. మరోవైపు ఓడేడ్ వంతెనకు దాదాపు 5 కిలోమీటర్ల దూరంలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో గతంలో రూ.21.46 కోట్లతో చేపట్టిన చెక్‌డ్యాం నిర్మాణాలు కొట్టుకుపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచాయి.

**నాణ్యత లోపం లేదు: డీఈఈ**

వంతెన గడ్డర్లు వాగులో వేసిన తాత్కాలిక రహదారిపై పడటంతో రెండు జిల్లాల మధ్య వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కాగా ఓడేడ్ వంతెన నిర్మాణం పనుల్లో నాణ్యత లోపం లేదని, ప్రకృతి



వైపరీత్యం వల్లే గడ్డర్లు కూలిపోయాయని ఆర్అండ్‌బీ డీఈఈ ఇమానొద్దీన్ జాఫర్ తెలిపారు. రివైజ్డ్ అంచనాలు రూపొందించి తిరిగి టెండర్లు పిలవాల్సి ఉంటుందని, గుత్తేదారుకు బదులుగా ఏజెన్సీకి పని అప్పగిస్తే ఏడాదిలోగా పనులు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు.

**విచారణ చేయమని సీఎంను కోరా: మంత్రి**

ఓడేడ్ వద్ద వంతెన గడ్డర్లు కూలిన ఘటనపై తక్షణమే విచారణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు మంత్రి శ్రీధర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాల ఉల్లంఘన, గుత్తేదారుల నిర్లక్ష్యం తదితర అంశాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

**రూ.75 లక్షల వరకు నష్టం**

మానేరుపై ఓడేడ్–గర్మిళ్లపల్లితో పాటు ఖమ్మంపల్లి–తాడిచెర్ల వంతెనల నిర్మాణం ఒకేసారి చేపట్టారు. ఇక్కడ పనులు ఏళ్ల తరబడి సా..గుతుండగా ఖమ్మంపల్లి వద్ద నిర్మాణం పనులు పూర్తయి, వంతెన మీదుగా రాకపోకలు ప్రారంభమయ్యాయి. ఓడేడ్ వద్ద పనులు అసంపూర్తిగా నిలవడంతో రెండు జిల్లాల మధ్య వర్షాకాలంలో రవాణా సౌకర్యాలు నిలిచి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాజాగా వంతెనకు చెందిన మూడు గడ్డర్లు కూలిపోవడంతో దాదాపు రూ.75 లక్షల నష్టం వాటిల్లింది. ఎనిమిదేళ్ల కిందట పనులు ప్రారంభించగా ఇప్పటివరకు 23 పియర్లు, 13 బీములు నిర్మించారు. మరో 11 బీముల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రూ.22 కోట్ల వరకు పనులు చేయగా గుత్తేదారుకు రూ.18 కోట్ల వరకు చెల్లించారు. గుత్తేదారుకు పొడిగించిన అదనపు గడువు కూడా పూర్తి కావడంతో కాంట్రాక్టు రద్దు చేశారు.

# బ్యాలెట్ యుద్ధానికి చకచకా సన్నద్ధం

పెద్దపల్లి : లోక్‌సభ ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. నామినేషన్ల స్వీకరణ కొనసాగుతుండటంతో బరిలో నిలిచే అభ్యర్థుల కదలికలు, ప్రచారాలపై ఓ కన్నేసింది. నిఘా బృందాలతో నిరంతరం పర్యవేక్షిస్తోంది. స్వేచ్ఛాయుత, పారదర్శకత ఎన్నికలకు అమలు చేస్తున్న సి–విజిల్, 1950 టోల్ ఫ్రీ నంబర్ ఫిర్యాదులపై, ప్రచార అనుమతల కోసం సువిధ యాప్‌ల నిర్వహణపై ప్రజల్లో చైతన్యం చేయడంతో స్పందన పెరుగుతోంది. సామాజిక మాధ్యమాల వేదికగా ప్రచారాలు, రాజకీయ పార్టీల విమర్శలు, ప్రతి విమర్శలను గమనిస్తున్నారు. మరోవైపు ఎన్నికల ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి.

**నియోజకవర్గాల్లో ఈవీఎంలు భద్రం**

లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు వినియోగించే ఈవీఎంలను జిల్లాలో మొదటి విడతలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు చేశారు. సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో ప్రతి ఒక యంత్రం పనితీరు, సాంకేతిక సమస్యలను పరిశీలించి సందేహాలను తొలగించారు. ఇక్కడ నుంచి నియోజకవర్గాలకు తరలించారు. రామగుండం నియోజకవర్గం



లో 325 బ్యాలెట్ యూనిట్లు, 325 కంట్రోల్ యూనిట్లు, 364 వీవీప్యాట్లు, మంథనిలో 362 బ్యాలెట్, 362 కంట్రోల్ యూనిట్లు, 406 వీవీప్యాట్లు, పెద్దపల్లిలో 362 బ్యాలెట్ యూనిట్లు, 362 కంట్రోల్ యూనిట్లు, 406 వీవీప్యాట్లను ప్రత్యేక గోదాంలో భద్రపరిచారు. నియోజకవర్గ స్థాయిలో రెండోసారి పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించేందుకు సిద్ధమవుతున్నారు.

**పెరుగుతున్న సామాజిక స్పృహ**

ఎన్నికల్లో ప్రలోభాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ నియోజకవర్గానికి ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో వ్యూవింగ్, ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) బృందాలు పర్యవేక్షిస్తున్నాయి. మరోవైపు పారదర్శకత ఎన్నికల కోసం ప్రజల్లో సామాజిక స్పృహ పెరుగుతోంది. జిల్లా కంట్రోల్ రూమ్‌లోని 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు 76, సి–విజిల్ 13, ఎన్‌జీఎస్పీ (నేషనల్ గ్రీవెన్సెస్ సర్వీసు పోర్టల్) 56 చొప్పున ఫిర్యాదులు రాగా వాటిని నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తున్నారు. జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. 24 గంటల పాటు విడతల వారీగా సిబ్బంది విధుల్లో కొనసాగుతున్నారు.

# స్థానికంగా కీలకం.. ప్రగతిలో భాగస్వామ్యం



తాండూరు : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సమీపిస్తుండటంతో ఎంపీ అభ్యర్థుల ప్రచార సందడి మొదలైంది. అభ్యర్థుల నామపత్రాల సమర్పణ సైతం తుది దశకు వస్తుండటంతో ప్రచారపర్వం వేగవంతం చేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకోవడానికి యత్నిస్తున్నారు. ఇదే సమయంలో ఎంపీల విధులు, నిధుల, బాధ్యతల గురించి కూడా ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సి ఉంది. దీనికి సంబంధించి కథనం.

**మండల సమావేశాలకు హాజరు కావొచ్చు**

జిల్లా పరిషత్తు, పంచాయతీలు, పురపాలక సంఘాల నిర్వహణలో పార్లమెంట్ సభ్యులు ప్రాతినిధ్యం కలిగి ఉంటారు. దీనికి ఎగువ, దిగువ సభల్లో పలు శాసనాలు చేశారు. జిల్లా పరిషత్తులో జిల్లా ప్రణాళిక కమిటీ (డీపీసీ)లో సభ్యునిగా ఎంపీ నామినేట్ చేస్తారు. ఎంపీ పరిధిలోని మండలాల సర్వ సభ్య సమావేశాలు, జిల్లా స్టాండింగ్ కమిటీ సమావేశాలకు ఎంపీలు హాజరవుతుంటారు. గ్రామస్థాయి మొదలు జిల్లా వరకు ప్రజల ఆరోగ్య పరిరక్షణ, కాలానుగుణ వ్యాధుల నియంత్రణకు ఏర్పాటు చేసిన జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్(ఎన్ఆర్‌హెచ్ఎం)కు నిధుల కేటాయింపులో ఎంపీల బాధ్యత, పర్యవేక్షణ ఉంటుంది.

**చట్టాల రూపకల్పన, అమలులో..**

చట్టాల రూపకల్పన వాటి అమలులో పార్లమెంట్ సభ్యులు ముఖ్య పాత్ర పోషిస్తారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాల పనితీరు, అవకతవకలు జరిగినప్పుడు ఆయా శాఖల మంత్రులను ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నిస్తారు.

**1993లో ఎంపీ లాడ్స్ పథకం**

పార్లమెంటు నియోజకవర్గాల అభివృద్ధికి ఎంపీ లాడ్స్ పథకం 1993లో ప్రారంభమైంది. దీనికింద ప్రతి పార్లమెంటు సభ్యునికి ఎంపీ లాడ్స్ నుంచి ఏడాదికి కేంద్రం రూ.5 కోట్లు కేటాయిస్తుంది. వీటిని జిల్లా పాలనాధికారుల పర్యవేక్షణలో ఎంపీల ప్రాధాన్యతతో ప్రతిపాదించిన పనులు చేపడతారు.

పార్లమెంటులో సభ్యులుగా తమ వంతు పాత్రను నిర్వర్తిస్తూనే రాష్ట్రంలోని తన నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు ముఖ్యపాత్ర పోషిస్తారు.పర్యవేక్షిస్తారు.

**ప్రభుత్వ పథకాలపై పర్యవేక్షణ**

ఎంపీల నియోజకవర్గం, జిల్లా పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పనిచేసే పథకాల పనితీరును, ఫలితాలను తరచూ పర్యవేక్షిస్తారు. ఉదాహరణకు జాతీయ గ్రామీణ తాగునీటి పథకం (ఎన్ఆర్‌డీడబ్ల్యూపీ), జిల్లా నీటి పారిశుద్ధ్య మిషన్ (డీడబ్లుఎస్ఎం)ల ఏర్పాటు పూర్తిగా ఎంపీలు పర్యవేక్షిస్తారు. దీనిలో ఎమ్మెల్యేలు సభ్యులుగా కొనసాగుతారు.

ఎంపీ ల్యాడ్స్ నిధుల్లో ఏడాదిలో 15శాతం ఎస్సీల నివాస స్థలాల్లో అభివృద్ధి పనులకు కేటాయించాలి. జిల్లా పాలనాధికారి ఆ ప్రాంతాలను ప్రతిపాదిస్తారు. ఒక నియోజకవర్గంలో ఎస్టీలు లేకపోతే ఆ నిధులను కూడా ఎస్సీల నివాస స్థలాల పరిధిలో ఉపయోగించవచ్చు.

# ఆన్‌లైన్ రుణం.. తీసుకోకున్నా నరకం



హైదరాబాద్: లోన్‌యాప్ నేరగాళ్లు మరో అడుగు ముందుకేసి సరికొత్త పద్ధతుల్లో నరకం చూపిస్తున్నారు. ఇప్పటివరకు యాప్‌ల ద్వారా రుణం ఇచ్చి.. రోజుల వ్యవధిలో ఐదారు రెట్లు వసూలు చేయడం, లేకుంటే వేధించేవారు. అసలు రుణం తీసుకోకున్నా ఎంతోకొంత బ్యాంకు ఖాతాలో జమ చేసి తిరిగి వడ్డీతో సహా కట్టాలంటూ ఫోన్లు చేయడం.. అసలు రుణం తీసుకోకున్నా అప్పు తీసుకున్నావంటూ ఫొటోలు మార్ఫింగ్ చేసి బెదిరింపులకు దిగుతున్నారు. ఇటీవల నగర పోలీసులకు ఈ తరహా ఫిర్యాదులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై 3 కమిషనరేట్ల సైబర్‌క్రైమ్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో వెయ్యికిపైగా యాప్‌లను ప్లేస్టోర్ నుంచి తొలగించారు. ఒక్క సైబరాబాద్ పోలీసులే సుమారు 600దాకా యాప్‌లు తొలగించారు. గత ఏడాది రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులు లోన్‌యాప్ ముఠాను అరెస్టు చేసినప్పుడు ఈ మోసం వెలుగుచూసింది. నగరానికి చెందిన అబ్దుల్ బారీకి ఒకసారి లోన్‌యాప్ ద్వారా రుణం తీసుకుని తిరిగి కట్టాడు. నేరగాళ్లు కొన్నిరోజుల తర్వాత అడగకుండానే రూ.10 వేలు అతని ఖాతాలో జమ చేసి వడ్డీల రూపంలో రూ.2.49 లక్షలు వసూలు చేశారు.

**డేటాతోనే అంతా సమస్య..!**

బ్యాంకు ఖాతాదారుల డేటా అంగట్లో సరకులా మారడమే ఈ తరహా వేధింపులకు కారణమని పోలీసులంటున్నారు. బ్యాంకు ఏదైనా ఖాతాదారుల పేరు, ఫోన్ నంబర్లు, చిరునామా, నామినీ, లావాదేవీల వివరాలు బయటకు పొక్కుతున్నాయి. వీటిని సేకరిస్తున్న రుణయాప్ నిర్వాహకులు ఈ తరహా నేరాలకు దిగుతున్నారు. కొందరు అత్యవసర సందర్భాల్లో లోన్‌యాప్ నుంచి రూ.10 వేల లోపు రుణాలు తీసుకుని తిరిగి కట్టేస్తారు. ఇలాంటి వారు మళ్లీ రుణం తీసుకోకపోయినా నేరగాళ్లు మాత్రం ఎంతోకొంత డబ్బు జమ చేస్తారు. ఆ తర్వాత ఫోన్ చేసి నరకం చూపిస్తారు.

**ఇలా వేధింపులు..**

నగరానికి చెందిన ప్రధానోపాధ్యాయురాలు మార్చిలో తన ఫోన్‌లో స్పీడ్ లోన్ యాప్‌ను పొరపాటున క్లిక్ చేయగా రూ.5 లక్షల రుణం మంజూరైనట్లు చూపించింది. ఆమె ప్రమేయం లేకుండానే రూ.2,160 చొప్పున మూడు సార్లు కలిపి రూ.6,480 జమ చేశారు. కొన్నిరోజుల తరువాత కొందరు ఫోన్ చేసి రుణం తిరిగివ్వాలని డిమాండ్ చేస్తూ వేధించారు. బాధితురాలు మూడు దఫాల్లో రూ.9600 చెల్లించినా బెదిరింపులు ఆగలేదు. ఆమె వ్యక్తిగత చిత్రాలను నగ్నంగా మార్చి వాట్సాప్, ఆమె ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లకు పంపిస్తున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థికి వాట్సాప్ కాల్ వచ్చింది. లోన్‌యాప్ నుంచి మాట్లాడుతున్నామని, ఇటీవల తీసుకున్న రూ.2 వేలకు వడ్డీతో కలిపి రూ.3500 కట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థి మాత్రం తాను డబ్బు తీసుకోలేదని పదేపదే చెప్పినా వేధించారు. కొద్దిసేపటి తరువాత విద్యార్థి తండ్రికి ఫోన్ చేశారు. డబ్బు ఎందుకు ఇవ్వాలని తండ్రి ప్రశ్నించగా వాట్సాప్‌లో ఆయన నగ్న చిత్రాలు పంపి బెదిరించారు. డబ్బు తీసుకోకున్నా కట్టాలంటూ వేధించడంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

**ఇవీ జాగ్రత్తలు**

లోన్‌యాప్ పేరుతో వచ్చే ప్రకటనలను నమ్మొద్దు. వీటిద్వారా రుణం తీసుకోవద్దు.అసలు యాప్ డౌన్‌లోడ్ చేసుకోకున్నా.. రుణం తీసుకోకున్నా ఎవరైనా డబ్బు కట్టాలని ఫోన్లు చేస్తే నమ్మొద్దు. పదేపదే ఫోన్ చేసి వేధించినా..నగ్న చిత్రాలు పంపించినా వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయాలి.

# ఉద్యానమా.. ఆక్రమించేద్దాం!



హైదరాబాద్ : చుట్టూ బహుళ అంతస్తుల భవనాలు.. గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణాలు.. దుండిగల్ మున్సిపాలిటీలోని మల్లంపేటకు కిలోమీటర్ దూరంలో బాహ్య వలయ రహదారి.. వీటి మధ్యలో ఉద్యానాలకు కేటాయించిన భూములపై రెండేళ్లక్రితం అక్రమార్కుల కన్ను పడింది. రూ.90కోట్ల విలువైన ఈ భూములను స్వాధీనం చేసుకుంటే పది, పదిహేను అపార్ట్‌మెంట్లు సులువుగా కట్టుకునేందుకు అవకాశాలున్నాయన్న ఆలోచన కలిగింది. ఆ స్థలాలు తమవేనంటూ వారు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. కొన్ని నెలల తరువాత.. ఆ రిజిస్ట్రేషన్ పత్రాల ఆధారంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా.. ప్రస్తుతం ఆ భూముల్లో డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నారు. నివేదిక ఆధారంగా చర్యలు చేపడుతామని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ వివరించారు.

గ్రామ పంచాయతీ నాటి లే–అవుట్..దుండిగల్ గ్రామ పంచాయతీలోని మల్లంపేట పరిధిలో ప్రైవేటు పట్టాభూముల్లో ఇరవై ఏళ్ల క్రితం ఓ వ్యక్తి లే–అవుట్ వేశారు. ప్రజాఅవసరాలు, ఉద్యానాల కోసం పది చోట్ల పార్కుల కోసం మూడెకరాల భూమిని గ్రామపంచాయతీకి అప్పగించారు. అప్పటికే ఔటర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మల్లంపేటకు సమీపంలో ఉండడంతో లేఅవుట్‌లో ప్లాట్లు వేగంగా అమ్ముడయ్యాయి. బాహ్య వలయ రహదారి అందుబాటులోకి రావడంతో రియల్ వెంచర్ల వ్యాపారులు ఎకరాల చొప్పున కొనుగోలుచేసి హెచ్ఎండీఏ అనుమతులతో గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాల నిర్మాణం చేపట్టారు. ఐదేళ్ల క్రితం దుండిగల్ మున్సిపాలిటీ ఏర్పాటుకావడంతో పంచాయతీకి ఇచ్చిన మూడెకరాలు మున్సిపాలిటీ ఖాతాలోకి వచ్చాయి.వాటిని అధికారులు చూసుకోలేదు.

పక్కాగా సొంతం చేసుకునేందుకు..విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ స్థలాలు ఎక్కడున్నాయంటూ అన్వేషణ చేస్తున్న కొందరు అక్రమార్కులకు గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, అపార్ట్‌మెంట్ల మధ్య మూడెకరాల భూములు కనిపించాయి. వాటి వివరాలను రహస్యంగా సేకరించారు. మున్సిపాలిటీ ఇంకా స్వాధీనం చేసుకోకపోవడంతో తమ సొంతం చేసుకునేందుకు ఆ భూముల సర్వే నంబర్లు సేకరించారు. పాత దస్త్రాల సాయంతో భూములు తమవేనంటూ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.

# అతివల ఉపాధికి ఆదరువేదీ!

జగిత్యాల : రాష్ట్రంలో 6 లక్షల మంది బీడీ కార్మికులుండగా అత్యధికంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోనే ఉన్నారు. కరీంనగర్ ఎంపీ పరిధిలోనూ చాలా మందికి బీడీ పరిశ్రమనే జీవనాధారం. ఉమ్మడి జిల్లాలో దాదాపు 1.70 లక్షల మంది ఈ రంగంపై ఆధారపడగా కొంతకాలంగా సంక్షోభంలో ఉండటం వారిని కుంగదీస్తోంది. తమ సమస్యల పరిష్కారానికి నేతలు చొరవ తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

**పెరిగిన పన్ను భారం**

చేతితో తయారయ్యేవి కావడంతో గతంలో రాష్ట్రంలో బీడీలపై విలువ ఆధారిత పన్ను(వ్యాట్) వసూలు చేయలేదు. కాగా దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం అమలులోకి రావడం, ప్రజారోగ్యరీత్యా పొగాకు ఉత్పత్తుల వాడకాన్ని తగ్గించాలనే ఉద్దేశంతోనే కేంద్రం బీడీలపై వస్తు సేవల పన్ను(జీఎస్టీ) భారాన్ని అధికంగా వేసింది. అంతకుముందు సెంట్రల్ ఎక్సైజ్ పన్ను వెయ్యి బీడీలకు రూ.16.31గా ఉండేది. జీఎస్టీ అమలు తర్వాత 28 శాతం పన్ను కింద వెయ్యి బీడీలకు కంపెనీల ధరలు బట్టి రూ.195–285 వరకు చెల్లించాల్సి వస్తోంది. కంపెనీలు ఈ భారాన్ని వినియోగదారులపైనే మోపుతుండటంతో ధరలు పెరిగి



బీడీలు తాగేవారి సంఖ్య గణనీయంగా తగ్గింది.

**21 వర్గాలపై ప్రభావం**

తెలంగాణలో తయారైన బీడీలు ఎక్కువగా కర్ణాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, బిహార్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. బీడీ కట్టల ధరలు పెరగటంతో వినియోగదారుల సంఖ్య తగ్గి ఉత్పత్తిని సైతం తగ్గించామని కంపెనీలు చెబుతున్నాయి. అదే సమయంలో యంత్రాలతో తయారయ్యే చవక రకం సిగరెట్లు మార్కెట్లోకి రావడం బీడీ పరిశ్రమకు శరాఘాతంగా మారింది. పొగాకు పండించే రైతు మొదలు ఆకు సేకరించేవారు, బీడీలు చుట్టేవారు, ప్యాకర్లు, చాకర్లు, టేకేదార్లు, కంపెనీల్లో ఇతర సిబ్బంది, గంపలు, చాటల తయారీదార్లు తదితర వర్గాలన్నీ కలిపితే 21 మంది వరకు బీడీల తయారీపై ఆధారపడ్డారు. పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారడంతో వీరందరి జీవితాలపై ప్రభావం పడుతోంది.

**ఇవీ కార్మికుల వినతులు**

2014లోపు పీఎఫ్‌లో ఖాతా కలిగి ఉన్న వారికే ప్రస్తుతం పింఛను మంజూరు చేస్తుండగా, ఆ గడువును ఎత్తివేస్తామని గతంలో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోవడం లేదు. ఈ ఎన్నికల తర్వాతనైనా జీవనభృతిని రూ.4 వేలకు పెంచాలని, కాంట్రిబ్యూటరీ పింఛన్ స్కీమ్(సీపీఎస్) నుంచి తమను మినహాయించాలని విన్నవిస్తున్నారు.

బీడీ కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధిగా కేంద్రం నుంచి గతంలో రూ.500 కోట్లు విడుదల చేసినా వినియోగించుకోలేకపోవడంతో వెనక్కి మళ్లాయి. వాటిని తిరిగి కేటాయించాలని కోరుతున్నారు.

బీడీల తయారీలో 21 లిమిటెడ్ కంపెనీలు, 41 స్థానిక కంపెనీలున్నాయి. కార్మికుల్లో 98 శాతం మహిళలే ఉండగా ప్రస్తుతం నెలలో 10–14 రోజులకే పని దొరుకుతోంది. ఉపాధి పెంచేలా కేంద్రం చొరవ తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

జీవో నం.41 ప్రకారం బీడీలకు కనీస ధర చెల్లించడంతో పాటు నెలలో 26 రోజులు పని కల్పించాలని మహిళలు కోరుతున్నారు. కనీస వేతన చట్టం అమలు చేస్తే వెయ్యి బీడీలకు రూ.229 దక్కుతుంది. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రధాని ఆవాస్ యోజన ద్వారా గృహనిర్మాణానికి రూ.3 లక్షల రాయితీని లేదా రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు అందించాలని ఆశిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రాయితీపై రుణాలివ్వాలని కోరుతున్నారు.


లక్‌పతి దీదీ పథకాన్ని బీడీ కార్మికులకు వర్తింపజేయడంతో పాటు ఆయుష్మాన్‌భారత్ పథకాన్ని వర్తింపజేస్తామని గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని బీడీ కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మాతాశిశుకు తప్పని ఉక్కపోత

పెద్దపల్లి : చంటి బిడ్డలు, బాలింతలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో వేసవి ఉక్కపోత తప్పడం లేదు. రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండడంతో చల్లదనం కోసం అధికారులు కనీస కార్యాచరణ చేపట్టడం లేదు. ఐసీయూలకే ఏసీలు పరిమితం కావడంతో సాధారణ వార్డులలోని బాలింతలు, చంటి పిల్లలు ఉక్కపోతలోనే ఉండాల్సి వస్తోంది. వార్డులలో ఫ్యాన్‌లు ఉన్నప్పటికీ పెరిగిన వేడితో వేడి గాలి వస్తుండడంతో కొందరు బాలింతలు ఫ్యాన్‌లను ఆఫ్ చేసి, బయటి గాలి కోసం కిటికీలను తెరుస్తున్నారు. తాత్కాలికంగా ఇది ఉపశమనమిస్తున్నటప్పటికీ బయటి నుంచి వచ్చే దుమ్ముతో పాటు దోమలు వార్డులోకి వచ్చి బాలింతలు, చంటి బిడ్డలకు ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చే అవకాశముంది.

**వేడి కష్టాలు**

పాత ఆస్పత్రిలోని ప్రసూతి వార్డులలో బాలింతలకు ఫ్యాన్‌లు



లేకపోవడంతో ఇంటి నుంచి ఫ్యాన్‌లు తీసుకొచ్చి ఇబ్బందులు పడిన ఉదంతాలను ప్రత్యక్షంగా వీక్షించిన అప్పటికి కలెక్టర్ అలుగు వర్షిణి మూడు ప్రసూతి వార్డులలో ఏసీలను ఏర్పాటు చేయించారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వచ్చిన తరువాత ఈ వార్డులను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇక కొత్త భవనంలో ఏసీలు కేవలం ఆపరేషన్ థియేటర్‌కే పరిమితమయ్యాయి. ఇటీవల ఐసీయూలో రెండు ఏసీలను అధికారులు ఏర్పాటు చేశారు. వార్డులలో చల్లదనం కోసం కనీస చర్యలు లేవు. కిటికీలకు తెరలు కట్టడం, కూలర్లు ఏర్పాటు చేయలేదు. పాత ఆస్పత్రి ప్రసూతి వార్డులలోని ఏసీలను ఇతర అవసరాలను వినియోగిస్తున్నారు. కానీ బాలింతల కష్టాలు మాత్రం వారికి కనిపించడం లేదు. ఈ విషయమై ఆసుపత్రి పర్యవేక్షకులు ఆర్.రమాకాంత్‌ను వివరణ కోరగా.. పెరిగిన వేడి తీవ్రత నేపథ్యంలో చల్లదనం కోసం ఏసీలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు.

# 'వీవీప్యాట్ల'పై సుప్రీం తీర్పు.. విపక్షాలకు గట్టి చెంపదెబ్బ: మోదీ



పట్నా: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లతో 100 శాతం వీవీప్యాట్ల స్లిప్పులను సరిపోల్చి లెక్కించాలన్న పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. ఈ తీర్పును ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వాగతించారు. ఈసందర్భంగా విపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశ ప్రజలకు వారు క్షమాపణలు చెప్పాలని అన్నారు. బిహార్‌లోని అరారియాలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని.. సుప్రీం తీర్పుపై స్పందించారు. "ఈ రోజు ప్రజాస్వామ్యానికి గొప్ప రోజు. మన ప్రజాస్వామ్య విలువలను, ఎన్నికల ప్రక్రియను యావత్ ప్రపంచం కొనియాడుతోంది. కానీ విపక్షాలు మాత్రం తమ స్వార్థ ప్రయోజనాల కోసం వాటిని కించపరుస్తున్నాయి.

ఈవీఎంలపై అనుమానాలు రేకెత్తేలా ప్రతిపక్ష కూటమిలోని ప్రతీ నేత నిరంతరం అసత్య ఆరోపణలు చేస్తున్నారు. అలాంటివారికి సుప్రీం తీర్పుతో గట్టి చెంపదెబ్బ తగిలింది. బ్యాలెట్ బాక్సులను దోచుకోవాలని కలలు కంటున్న వారి కుట్రలను భగ్నం చేసింది. ఇది ప్రజాస్వామ్యానికి దక్కిన విజయం" అని మోదీ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో మొత్తం వీవీ ప్యాట్ స్లిప్‌లను లెక్కించాలని, లేదా పేపర్ బ్యాలెట్ ఓటింగ్‌ను తిరిగి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఒక వ్యవస్థను గుడ్డిగా అపనమ్మకంతో చూడటం.. అనవసర అనుమానాలకు దారి తీస్తుందని ఈసందర్భంగా ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న వేళ ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఉమ్మడి పౌరస్మృతి అమలుకు మోదీ గ్యారెంటీ: అమిత్‌షా



భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని కచ్చితంగా అమలుచేస్తుందనడానికి ప్రధాని మోదీ గ్యారెంటీ అని హెూం మంత్రి అమిత్‌షా తెలిపారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ మాత్రం 'పర్సనల్ లా'కు వకాల్తా పుచ్చుకొంటోందని ఆయన విమర్శించారు. శుక్రవారం మధ్యప్రదేశలోని గుణా లోక్‌సభ పరిధిలోని పిప్రాయ్‌లో నిర్వహించిన బహిరంగ సభనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇక్కడినుంచి కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా భాజపా తరపున బరిలో నిలిచిన విషయం తెలిసిందే. ఈసందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ "రాహుల్ బాబా.. నువ్వు ఎంతైనా వారిని బుజ్జగించు. భాజపా ఇక్కడున్నంతకాలం.. 'పర్సనల్ లా'లను అంగీకరించదు. ఇది మా వాగ్దానం.. మోదీ గ్యారెంటీ. అందుకే మేము దేశంలో యూసీసీని కచ్చితంగా అమలుచేస్తాం. ఇప్పటికే ఉత్తరాఖండ్‌లో అమల్లోకి తెచ్చాం. 2019లో మోదీ సర్కారు ఒక్క కలం పోటుతో కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని తొలగించింది. అప్పట్లో రాహుల్ బాబా భయపడి.. రక్తం ఏరులైపారుతుందన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కాదు.. మోదీ గవర్నమెంట్. రాళ్లు రువ్విన ఘటన ఒక్కటి కూడా చోటుచేసుకోలేదు. ఈ ప్రభుత్వం దేశాన్ని ఉగ్రవాదం, నక్సలిజం నుంచి పూర్తిగా బయటపడేసింది. మధ్యప్రదేశ్ మావోయిస్టురహిత ప్రాంతమైంది" అని అమిత్ షా వివరించారు. అంతకుముందు అమిత్ షా ఓ ఆంగ్ల వార్తాసంస్థతో మాట్లాడుతూ "మాట మీద నిలబడే పార్టీని ప్రజలు ఎన్నుకోవాలి. అది దేశ సంపద, పేదల సంక్షేమాన్ని కాపాడుతుంది. కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల తర్వాత ప్రజలు భాజపా వైపు ఆశగా చూస్తున్నారన్నారు. ఎప్పటిలానే హస్తం పార్టీ మేనిఫెస్టో బుజ్జగింపులతో నిండిపోయిందన్నారు. దేశం, చట్టాలు ఒక మతం వైపు మొగ్గి ఉండకూడదు" అని వ్యాఖ్యానించారు.

# అవినాష్ రెడ్డి అమాయకుడంటే కడప ప్రజలను వంచించడమే:వర్లరామయ్య



అమరావతి: గొడ్డలి వేటు సూత్రధారి(ఎంపీ అవినాష్‌రెడ్డి)ని అమాయకుడంటే రాష్ట్ర ప్రజలను కించపరచడమే, కడప ప్రజలను వంచించడమేనని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య సంచలన ఆరోపణలు చేశారు. "ఐదేళ్లు ఎంపీగా పోటీచేసిన అవినాష్‌రెడ్డి ఒక చిన్న బాలుడు అనడంలో సీఎం జగన్ ఔచిత్యమేమిటో..? మీ బాబాయిని గొడ్డలి వేటు వేసిన ఘటనలో సూత్రధారి ఎలా అమాయకుడు అవుతాడు..? అవినాష్‌రెడ్డిని అమాయకుడు అంటున్న నీపై కూడా 11 ఛార్జ్ షీట్లు ఉన్నాయి.. మీరు కూడా అమాయకులేనా" అని వర్లరామయ్య ప్రశ్నించారు. ఆయన మోసాలు, అబద్ధాలను ఇక జనాలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. జగన్ ఇక డ్రామాలు ఆపాలని హితవు పలికారు. చట్టాన్ని గౌరవించి కోర్టులకు హాజరవుతే ఆయన బయట ఉండేవారో లోపన ఉండేవారో తెలిసిపోయేదన్నారు.

అవినాష్‌రెడ్డి అమాయకుడని జగన్ రెడ్డి చెబుతుంటే సీబీఐ ఎందుకు సైలెంట్‌గా ఉంది? అని ప్రశ్నించారు. మాజీ మంత్రి వివేకానందారెడ్డి కేసులో సుత్రధారి అతనే అని.. అతను అమాయకుడు కాదని సీబీఐనే ప్రజలకు తెలియజేయాలని చెప్పుకొచ్చారు. జగన్‌కు గులరాయి తగిలి 13 రోజులవుతున్నా ప్లాస్టర్ తీయకుండా ఐప్యాక్ సూచనలతో జగన్ నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవడానికి జగన్ డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. మూడు రోజులకు తీయాల్సిన ప్లాస్టర్‌ను అలాగే ఉంచుకుని ప్రచారం చేస్తున్నారన్నారు. సెప్టిక్ అవుతుందని డాక్టర్లు చెప్పినా.. ఓట్లే ముఖ్యమని జగన్ అనుకుంటున్నారని అన్నారు. మహిళలకు పెద్దాపరేషన్ చేసినా.. వారానికే కుట్లు ఊడతీస్తారని.. కానీ జగన్ గులకరాయి దెబ్బకు మాత్రం 13 రోజులైనా ప్లాస్టర్ ఎందుకు ఊడలేదని వర్ల రామయ్య ప్రశ్నించారు.




దిల్లీ: కొత్త ఐటీ నిబంధనలు-2021లోని 4(2) సెక్షన్ చట్టబద్ధతను సవాలు చేస్తూ వాట్సప్, ఫేస్‌బుక్ (ఇప్పుడు మెటా) సంస్థలు దాఖలు చేసిన పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు తాజాగా విచారణ జరిపింది. ఈ సందర్భంగా వాట్సప్ కీలక వ్యాఖ్యలు చేసింది. తమ మాధ్యమంలో మెసేజ్‌లకు ఉన్న ఎన్‌క్రిప్షన్ విధానాన్ని తొలగించాలని చెబితే తాము భారత్‌లో సేవలను నిలిపివేస్తామని వెల్లడించింది. ఐటీ నిబంధనల్లోని 4(2) సెక్షన్.. వ్యక్తుల భావ ప్రకటన స్వేచ్ఛకు, వినియోగదారుల గోప్యత హక్కుకు భంగం కలిగిస్తుందని ఆ సంస్థలు ఆరోపించాయి. ముఖ్యంగా సందేశ సృష్టికర్త జాడను బహిర్గతం చేసే (ట్రేసబిలిటీ) విధానానికి సంబంధించిన నిబంధనను సవరించాలని డిమాండ్ చేశాయి. ఈ క్రమంలోనే ఈ సెక్షన్‌ను సవాల్ చేస్తూ వాట్సప్, ఫేస్‌బుక్ సంస్థలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీనిపై దిల్లీ హైకోర్టు తాజాగా విచారణ జరిపింది. ఈ సందర్భంగా వాట్సప్ తరఫున న్యాయవాది మాట్లాడుతూ.. "మా ప్లాట్‌ఫామ్‌లో సందేశాల భద్రత కోసం ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానాన్ని అవలంబిస్తున్నారు. ఆ గోప్యత హామీ ఉన్నందువల్లే కోట్లాది మంది యూజర్లు దీన్ని వినియోగిస్తున్నారు. ఇప్పుడు ఈ రూల్‌తో మేం బలవంతంగా ఆ ఎన్‌క్రిప్షన్‌ను బ్రేక్ చేయాల్సి ఉంటుంది. అలా చేయాలని మీరు చెబితే మేం భారత్ నుంచి వెళ్లిపోతాం" అని కోర్టుకు తెలిపారు. "ఈ 4(2) సెక్షన్ రూల్ వ్యక్తుల గోప్యతకు వ్యతిరేకం. రాజ్యాంగ విరుద్ధం. సామాజిక మాధ్యమ సంస్థలతో ఎలాంటి సంప్రదింపులు లేకుండానే దీన్ని ప్రవేశపెట్టారు. దీని వల్ల మేం కోట్లాది మెసేజ్‌లను కొన్నేళ్ల పాటు భద్రపర్చాల్సి ఉంటుంది. ఇలాంటి నిబంధన ప్రపంచంలో ఎక్కడా లేదు" అని వాట్సప్ తరఫు కౌన్సిల్ వాదించింది. దీనిపై వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను ఆగస్టు 14వ తేదీకి వాయిదా వేసింది. 2021 ఫిబ్రవరిలో కేంద్రం ఈ నూతన ఐటీ నిబంధనలను అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, ట్విటర్ (ఎక్స్) వంటి సంస్థలు వీటిని తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేసింది. అయితే.. వీటిని సామాజిక మాధ్యమ సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టుల్లో పలు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల వీటన్నింటిని సుప్రీంకోర్టు.. దిల్లీ హైకోర్టుకు బదిలీ చేసింది.

# బుగ్గన నామినేషన్ పెండింగ్‌లో ఉంచిన ఎన్నికల అధికారి

నంద్యాల: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మరోసారి డోన్ నుంచి ప్రాతినిథ్యం వహించేందుకు వైకాపా అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం నామినేషన్ల పరిశీలన సందర్భంగా.. ఆయన ఎన్నికల అఫిడవిట్‌పై తెదేపా అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. ఆస్తుల వివరాలు పూర్తిగా వెల్లడించలేదని, నామినేషన్ పత్రంలో కొన్ని కాలమ్స్ భర్తీ చేయలేదని ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వెంటనే నామినేషన్ తిరస్కరించాలని కోరారు. మంత్రి బుగ్గనకు ఉన్న మొత్తం ఆస్తులు, అఫిడవిట్‌లో వెల్లడించిన ఆస్తుల వివరాలకు సంబంధించిన పత్రాలను ఆర్వోకు చూపించారు. తెదేపా పిర్యాదుపై స్పందించిన (రిటర్నింగ్ అధికారి) ఆర్వో.. ప్రస్తుతం ఆయన నామినేషన్‌ను పెండింగ్‌లో ఉంచారు. సాయంత్రంలోగా ఆస్తుల వివరాలు ఇవ్వాలని బుగ్గన తరఫు న్యాయవాదికి నోటీసు ఇచ్చారు. బుగ్గన నామినేషన్ తిరస్కరించకుండా పెండింగ్‌లో పెట్టడాన్ని తప్పుబడుతూ కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి ఆర్వోపై ఈసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై త్వరగా స్పష్టత ఇవ్వాలని కోరారు.




## జగన్ ఏ స్థాయికి దిగజారిపోయారో ప్రజలు ఆలోచించాలి: బీటెక్ రవి

కడప: రాష్ట్రంలో పెత్తందార్లకు అసలైన ప్రతినిధి సీఎం జగనేనని తెదేపా నేత, ఆ పార్టీ పులివెందుల అభ్యర్థి బీటెక్ రవి విమర్శించారు. ఎక్కడికి వెళ్లినా పేదలకు, పెత్తందార్లకు మధ్య పోరాటం జరుగుతోందని ఆయన ఊదరగొడుతున్నారన్నారు. కడపలో నిర్వహించిన మీడియా సమావేశంలో తెదేపా నేత శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికల అఫిడవిట్‌లో సుమారు రూ.750కోట్ల ఆస్తులు ఉన్నట్లు జగన్ పేర్కొన్నారని.. ఆయనపై పోటీ చేస్తున్న తన ఆస్తి దాదాపు రూ.80 లక్షలు మాత్రమేనని బీటెక్ రవి చెప్పారు. దీన్ని బట్టి పేదవాడు ఎవరో? పెత్తందారు ఎవరో పులివెందుల ప్రజలు ఆలోచించుకోవాలని సూచించారు. నుదిటికి ప్లాస్టర్‌తో వచ్చి పులివెందులలోనూ సానుభూతి సంపాదించాలనుకుంటున్నారా?.. ఇక్కడి ప్రజలు అంత అమాయకులని భావిస్తున్నారా?అని ధ్వజమెత్తారు. సొంత చెల్లెలు షర్మిల వస్త్రధారణపై జగన్ చాలా అసభ్యకరంగా మాట్లాడారని.. ఏ స్థాయికి ఆయన దిగజారిపోయారో ప్రజలు ఆలోచించాలని బీటెక్ రవి కోరారు. "సీఎం సతీమణి భారతి పసుపు వస్త్రాలు ధరించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇంట్లో ఉన్న ఆ రంగు చీరలను బయట పడేస్తారా? వివేకాకు రెండో పెళ్లి జరగలేదా? అంటూ సొంత చిన్నాన్న గురించి పులివెందులలోనే మాట్లాడటం సిగ్గుచేటుగా లేదా? 2017 ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలోనే జగన్‌కు ఈ విషయం తెలుసు.. అయినా ఎమ్మెల్సీ టికెట్ ఎలా ఇచ్చారు? అప్పుడు వివేకా వ్యక్తిత్వం గుర్తురాలేదా? ప్రతిపక్షంలో ఉన్నా ఏనాడూ మేం ఆయన వ్యక్తిగత జీవితంపై మాట్లాడలేదు. కానీ సొంత అన్న కుమారుడే వివేకాపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దారుణం" అని బీటెక్ రవి అన్నారు. వివేకా హత్య కేసులో సీబీఐ నిందితుడిగా చేర్చిన అవినాష్‌కు సీఎం జగన్ ఏవిధంగా సర్టిఫికెట్ ఇస్తారని ఆయన ప్రశ్నించారు. విధిలేని పరిస్థితుల్లోనే చిన్నపిల్లాడు, అమాయకుడని అవినాష్‌ను వెనకేసుకొస్తున్నారని ఆరోపించారు. జగన్ నామినేషన్‌కు డబ్బు, మద్యం ఇచ్చి జనసమీకరణ చేశారని బీటెక్ రవి అన్నారు. సీఎం అహంకారానికి, సొంత నియోజకవర్గం పట్ల చూపిన నిర్లక్ష్య వైఖరికి ప్రజలు తప్పకుండా బుద్ధి చెప్తారన్నారు.




దిల్లీ: దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల రెండో దశ పోలింగ్ ముగిసింది. 13 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లోని 88 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగుతోంది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా..పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. గతేడాది తీవ్రస్థాయి ఘర్షణలతో ఉక్కిరిబిక్కిరి అయిన మణిపుర్‌లోని పలు పోలింగ్ బూత్‌ల వద్ద భారీగా బలగాలను మోహరించారు. అలప్పుళ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న కేసీ వేణుగోపాల్ ఓటేశారు. మాజీ క్రికెటర్లు రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే బెంగళూరులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ బెంగళూరులోని పోలింగ్ బూత్ వద్ద క్యూలో నిల్చొని ఓటు వేశారు. ప్రజలంతా ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. తిరువనంతపురం కాంగ్రెస్ అభ్యర్థి శశిథరూర్ లైన్‌లో నిల్చొని ఓటేశారు. మీరు నమ్మిన వ్యక్తిని ఎంచుకోవడం ముఖ్యమని, అందుకోసం ప్రతి ఒక్కరు పోలింగ్‌లో పాల్గొనాలని ఓటేసిన అనంతరం ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ అన్నారు. భాజపా బెంగళూరు సౌత్ అభ్యర్థి తేజస్వీ సూర్య, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి, ఆయన సతీమణి సుధా మూర్తి, కేంద్రమంత్రి, బెంగళూరు నార్త్ అభ్యర్థి శోభా కరంద్లాజె, విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి హర్ష వర్ధన్ శింగ్లా, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ కుటుంబం, పశ్చిమ్ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్, కేంద్రమంత్రి, జోధ్‌పుర్ అభ్యర్థి గజేంద్ర సింగ్ షెకావత్, భాజపా తిస్సూర్, పథనంథిట్ట అభ్యర్థులు సురేశ్ గోపి, అనిల్ ఆంటోనీ ఓటు వేశారు. 'చిరుత' బ్యూటీ నేహా శర్మ బిహార్‌లో, మలయాళీ నటుడు టొవినో థామస్ కేరళలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.

# ఎన్నికల వేళ వైసీపీకి బిగ్ షాక్.. కీలక నేత జంప్..




మరికొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనుండగా.. వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. గుంటూరు జిల్లాకు చెందిన కీలక నేతల వైసీపీకి రాజీనామా చేశారు. ఇంతకీ ఆ కీలక నేత ఎవరు? ఎందుకు రాజీనామా చేశారో తెలుసుకుందాం. ఎన్నికల వేళ వైసీపీకి ఊహించని ఝలక్ ఇచ్చారు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తన రాజీనామా లేఖను తాడేపల్లి పెద్దలకు పంపించారు డొక్కా. వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా డొక్కా మాణిక్య వరప్రసాద్ ఉన్నారు. అయితే, గత కొంత కాలంగా వైసీపీ అధిష్టానంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న డొక్కా.. అదును చూసి దెబ్బ వేశారు. ఎన్నికల ముంగిట పార్టీకి రిజైన్ చేశారు. డొక్కా రాజీనామాతో వైసీపీలో తీవ్ర అలజడి నెలకొంది. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో డొక్క మాణిక్య వరప్రసాద్ కీలక నేతగా ఎదిగారు. 2004 నుంచి 2014 వరకు ఎమ్మెల్యేగా ఉన్న ఆయన.. మంత్రిగా కూడా పని చేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం డొక్కా టీడీపీలో చేరారు. ఎన్నికల్లో పోటీ చేయలేదు. 2020లో ఆయన వైసీపీలో చేరారు. వైసీపీ అధిష్టానం ఆయనకు ఎమ్మెల్యే పదవి ఇచ్చింది. అయితే, గత కొంత కాలంగా పార్టీ అధిష్టానం తీరుపై అసంతృప్తితో ఉన్న డొక్కా.. ఇప్పుడు పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. డొక్కా మాణిక్యవర ప్రసాద్ త్వరలోనే టీడీపీలో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# ముస్లింలు ఎలాంటి ఆందోళన చెందవద్దు... సుజనా భరోసా



విజయవాడ: నగరంలోని వన్ టౌన్ 55వ డివిజన్‌లో కూటమి పార్టీల బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజనాను కలిసి మహిళలు తమ సమస్యలను ఏకరుపెట్టారు. ఇరుకు రోడ్లు, డ్రైనేజీ, సమస్యలు పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యతను తీసుకుని చేస్తానని సుజనా హామీ ఇచ్చారు. ముస్లింకు రిజర్వేషన్ విషయంలో జరుగుతున్న ప్రచారంపై కూడా క్లారిటీ ఇచ్చారు. ముస్లింలు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కొన్ని పార్టీలు ఓటమి భయంతో ముస్లింలను బీజేపీకి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారన్న ఆగ్రహం వ్యక్తం చేశారు.

**జగన్ ప్రభుత్వాన్ని ఓడించండి...** "55వ డివిజన్ కంసాలి పేట ప్రాంతాల్లో నేడు పర్యటించాను. ప్రజలందరూ నాకు బ్రహ్మ రథం పడుతున్నారు. ఇక్కడ ఎక్కువ మంది పేదలుగానే మిగిలిపోయారు. డ్రైనేజీ, కరెంటు సిస్టం లు ఇక్కడ అధ్వాన్నంగా ఉన్నాయి. పేదలు మరింత పేదలుగానే మారిపోతున్నారు. సంపదను సృష్టించి, ఆదాయం పెంచే మార్గాలు వీరికి పాలకులు చూపలేదు. ప్రభుత్వాలు సంక్షేమంతో పాటు అభివృద్ధి, ఉపాధి అవకాశాలు చూపాలి. ఈ ఐదేళ్లల్లో ఈ ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. సంక్షేమం పేరుతో ఆదాయ మార్గాలను కూడా దెబ్బ తీసింది. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా సర్వ నాశనం చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించి ఇంటికి పంపాలి. ఇప్పటికే ఇరవై యేళ్లు రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్లారు. ఎన్డీఏ కూటమి వల్లే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. వైసీపీ ప్రభుత్వం వల్ల అవకాశాలు కోసం పొట్ట చేత పట్టుకుని వలసలు వెళ్లిపోయారు" అని తెలిపారు.

# వైఎస్ షర్మిల నిన్న ఒక రహస్యం చెప్పారు: కనకమేడల




న్యూఢిల్లీ: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిన్న (గురువారం) ఒక రహస్యం చెప్పారని, రాజశేఖర్ రెడ్డి పేరును సీబీఐ చార్జ్ షీట్‌లో ఇరికించింది జగన్మోహన్ రెడ్డేనని షర్మిలా చెప్పారని తెలుగుదేశంసీనియర్ నేత, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన ఢిల్లీ లో మీడియాతో మాట్లాడుతూ.. వివేక హత్య కేసు విచారణ జరగకుండా సీబీఐ అధికారులను బెదరిస్తున్నారని, సీఎం జగన్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ముద్దాయికి ఎంపీ టికెట్ ఇచ్చారని విమర్శించారు. వివేక హత్య కేసు విచారణను ముఖ్యమంత్రే అడ్డుకుంటున్నారంటే ఇంతకన్నా ఆధారాలు ఇంకా ఎం కావాలని కనకమేడల రవీంద్ర కుమార్ అన్నారు. ఎవరి పాత్రను కప్పిపుచ్చడం కొరకు ముద్దాయిలను జగన్ కాపాడుతున్నారని ప్రశ్నించారు. అవినాష్ రెడ్డి వివేక కేసులో నిందితుడని.. ఆయనను కాపాడాలని జగన్ చూస్తున్నారని అన్నారు. వివేక సతీమణి సౌభాగ్యమ్మ జగన్‌కు లేఖ రాశారని, ఆయినా జగన్ మనసు కరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం జగన్ నైతిక బాధ్యత వహించి సీఎం పదవి నుంచి తప్పుకోవాలన్నారు. లేదా వివేకను హత్య చేసిన వారిని, కుట్రదారులను శిక్షించాలని కనకమేడల రవీంద్ర కుమార్ డిమాండ్ చేశారు.

## గ్రామ స్వరాజ్యం.. జగనాసుర అరాచకం

కర్నూలు : గ్రామ స్వరాజ్యం సాధనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమైంది.. స్థానిక సంస్థలు స్వపరిపాలన చేసినప్పుడే అది సాధ్యమవుతుంది.మహాత్మా గాంధీ మాట
జగన్ కుట్ర పంచాయతీ, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు స్థానిక ప్రభుత్వాలుగా వ్యవహరిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాల్సి ఉండగా వాటిపై జగన్ కుట్ర పన్నారు. 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం పంచాయతీలకు పూర్తి అధికారాలు దఖలు పరచకపోగా వాటికున్న పరిమిత అధికారాల్ని కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా రాష్ట్ర ప్రభుత్వం తన గుప్పిట్లోకి తెచ్చుకుంది. ఫలితంగా పంచాయతీరాజ్ స్థానిక సంస్థలు నిర్వీర్యమయ్యాయి.

చిల్లిగవ్వ విదల్చని ఆర్థిక మంత్రి
రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి నాలుగుసార్లు జడ్పీ సమావేశాలకు హాజరయ్యారు. ప్రత్యేక నిధులు తీసుకురాలేకపోయారని సభ్యులు వాపోతున్నారు. “ అధికారి పార్టీకి చెందిన జడ్పీటీసీ సభ్యులుగా ఉండీ ఏమాత్రం ఉపయోగం లేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. కనీసం గౌరవ వేతనం కూడా సరిగా ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. టీఏ, డీఏలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈ విషయాలను పలుమార్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చినా ప్రయోజనం లేకపోయిందని తెలిపారు. సీపీడబ్ల్యూఎస్ పథకానికి సంబంధించి రూ.91 కోట్ల వరకు విద్యుత్తు బకాయిలున్నాయిని, వీటికి ప్రభుత్వం అదనపు నిధులు కేటాయించాలని తీర్మానించారు. ఇంతవరకు ఒక్క రూపాయి విడుదల కాలేదు.

అధికారం తీరుపై సభ్యుల గుర్రు
2021 సెప్టెంబరు 25న జడ్పీ పాలక వర్గం ఏర్పడింది. ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలో 52 మంది జడ్పీటీసీ సభ్యులు, 53 మంది ఎంపీపీలు అధికార పార్టీకి చెందినవారున్నారు. వీరిలో అధిక శాతం అసంతృప్తికి గురవుతున్నారు. పనులు చేసేందుకు నిధులు ఇవ్వడం లేదని చాలా మంది అసంతృప్తితో కొనసాగుతున్నారు. జడ్పీ సమావేశాలకొస్తే టీఏ, డీఏలు ఇవ్వడం లేదు.. గౌరవ వేతనం సరిగా అందడం లేదని సభ్యులు వాపోతున్నారు. రెండేళ్లలో ఒక జడ్పీటీసీ సభ్యునికి రూ.5 లక్షల విలువైన పనులు గతేడాది ఇచ్చారు.. అవీ మంజూరు కావడం లేదని నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక సంఘం ద్వారా రూ.12.70 కోట్లు, తలసరి గ్రాంట్ ద్వారా రూ.86 లక్షలు, సీనరేజి ద్వారా రూ.3.40 కోట్లు, స్టాంప్ డ్యూటీ ద్వారా రూ.2.81 కోట్లు జడ్పీ ఖజానాకు చేరుతున్నాయి. జడ్పీకి స్టాంపు డ్యూటీ రూ.2.65 కోట్ల రావాల్సి ఉంది.

ఇసుక తోడి.. నిధుల గండి
గ్రామ స్వరాజ్యానికి మూలస్తంభంలాంటి పంచాయతీ వ్యవస్థను జగన్ పతనం చేశారు. పంచాయతీలకు సర్వాధికారాలు కల్పించిన 73వ రాజ్యాంగ సవరణ స్ఫూర్తికి తూట్లు పొడిచారు. గ్రామ సచివాలయాల పేరుతో ఒక సమాంతర వ్యవస్థను తీసుకొచ్చి సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను ఉత్సవ విగ్రహాలుగా మార్చేశారు. పంచాయతీరాజ్ స్థానిక సంస్థలకు ఇసుక, గనులు, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే సెస్సు ప్రధాన ఆదాయ వనరు. వైకాపా ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసి గనుల శాఖ ద్వారా ఇసుక విక్రయం చేపట్టింది. రాష్ట్రస్థాయిలో టెండర్లు పిలిచి ఓ సంస్థకు అనుమతులు వచ్చేలా చేసింది. పేరుకు ఆ సంస్థ ఉన్నప్పటికీ బినామీ ద్వారా తుంగభద్ర తీరం వెంట ఇసుక విక్రయాలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి వచ్చే ఆదాయంలో స్థానిక సంస్థలకు సెస్సు రూపంలో ఇవ్వాలి. వాటికి ఎగనామం పెట్టారు.

ఖాతా ఖాళీ చేశారు
జగన్ గద్దెనెక్కిన తర్వాత పంచాయతీ నిధులు దారి మళ్లిస్తున్నారు. వాస్తవానికి ఫైనాన్స్ కమిషన్ నిధుల్లో పది శాతాన్నే పరిపాలన అవసరాలకు వెచ్చించాలి. ఆ సొమ్ములోంచే విద్యుత్తు బకాయిలు చెల్లించాలి. కానీ, జగన్ సర్కారు సగటున 24 శాతం నుంచి 90 శాతం వరకు ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాల నుంచి ఖాళీ చేసింది. మురుగు కాల్వలను శుభ్రం చేసేందుకు సొమ్ములేవు.. మంచినీటి పైప్‌లైన్ల మరమ్మతులకు పైసల్లేవు.. ఆఖరికి బ్లీచింగ్, ఫాగింగులకూ డబ్బు వెతుక్కోవాల్సిన దుస్థితిని కల్పించారు. ఏ పని చేసేందుకు కూడా సర్పంచుల దగ్గర సరిపడా సొమ్ము లేకుండా చేశారు జగన్. ఏదీ చేయలేక గ్రామస్థులకు సమాధానం చెప్పుకోలేకపోతున్నామని సర్పంచులు నెత్తీనోరూ కొట్టుకున్నా జగన్ వినిపించుకోలేదు.

జడ్పీ ముఖం చూడని ఎమ్మెల్యేలు
పల్లె ప్రజల వెతలు వినిపిద్దామని ప్రాదేశిక సభ్యులు జిల్లా పరిషత్‌కొస్తే వినాల్సిన ఎమ్మెల్యే జడ్పీ ముఖం చూడటం లేదు. గత ఐదేళ్లలో కొందరు అడుగేపెట్టలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మండలానికే బాస్‌లా వ్యవహరించే జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు వైకాపా హయాంలో నామమాత్రంగా మారారు. ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, శ్రీశైలం ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి ఒక్కసారి కూడా జడ్పీ స్థాయీ సంఘాలతో పాటు సర్వసభ్య సమావేశాలకు హాజరుకాకపోవడం గమనార్హం.

మొత్తం పంచాయతీలు: 973,
మేజర్: 32, మైనర్ : 941
(ప్రస్తుతం సర్పంచులు ఉన్నది 970)
ఉమ్మడి కర్నూలులో మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు (ఎంపీటీసీలు): 804 జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు (జడ్పీటీసీలు) : 53

## దేవుడి భూమినీ గుల్ల చేశారు

కళ్యాణదుర్గం : జిల్లాలోని పెద్దవడుగూరుకు కూతవేటు దూరంలో ఉన్న నెలగొండరాయుడుస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే సంఖ్య 777-ఎలోని 21.04 ఎకరాల ఎర్రనేల భూముల్లో వైకాపా నేతల కన్ను పడింది. అధికార పార్టీకి చెందిన కొందరు ఇష్టారాజ్యంగా ఎర్రమట్టిని తరలించి సొమ్ము చేసుకున్నారు. గడచిన ఐదేళ్లలో సాగులో ఉన్న ఆలయ భూమిలో ప్రవేశించి అక్రమార్జనకు తెరలేపారు. ప్రస్తుతం ఆలయ భూమి ఆనవాలు లేకుండా చేశారు.



మాన్యం ఆనవాళ్లు కోల్పోవ డంతో ఆలయ అధికారులు కౌలుమాటే మరిచిపోయారు. ఎర్రమట్టి తవ్వకాలతో భూమి రూపు కోల్పోయి 21 ఎకరాల్లో రెండు ఎకరాలు మాత్రమే మిగిలింది. ఈవిషయంపై దేవదాయశాఖ ఈవో నాగేంద్రు డును వివరణ కోరగా ఆలయ భూమిలో భారీగా అక్రమ తవ్వకాలు జరిపారు. ఇదివరకే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని వివరించారు.

## బకాయిల ‘దీవెన’ పేదల వేదన..!



విశాఖపట్నం : జగనన్నమాట: చదువుల కోసం ఏ పేదవాడు అప్పుల పాలు కాకూడదని ‘విద్యా దీవెన’ పథకాన్ని ప్రవేశపెట్టాం. గతంలో మాదిరిగా ‘ ఫీజులు ఇంతే కడతాం. ఇంతకంటే ఎక్కువ కట్టాల్సి వస్తే మీ ఆస్తులు అమ్ముకోండి. మీ చావు మీరు చావండి’ అనే విధానానికి స్వస్తి పలికాం. తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండా త్రైమాసికం పూర్తయిన వెంటనే ఫీజులు జమ చేస్తున్నాం.
రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకంతో ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. వారందరినీ జగన్ నట్టేట ముంచారు. అయిదేళ్లుగా సమయానికి నిధులు విడుదల చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మరోవైపు ఫీజులు చెల్లించకుంటే పరీక్షలు రాసేందుకు అనుమతించబోమని కళాశాలల యాజమాన్యాలు హెచ్చరిస్తున్నాయి. తమ పిల్లల చదువుకు ఆటంకాలు ఎదురవుతాయని తల్లిదండ్రులకు భయం పట్టుకుంది. దీంతో దొరికిన చోట అప్పులు చేసి, ఆస్తులు తాకట్టు పెట్టి పిల్లల ఫీజులు చెల్లించారు. వైకాపా ప్రభుత్వ ‘ఫ్యాజు’పీకేస్తేనే పరిస్థితి గాడిన పడుతుందని పలువురు చెబుతున్నారు.

బటన్ నొక్కినా రాని నిధులు
ఒక విద్యా సంవత్సరానికి నాలుగు విడతలుగా విద్యా దీవెన నిధులు విడుదల చేస్తారు. 2023-24 సంవత్సరంలో అక్టోబరు, నవంబరు, డిసెంబరు త్రైమాసికానికి సంబంధించిన విద్యా దీవెన నిధుల విడుదలకు మార్చి 1న సీఎం జగన్ బటన్ నొక్కారు. కానీ ఇప్పటికీ తల్లుల ఖాతాలకు జమ కాలేదు. ఆ త్రైమాసికానికి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 44,177 మంది విద్యార్థులను అర్హులుగా తేల్చారు. వారికి మొత్తం రూ.34.72 కోట్లు విడుదల కావాల్సి ఉంది. ఇంకా మూడు విడతలకు సంబంధించిన నిధులను ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఈలోగా పరీక్షలు రావడంతో చాలా మంది తప్పనిసరి పరిస్థితుల్లో ఫీజులు చెల్లించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఇప్పట్లో నిధులు విడుదల చేసే అవకాశం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వాస్తవం
నగరానికి చెందిన ఓ విద్యార్థిని ఒక ప్రైవేటు కళాశాలలో పాలిటెక్నిక్ చివరి ఏడాది చదువుతోంది. ఆమె తల్లిదండ్రులు నిరుపేదలు. రూ.25 వేల ఫీజు బకాయి చెల్లిస్తేనే హాల్‌టికెట్ ఇస్తామని యాజమాన్యం తేల్చిచెప్పింది. కొద్ది రోజుల్లో అప్పు చేసైనా చెల్లిస్తామని వేడుకున్నా ప్రయోజనం లేకపోయింది. కుమార్తె వేదన చూడలేని తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రెండు వారాల్లో రూ.12 వేలు చెల్లిస్తానని తల్లి నుంచి హామీ పత్రం తీసుకుని విద్యార్థినికి హాల్‌టికెట్ అందించారు.

రూ.35 వేలు చెల్లించా: మా అబ్బాయి పీఎం పాలెంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో ఏడాది చదువుతున్నాడు. ఈ ఏడాది ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదు. ఫీజు చెల్లించకుంటే పరీక్షలు రాయడం కుదరదని కళాశాల యాజమాన్యం హెచ్చరించింది. దీంతో మొత్తం రూ.35 వేలు చెల్లించా.- అన్నాజీ, ప్రైవేటు ఉద్యోగి

కొలువులకు దూరం..
తెదేపా హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసేవారు. ప్రభుత్వం, యాజమాన్యాల మధ్యే ఫీజుల వ్యవహారం కొనసాగేది. ఎలాంటి ఇబ్బందులు, ఒత్తిడి లేకుండా విద్యార్థులు చదువు పూర్తిచేసేవారు. వైకాపా అధికారంలోకి వచ్చాక ఆ విధానాన్ని మార్చేసి.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మధ్యలోకి లాగారు. విధానాలు మార్చడంపై పెట్టిన దృష్టి నిధుల విడుదలపై లేకపోయింది. అయిదేళ్లలో ఒక్కసారి కూడా చెప్పిన సమయానికి నిధులు విడుదల చేయలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చదువు పూర్తయిన విద్యార్థులు ఫీజు బకాయిలు చెల్లిస్తేనే ధ్రువపత్రాలు ఇస్తామని యాజమాన్యాలు స్పష్టం చేస్తున్నాయి. కొందరు అప్పు చేసి చెల్లిస్తుండగా.. మరికొందరు ధ్రువపత్రాలు తీసుకోలేదు. ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలు వచ్చినా వెళ్లలేక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

## పుస్తక పుటలకు జగనన్న చెద



కర్నూలు : కోడుమూరులో గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. 10,462 పుస్తకాలు అందుబాటులో ఉండగా, 573 మంది పాఠకులు నమోదై ఉన్నారు. కొత్త భవన నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరైనా టెండర్లు దాఖలు కాకపోవడంతో అడుగులు ముందుకుపడటం లేదు. గ్రంథాలయాల్లో పాఠకుల్ని సమస్యలు వేధిస్తున్నాయి. జగన్ ప్రభుత్వం నిధులివ్వకపోవడంతో అభివృద్ధి పనులు జరగడం లేదు. పాఠకులకు కొత్త పుస్తకాలు అందుబాటులో ఉండటం లేదు. ఏళ్ల నాటి పుస్తకాలకు రక్షణ లేకపోవడంతో బూజుపట్టేస్తున్నాయి. మండల కేంద్రాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు పుస్తకాలు లేక నిరుద్యోగులు ఉసూరుమంటున్నారు. గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేస్తామని ఎక్కడికక్కడ ఊదరగొట్టే మాటలు చెప్పిన జగన్ ఆచరణలోకి తీసుకురాలేదు. వైకాపా వచ్చినప్పటి నుంచి గ్రంథాలయాలకు గ్రాంట్స్ లేకపోవడంతో అరకొరగా వసూలవుతున్న సెస్సులతోనే కష్టంగా సిబ్బంది నెట్టుకొస్తున్నారు.
ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా గ్రంథాలయ సంస్థతో పాటు 59 శాఖా గ్రంథాలయాలు, 160 బుక్ డిపాజిట్ కేంద్రాలు ఉన్నట్లు గ్రంథాలయశాఖ అధికారులు తెలిపారు. తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ తదితరాలకు సంబంధించి జిల్లాలో 6,01,059 పుస్తకాలు ఉండగా, జిల్లా కేంద్రంలో అయితే 70 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. 70 వేల మంది పాఠకులు సభ్యత్వం పొందారు. ఉమ్మడి జిల్లాలో సొంత భవనాలున్న గ్రంథాలయాలు 29 ఉండగా, ఉచిత (రెంట్ ఫ్రీ) భవనాలు 12, అద్దె భవనాల్లో 19 గ్రంథాలయాలు కొనసాగుతున్నాయి. ఇందులో గ్రేడ్-1 గ్రంథాలయం ఆదోనిలో, గ్రేడ్-2 గ్రంథాలయాలు మద్దికెర, శ్రీశైలం, డోన్, నంద్యాల, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ, పత్తికొండ, బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆలూరు ప్రాంతాల్లో ఉన్నాయి. మిగతావి గ్రేడ్-3 కింద కొనసాగుతున్నాయి.

గ్రాంట్ల కోత
ప్రభుత్వం ప్రతి ఏడాది సుమారు రూ.6 కోట్లు ఇవ్వాలి. వైకాపా మాత్రం రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లే ఇస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే అరకొర గ్రాంట్లతో పాటు గ్రంథాలయాలకు వచ్చే సెస్సుతోనే వేతనాలు, వసతులకల్పనతో పాటు భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థకు ప్రభుత్వం నుంచి రూ.7 కోట్లు రావాల్సి ఉండగా, ప్రభుత్వానికి నివేదించి రెండేళ్లు అవుతున్నా...నేటికి ఒక్క రూపాయి కూడా రాలేదు.

రూ.కోట్లల్లో బకాయిలు
కర్నూలు నగరపాలక సంస్థతోపాటు పురపాలికలు, పంచాయతీల్లో వసూలవుతున్న ఇంటిపన్నులు 8 శాతం గ్రంథాలయాలకు చెల్లించాలి. గ్రంథాలయానికి రావాల్సినవి పూర్తిస్థాయిలో అందడం లేదు. 2019 నుంచి కర్నూలు నగరపాలక సంస్థ నుంచి రూ.6,37,12,262, పురపాలికల నుంచి రూ.80,16,292, పంచాయతీల నుంచి రూ.14,82,303 సెస్సు రావాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.


అప్పట్లో 10.. ఇప్పుడు 4
తెదేపా హయాంలో పదిచోట్ల గ్రంథాయల భవనాల నిర్మాణాలకు గానూ సుమారు రూ.4 కోట్లు ఖర్చు చేస్తే వైకాపా వచ్చాక నాలుగు భవనాల నిర్మాణాలకు రూ.1.50 కోట్లు మాత్రమే కేటాయించారు. మూడుచోట్ల భవనాల నిర్మాణాలు ఇంకా జరుగుతున్నాయి. కోడుమూరులో రూ.40 లక్షలతో చేస్తున్న పనులు పునాదులకే పరిమితమయ్యాయి.

నాలుగేళ్లలో 40 వేలే.?
2019 ఏడాది నుంచి ఇప్పటివరకు ఒక్కసారే గ్రంథాలయాలకు వైకాపా పుస్తకాలను కొనుగోలు చేసింది. 2021-22 ఏడాదిలో రూ.37 లక్షలు విలువైన 40 వేల పుస్తకాలు కొనుగోలు చేసి మండల కేంద్రంలో ఉన్న లైబ్రరీకి 6 వేల నుంచి 7 వేల వరకు సరఫరా చేసింది. తెదేపా హయాంలో పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలను సుమారు రూ.70 వేల వరకు కొనుగోలు చేయడం గమనార్హం.

## ఉత్సవ విగ్రహాల్లా మార్చేశావ్.. జగన్

మార్కాపురం : గత ప్రభుత్వ హాయంలో సర్పంచులు అంటే ఎంతో గౌరవంగా ఉండేది. చెక్ పవర్‌తో నిధులను ఖర్చు చేసి ప్రజా సమస్యలను పరిష్కరించేవారు. వైకాపా సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత సర్పంచులకు పవర్ లేకుండా చేశారు. పంచాయతీల్లో ఉన్న నిధులను ప్రభుత్వం ఇష్టానుసారంగా వారి అనుమతి లేకుండా తీసుకొని వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు, పంచాయతీల్లో వివిధ నిర్మాణాలకు మళ్లించి పంచాయతీల్లో ఒక్క చిల్లి గవ్వ కూడా లేకుండా చేసి సర్పంచులను ఖాళీ గా కూర్చీల్లో కూర్చొబెట్టారు. ఒక్కొక్కపంచాయతీలో సర్పంచులకు తెలియకుండా రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు కూడా వైకాపా సర్కార్ తీసుకొని ఇతర వాటికి మళ్లించింది. సర్పంచులు ఆందోళనలు, నిరసనలు చేసినా పట్టించుకోలేదు.చిన్న సమస్యను తీర్చలేకపోయాం పంచాయతీలో చిన్న సమస్యను పరిష్కరించ లేకపోయాం. మా పంచాయతీ పరిధిలో సుమారు రూ.30లక్షల పంచాయతీ నిధులను ప్రభుత్వమే తీసేసుకోవడంతో చిన్న పాటి పనులు చేపట్టేందుకు నిధులు లేక కాలం వెళ్లబుచ్చాల్సిన పరిస్థితి దాపురించింది.కర్నాటి రామసుబ్బారెడ్డి, సర్పంచి, కొమ్మునూరు
అప్పుల పాలయ్యాంగ్రామాల్లో ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాం. గ్రామంలో రోడ్డు వేయడం కాదు కదా.. నీటిని అందించలేని దుస్థితిలో ఉన్నాం. అప్పు చేసి గ్రామాల్లో ఏమైనా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా.. వాటికి నిధులు రాక అప్పుల పాలయ్యాం. పాతకోటి వెంకట సుబ్బారావు, ఉప సర్పంచి, పాత అన్నసముద్రం, త్రిపురాంతకం మండలం.

ఆర్థిక సంఘం నిధులు పక్కదారి..
గ్రామాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించలేక, వారికి సమాధానాలు చెప్పలేక సతమతమవుతున్నాం. గ్రామాల్లో వాటర్ ట్యాంకర్‌ల బిల్లులకు ప్రత్యేక నిధులు కేటాయించాల్సి ఉంది. అవాటికి కూడా పంచాయతీ నిధుల నుంచి చెల్లించాలంటూ ఆదేశాలు ఇచ్చారు.రావిళ్ల సుధాకర్, సర్పంచ్, మిరియంపల్లి,



త్రిపురాంతకం మండలంహక్కులను కాలరాశారు
మా హక్కులు కాలరాస్తున్నారు. అధికార పార్టీ నాయకులు సర్పంచులకు తెలియకుండా పనులు చేస్తూ వాటి బిల్లులు చేయాలని మాపై అనేక సార్లు ఒత్తిడి చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేకపోతున్నాం. వారికి ఏడాది నుంచి ఇవ్వాల్సి ఉంది. కె.భాగ్యమ్మ, సర్పంచి, రాయవరం
పనులకు పైసలు లేవుతాగునీరు, ఇతర పనులు చేసి రూ.7లక్షలు ఖర్చు చేసి రెండు సంవత్సరాలైంది. నిధులు మంజూరు చేయకపోవడంతో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. నిధులు లేక ఏం చేయలేకపోతున్నాం. సిమెంట్ రహదారులు, తాగునీటి, ఇతర సమస్యలు చేయాలనుకున్నాం. వెంకటనారాయణ , సర్పంచి, వింజవర్తిపాడు, కొనకనమిట్ల మండలం

ప్రగతి శూన్యం
మూడేళ్లుగా ప్రభుత్వం పైసా కేటాయించలేదు. నిధుల్లేక గ్రామాల్లో అభివృద్ధి పూర్తా కుంటుపడింది. ప్రభుత్వం గతంలో తీసుకున్న నిధులు అన్ని వెంటనే పంచాయతీల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరుతున్నాను. నిధులు ఉంటే ప్రజా సమస్యలను పరిష్కరించదానికి అవకాశం ఉంటుంది.గోగిరెడ్డి పార్వతమ్మ, సర్పంచి, నికరంపల్లి

## కేసీ.. జగన్ నిర్లక్ష్యం చేసి

కర్నూలు : ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రగల్భాలు పలికిన జగన్ ఐదేళ్లు అధికారంలో ఉన్నా ఐదువందలు కేటాయించలేదు.. కేసీ కాల్వకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఒక్క రూపాయి వెచ్చించలేదని శాసనసభా సాక్షిగా ‘కాగ్’ తేల్చింది.. పదేపదే రైతు పక్షపాతిగా చెప్పుకొనే జగన్.. కేసీ కాల్వను గాలికొదిలేశారు.. తన సొంత జిల్లా ప్రజలకు నీటిని అందిస్తున్నా పైసా ఇవ్వలేదు.. నీరు పారే కాల్వలు ఛిద్రం కావడంతో ఆయకట్టు బీళ్లుగా మారింది. కాల్వ పరిధిలో సాగయ్యే ‘సోనా’ రకం వరి ప్రమాదంలో పడింది.!!

చరిత్ర తెలుసా జగన్
బ్రిటిష్ హయాంలో నౌకాయానం కోసం కేసీ కెనాల్ నిర్మించారు. కర్నూలు జిల్లా సుంకేసుల ఆనకట్ట నుంచి మొదలై 304 కి.మీ పొడవుతో వైఎస్సార్ జిల్లాలోని కృష్ణాపురం వరకు ప్రవహిస్తుంది. సర్ ఆర్థర్ కాటన్ సలహా ప్రకారం వ్యవసాయ భూములకు నీటి సదుపాయాన్ని కల్పించేందుకు ఉపయోగించాలని నిర్ధారించారు. ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ జిల్లాల పరిధిలో ఖరీఫ్ రబీ పంటలకు ఏడాదిలో ఎనిమిది నెలల పాటు 31.90 టీఎంసీల నీటిని 2,65,628 ఎకరాలకు నీరు ఇవ్వాలి. కాల్వ పొడవునా ఎక్కువగా వరి సాగు చేస్తారు.

మొదటి 40 కి.మీ అస్తవ్యస్తం
కేసీ ప్రధాన కాల్వ సామర్థ్యం 3,850 క్యూసెక్కులు. పూర్తి సామర్థ్యంతో నీటిని వదిలితే తెగిపోయే ప్రమాదముందన్న ఉద్దేశంతో అధికారులు ప్రస్తుతం 2,100 క్యూసెక్కులు మించి వదలడం లేదు. దీనిని అధిగమించేందుకు ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల పథకాలు వినియోగిస్తున్నారు. వీటిని వినియోగిస్తున్న కారణంగా నిత్యం రూ.4 లక్షలు వెచ్చించాల్సిన పరిస్థితి. ఇది అదనపు భారంగా మారింది.
సుంకేసుల జలాశయం (0 కి.మీ) నుంచి 40 కి.మీ వరకు ఇరువైపులా కట్టలు నెర్రలు బారాయి. లైనింగ్ కుంగి దెబ్బతింది. మట్టి పేరుకుపోయింది. స్లూయిజ్, షట్టర్లు దెబ్బతిన్నాయి. నందికొట్కూరు నియోజకవర్గం అల్లూరు, శాతనకోట, మల్యాల, పగిడ్యాల, జూపాడుబంగ్లా పరిధిలో లైనింగ్ పూర్తిగా దెబ్బతింది. కొన్నిచోట్ల లైనింగ్ పూర్తిగా కొట్టుకుపోయింది.

కదలని కాసుల దస్త్రం
2009లో వచ్చిన వరదలకు కేసీ కాల్వ చాలాచోట్ల దెబ్బతింది. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేశారు. శాశ్వత పనులు చేపట్టేందుకు రూ.124 కోట్లు ఖర్చవుతాయని అధికారులు తేల్చారు. పలుమార్లు ప్రతిపాదనలు పంపినా పాలకులు పట్టించుకోవడం లేదు.
ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) నిధులతో ఆధునికీకరణ చేపట్టాలని నిర్ణయించారు. సుంకేసుల జలాశయం అభివృద్ధి, ప్రధాన కాల్వకు ఇరువైపులా లైనింగ్‌కు మరమ్మతులు, కొన్నిచోట్ల శాశ్వత నిర్మాణాలు వంటి పనులు చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. కేంద్రం రూ.514.40 కోట్లు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసింది. రాష్ట్రం వాటా విడుదల చేయకపోవడంతో ‘నిధుల’ ప్రవాహం ఆగింది. రాష్ట్రం చొరవ తీసుకుని సెంట్రల్ వాటర్ కమిషన్‌తో సంప్రదించాల్సి ఉండగా ఆ దిశగా అడుగులు వేయలేదు.

చంద్రన్న కట్టారు
కేసీ ఆయకట్టుకు వేసవిలో నీటిని ఇచ్చేందుకు అలగనూరు జలాశయానికి రూపకల్పన చేశారు. దీనికి 1985 నవంబరు 11న అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో అనుమతులు ఇచ్చారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దీనికి 3,585 ఎకరాలు సేకరించారు. రూ.59.7 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. 7.50 కి.మీ. మట్టికట్ట నిర్మించారు. 2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ జలాశయాన్ని ప్రారంభించారు. ఇందులో 2.965 టీఎంసీలు నిల్వ చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేవారు.

జగనన్న కూల్చారు
నాలుగేళ్ల కిందట జలాశయం కట్ట కుంగిపోయింది. వైకాపా ప్రభుత్వం నీటి నిల్వను ఆపేసింది. మరమ్మతుల పేరుతో 20 మీటర్ల కట్ట తొలగించింది. పనుల కోసం రూ.3.20 కోట్లు మంజూరు చేసింది. గుత్తేదారు పనులు చేపట్టినా బిల్లులు అందక మధ్యలో వదిలేశారు. పనుల్లో జాప్యం కావడంతో మట్టి కట్ట తొలగించిన ప్రాంతం నుంచి సుమారు 500 మీటర్ల వరకు మళ్లీ కట్ట కుంగిపోయింది. మొత్తం మరమ్మతులకు రూ.24 కోట్లు కావాలంటూ అధికారులు మళ్లీ ప్రతిపాదనలు పంపారు. వీటికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించకపోవడంతో రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసే పరిస్థితి లేకుండా పోయింది. ఆయకట్టు పొలాలు బీడుగా మారాయి. జలాశయం సమీపంలోని అలగనూరు, తలముడిపి, రోళ్లపాడు, కొర్రపోలూరు గ్రామాలకు చెందిన సుమారు 200 మత్స్యకార కుటుంబాలు ఆధారపడి జీవనం సాగించేవారు.

31.90 టీఎంసీలు కేటాయింపు
బచావత్ అవార్డు ప్రకారం తుంగభద్ర నుంచి 10 టీఎంసీలు, నదీ ప్రవాహ జలాలు 21.90 టీఎంసీలు కేటాయించారు. సుంకేసులలో 1.20 టీఎంసీలు నిల్వ చేసి ప్రధాన కాలువకు విడుదల చేస్తున్నారు. కేసీ కాలువకు 31.90 టీఎంసీల నీటి వాటాను కృష్ణా జల వివాదాల పరిష్కార సంస్థ (కేడబ్ల్యూడీటీ) కేటాయించింది. తుంగభద్ర జలాశయం ద్వారా 10 టీఎంసీలు.. మిగిలినవి నది ద్వారా (వరద జలాలు) తీసుకోవాల్సి ఉంటుంది.
ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు, కల్లూరు, నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, వెలుగోడు, గడివేముల, బండి ఆత్మకూరు, మహానంది, నంద్యాల, గోస్పాడు, శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి, దొర్నిపాడు మండలాల పరిధిలో 259 గ్రామాలకు చెందిన రైతులు పంటలు సాగు చేస్తున్నారు.

చివరికి చేరని నీరు
ప్రధాన కాల్వ 60 కి.మీ దాటిన తర్వాత లైనింగ్ పలుచోట్ల దెబ్బతింది. మల్యాల నుంచి ముచ్చుమర్రి వరకు అధ్వానంగా ఉంది. పలుచోట్ల పగుళ్లు వచ్చాయి.. కొన్నిచోట్ల భారీగా కుంగిపోయింది.. కాలువకు ఇరువైపులా ముళ్లపొదలు దట్టంగా పెరిగాయి.
నందికొట్కూరు నియోజకవర్గం శాతనకోట-మల్యాల మధ్యలో విద్యుత్తు మోటార్లు వేసుకుని నీటిని తీసుకెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కాల్వ అడుగుభాగం (బెడ్) దెబ్బతిని బురద మేట వేసింది. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు నిండిపోయాయి. సాగు నీటి కాలువ మురుగుమయంగా మారింది.
చాగలమర్రి సమీపంలో పంట కాల్వ ఆనవాళ్లు కోల్పోయింది. నీరు అందక దాదాపు రెండు వేల ఎకరాలు బీళ్లుగా మారింది. కాల్వ పొడవునా పలుచోట్ల ఇదే పరిస్థితి నెలకొంది.
ఏటా రూ.168 కోట్ల నష్టంకర్నూలు, వైఎస్సార్ జిల్లాలో రెండో పంటకు నీరందకపోవడంతో సుమారు 56 వేల ఎకరాల్లో పంటలు సాగవ్వడం లేదు. ఎకరాకు రూ.30 వేల ప్రకారం ఏటా రూ.168 కోట్ల మేర ఆయకట్టు రైతులు నష్టపోతున్నారు.

## బ్యానర్లు తొలగించరు.. నిబంధనలు వర్తింపజేయరు


కుప్పం : గత నాలుగు రోజుల్లో వరుసగా ఉల్లంఘనలు వెలుగు చూస్తున్నాయి. ఎన్నికల అధికారులు సైతం పక్షపాతం చూపుతూ వైకాపా నాయకులైతే ఎర్ర తివాచీ పరిచి స్వాగతం పలుకుతున్నారు. విపక్షాలైతే.. అందులో తెదేపా నాయకులైతే.. ఎక్కడ అధికార నాయకుల ఆగ్రహానికి బలి అవుతామేమోననే భయంతో నిబంధనలు పక్కాగా అమలు చేయడమే కాగా.. ఓ అడుగు ముందుకేసి లేని నిబంధనలు సైతం అమలు చేస్తారు. ఇదీ కుప్పంలో ప్రస్తుతం కనిపిస్తున్న తీరు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి నుంచి నివేదికలు తెప్పించుకుని ఇలాంటి వాటిని సరిదిద్దాల్సిన జిల్లా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి.
పార్టీలకతీతంగా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికార యంత్రాంగం అధికారపార్టీ నాయకుల జపం చేస్తోంది. మంచినీటి ట్యాంకులు, సచివాలయాలు, నీటి సరఫరా ట్రాక్టర్లు, శిలాఫలకాలు, పార్టీ జెండా స్థూపాలకు ఇలా అన్నింటికి పార్టీ రంగులు, చిత్రాలు కనిపించకుండా చేయాల్సి ఉన్నా.. యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. నియమావళి అమల్లోకి వచ్చి నెల రోజులు దాటినా కుప్పంలో ఈ ఉల్లంఘనలు కనిపిస్తూనే ఉన్నాయి. అదే తెదేపాకు చెందినవి అయితే పట్టుబట్టి.. వెంటబడి మరి నిబంధనలే అమలు చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో విమర్శలు వస్తున్నా.. ఉన్నతాధికారులు సైతం ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. కథనం వచ్చిన తర్వాత హడావుడి.. ఎన్నికల్లో గెలుపు కోసం యత్నించే అని పార్టీలకు సమాన అవకాశాలు ఇవ్వాలి. ఇదీ ఎన్నికల సంఘం ప్రాథమిక విధి. అయితే స్థానిక అధికారులు, పోలీసు యంత్రాంగాలు వైకాపాకు అనుకూలంగా వ్యవహరిస్తూ కళ్లకు గంతలు కట్టుకున్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతికల్లో కథనాలు వచ్చిన తర్వాత నింపాదిగా స్పందిస్తున్నారు. కుప్పం మండలం నాయనూరు పంచాయతీ పెద్దవంక గ్రామంలోని వైకాపాకు చెందిన ఫ్యానుతో కూడిన స్తంభం, సురక్షిత శుద్ధజలం ట్యాంకుపై సీఎం చిత్రాలు కనిపిస్తున్నాయి. దీనిపై కథనం ప్రచురితమైంది.



పట్టణంలోని అన్న క్యాంటీన్‌లో ఈనెల 20 భువనేశ్వరి పర్యటన సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. అక్కడ దాతలు రాజకీయ నాయకుల చిత్రాలు, పేర్లు లేకుండా బ్యానర్ ఏర్పాటు చేశారు. దీనిపై ఏఈఆర్వో నాగేశ్వరరావు తొలగించాలని హుకుం జారీ చేశారు. అక్కడికి కూతవేటు దూరంలో వైకాపా ప్రధాన నాయకుల చిత్రాలతో బ్యానర్ ఉన్నా వారికి చెప్పే ధైర్యం చేయలేకపోయారు. కథనం ప్రచురితం కావడంతో.. వైకాపా నాయకులను చరవాణిలో బతిమిలాడి, నచ్చజెప్పి తొలగించేలా చేశారనే విమర్శలు వచ్చాయి. ః రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో జగనన్న భూరక్ష పేరుతో రాళ్లు నాటారు. ఇవన్నీ ఆ పేర్లతో ఎక్కడపడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. ఈ రాళ్లకు జగనన్న పేర్లు కనిపించకుండా పెయింటింగ్ చేయించాలని జిల్లా అధికారులు ఆదేశించినా.. క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు ఒకటి.. రెండు రాళ్లకు రంగు లేసి చేతులెత్తేశారు.
నామినేషన్ల దాఖలులోనూ.. ఈనెల 19న చంద్రబాబు తరఫున ఆయన సతీమణి నారా భువనేశ్వరి నామపత్రాలు దాఖలు చేశారు. ఆ సందర్భంగా ఆర్వో కార్యాలయానికి ర్యాలీగా వచ్చిన ఆమె వంద మీటర్లకు ముందే కార్లు నిలిపేశారు. నడచి వెళ్లాల్సిందేనని పోలీసులు చెప్పడంతో ఆమె నడిచే వెళ్లి నామపత్రాలు అందజేసి వచ్చారు. అయితే వైకాపా అభ్యర్థి భరత్ తరఫున ఆయన సతీమణి దుర్గ నామపత్రాల దాఖలుకు వచ్చారు. ఆమెకు పోలీసులు సలాం చేస్తూ కార్లను నేరుగా కార్యాలయం లోపలికి అనుమతిచ్చారు. అంతే కాకుండా నిబంధనలకు విరుద్దంగా అధికం లోపల కూర్చోబెట్టి నామపత్రాలు ఓ విశ్రాంత అధికారి సాయం పరిశీలన చేసి ఆ తర్వాత దాఖలు చేశారనే ఆరోపణలు వచ్చాయి
ఇదిగో ఉదాహరణ..
కుప్పం మండలం మల్లానూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణం కోసం చంద్రబాబునాయుడు సీఎం హోదాలో వేసిన శిలాఫలకానికి అధికారులు ముసుగు ధరించారు. కుప్పం నుంచి మల్లానూరుకు వెళ్లే మార్గం పక్కనే అనిమిగానిపల్లి వద్ద ఓ వైకాపా నేతకు చెందిన రూఫింగ్ సొల్యూషన్స్ కంపెనీ పేరుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వేసిన శిలాఫలకం అధికారులకు కనిపించలేదో... లేక వైకాపా జపం చేస్తున్నారో తెలియదు కాని ఆ శిలాఫలకానికి ముసుగు వేయకుండా అలాగే వదిలేశారు.

## నమ్మండి.. జగనన్న కాలనీనే..

కళ్యాణదుర్గం : వజ్రకరూరు మండలంలోని చాబాల, ధర్మపురి, గూళ్యపాళ్యం, కమలపాడు, పీసీప్యాపిలి గ్రామాల్లోని జగనన్న కాలనీలు ముళ్లపొదలతో నిండిపోయాయి. గడేహొతూరులో 73 ఇళ్లు, వజ్రకరూరులో 578 పట్టాలకుగాను 121, కొనకొండ్లలో 830కుపైగా పట్టాలు పంపిణీ చేస్తే 181 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలినవి పునాది స్థాయిలో ఉన్నట్లు అధికారిక సమాచారం. ధర్మపురి గ్రామంలో 67 మందికి, కమలపాడు 68, చాబాల 178, గూళ్యపాళ్యం 104 మందికి జగనన్న కాలనీల్లో పట్టాలు



పంపిణీ చేశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం ఒక్క ఇల్లు కూడా నిర్మించలేకపోయింది. కనీసం కాలనీకి వెళ్లేందుకు దారి కూడా లేదు. లేఅవుట్‌లో ముళ్ల చెట్లు పెరిగాయి. కమలపాడు శివారులో గుంతకల్లు-కమలపాడు ప్రధాన రహదారి పక్కన లేఅవుట్‌లో పట్టాలు పంపిణీ చేసినా ఒక్క ఇంటిని కూడా ప్రభుత్వం నిర్మించలేదు. ఇక్కడ కూడా ముళ్ల చెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. పట్టాలు రద్దు చేస్తామని హౌసింగ్, రెవెన్యూ అధికారులు, వాలంటీర్లు లబ్ధిదారులను బెదిరించడంతో తట్రకల్లు, గంజికుంట, చిన్నహొతూరు గ్రామాల్లో పునాదులు వేసి వదిలివేశారు.

# జగన్ .. ఇంకా పరిహారం ఇవ్వలే



కళ్యాణదుర్గం : భైరవానితిప్ప ప్రాజెక్టుకు సంబంధించి రూ.542కోట్లు వ్యయం అవుతుంది. ఇందులో తొలుత రైతుల నుంచి భూమిని సేకరిస్తేనే కాలువ పనులకు అడుగులు ముందుకు పడతాయి. 1,406 ఎకరాల భూమిని సేకరించడానికి పరిహారంగా రూ.208కోట్లు మంజూరు చేస్తున్నాను. కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాలకు సాగునీరు అందించాలని గత తెదేపా ప్రభుత్వం జీడిపల్లి- భైరవాని తిప్ప- కుందుర్పి ఎత్తిపోతల పథకం కాలువ పనులు ప్రారంభించింది. జీడిపల్లి జలాశయం నుంచి కాలువ ద్వారా నీటిని తీసుకువచ్చి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులు, రాయదుర్గం నియోజకవర్గంలోని భైరవానితిప్ప ప్రాజెక్టుకు నీళ్లు తరలించాలన్నది ప్రాజెక్టు ఉద్దేశం. 2018 సంవత్సరం చివర్లో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కళ్యాణదుర్గం మండలం గరుడాపురం వద్ద రూ.968కోట్ల వ్యయంతో కాలువ పనులు ప్రారంభించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పనులు పూర్తి చేసి జీడిపల్లి నుంచి కృష్ణాజలాలు తీసుకువస్తామని ఆర్భాట ప్రకటనలు చేయడం తప్ప చేసిందేమీ లేదు. ఉష శ్రీచరణ్ పదువులు అలంకరించారే తప్ప పనులపై శ్రద్ధ చూపలేదు.
ఇచ్చింది రూ.78కోట్లే..కాలువ పనులకు 1,406 ఎకరాల భూమిని గత ప్రభుత్వంలోనే సేకరించి పెట్టారు. రైతులకు పరిహారం అందకపోయినా సాగు జలాలు వస్తే చాలని స్వచ్ఛందంగా పొలాలు ఇచ్చారు. ఆ భూముల్లో 25 శాతం మట్టి పనులు చేసి కాలువ తవ్వారు. ఆ భూములకు సంబంధించి ఇప్పటి వరకు వందలాది మంది రైతులకు ఎలాంటి పరిహారం అందలేదు.
గతేడాది సీఎం రూ.208కోట్లు మంజూరు చేస్తున్నామని చెప్పి.. రూ.135కోట్లు విడుదల చేశారు. ఇందులో రూ.80కోట్లు రైతులకు పరిహారం కాగ మరో రూ.55కోట్లు సివిల్ వర్కులకు కేటాయించారు. 1,406 ఎకరాలకుగాను 789 ఎకరాలకు రూ.78కోట్లు పరిహారం ఇచ్చారు. ఇంకా 620ఎకరాలకు పరిహారం రావాల్సి ఉంది. సివిల్ పనుల్లో కేవలం ఐదు కిలోమీటర్లు కాలువ పనులు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధి కమీషన్లకు కక్కుర్తి పడటంతో పనులు ఆగిపోయాయనే ఆరోపణలు ఉన్నాయి.
నేటికీ అందలేదు
బీటీపీ కాలువ పనులకు నా పేరు మీద సర్వే నంబర్ 331, 132లో 2.70 ఎకరాల భూమి పోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పరిహారం ఇస్తామని ముఖ్యమంత్రి, స్థానిక మంత్రి చెప్పారు. ఇప్పటికీ అతీగతీ లేదు. ఎనిమిది నెలల క్రితం పరిహారం ఇస్తామని అధికారులు పాసు పుస్తకాలు తీసుకున్నారు. కొంత మందికి మాత్రమే ఇచ్చారు. పరిహారం వస్తుందని అప్పులు చేసుకుని అవస్థ పడుతున్నా.
పాలక్షి, మందలపల్లి, కుందుర్పి మండలం
హమాలీ పని చేసి బతుకుతున్నా..
మా నాన్న మర్రిస్వామి పేరున ఉన్న 2.50ఎకరాల భూమి కాలువకు ప్రభుత్వం తీసుకుంది. భూమి పోయి ఉపాధి లేక బెంగళూరుకు వెళ్లి హమాలీ పని చేసుకుంటున్నా. భూమి ఇచ్చిన రైతులకు పరిహారం ఇస్తామని ఎనిమిది నెలల క్రితం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గంలో ప్రకటిస్తే బెంగళూరులో ఉపాధి వదిలి గ్రామానికి వచ్చాను. ఇప్పుడు ఉపాధి పోయింది, అప్పులు మీదపడ్డాయి. నేటికీ పరిహారం రాలేదు. జీవనం కష్టంగా మారింది.నాగరాజు, అపిలేపల్లి, కుందుర్పి మండలం

# ఇసుకంతైనా భయం లేదు.. దోపిడీ ఆగదు



అనంతపురం: ఆస్తిని పంచుకున్నట్లు.. ప్రకృతి వనరులైన నదులు, వాగులు, వంకలను వైకాపా నాయకులు పంచేసుకున్నారు. జగన్ అండతో నదుల్ని వాటాలేసుకుని మరీ అక్రమ రవాణా కొనసాగించారు. ఉమ్మడి అనంత జిల్లాలోని పెన్నా, చిత్రావతి, వేదవతి, జయమంగళి తదితర నదుల్ని నామరూపాల్లేకుండా చేశారు. కొత్త వ్యక్తులెవరైనా వచ్చి చూస్తే ఇక్కడ నది ఉందా? అన్న సందేహం వచ్చేంతలా ఇసుక దోపిడీ కొనసాగింది. ఐదేళ్లలో ఒక్కో నాయకుడు రూ.వందల కోట్ల విలువైన ఇసుకను బొక్కేశారు. పగలు, రాత్రి తేడా లేకుండా టిప్పర్లలో సరిహద్దులు దాటించి జేబులు నింపుకొన్నారు. అనుమతులు, నిబంధనలతో పనిలేకుండా కర్ణాటకకు తరలిస్తూ జిల్లాలో కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరకు అమ్ముకున్నారు. మూడు ప్రధాన నదులు జిల్లాలో ప్రవహిస్తున్నా స్థానికులకు ఇసుక లేకుండా చేశారు.
నాయకుల కనుసన్నల్లోనే..
రాష్ట్రంలో ఇసుక తవ్వకాలను జేబు సంస్థ జేపీ వెంచర్స్‌కు అప్పగించారు. వైకాపాకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి సబ్‌లీజు తీసుకున్నారు. అనుమతులు తీసుకున్నదాని కంటే కొన్ని వందల రేట్లు ఇసుకను నదుల నుంచి తరలించారు. అనుమతులు రావడానికి నెలరోజుల ముందు నుంచే తవ్వకాలు ప్రారంభించి దోచేశారు. ఒక్కో పర్మిట్‌పై పది టిప్పర్ల ఇసుకను తరలించారు. స్టాక్‌పాయింట్లకు తరలించకుండా రీచుల నుంచే నేరుగా పంపుతుండటంతో ఎంత తవ్వుతున్నారనేదానిపై స్పష్టత లేకుండాపోయింది. రాయదుర్గం పరిధిలో ప్రయివేటు భూముల్లోనూ ఇసుక తవ్వకాలు జరిపి అడ్డంగా దొరికిపోయారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
రూ.3 కోట్ల జరిమానా విధించినా..పెద్దపప్పూరు: అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇసుక రేవు పేరుతో వైకాపా నాయకులు పెద్దపప్పూరు లోని పెన్నానదిని కొల్లగొట్టారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన అధికారులను సైతం భయభ్రాంతులకు గురిచేసి రూ.కోట్లు విలువచేసే ఇసుకను దోచేశారు. ఏళ్లుగా సాగిన దందాతో పెన్నానది దాదాపు 4 కి.మీ. మేర రూపురేఖలు కోల్పోయింది. నాయకుల దోపిడీ కారణంగా ఏర్పడిన గుంతలు అమాయకులైన ప్రజల ప్రాణాలు బలిగొన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో సైతం నది నుంచి ఇసుకను దొంగిలించారు. పెద్దపప్పూరు పెన్నానది రేవులో సాగుతున్న దందాపైలో పలుమార్లు కథనాలు ప్రచురితం కాగా భూగర్భ గనులశాఖ ఆధ్వర్యంలో అధికారుల బృందం తనిఖీలు చేయడానికి వస్తున్నారన్న సమాచారంతో వైకాపా ప్రభుత్వ పెద్దల అండతో అక్రమాలు కప్పిపుచ్చుకొనేందుకు చాగల్లు జలాశయం నుంచి పెన్నానదిలోకి నీళ్లొదిలారు. అధికారుల బృందం తనిఖీలు చేపట్టి అక్రమాలు జరిగినట్లు గుర్తించి ఇసుక రేవు నిర్వాహకులకు రూ.3 కోట్ల జరిమానా సైతం విధించారు. అయినా ఆగకుండా నదిని కొల్లగొట్టారు. పరిశీలించేందుకు వెళ్లిన అధికారులను నాయకులు బెదిరించారు. వైకాపా నాయకుల పాపాల కారణంగా పెన్నానది పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో ప్రజలు భవిష్యత్తులో సాగు, తాగు నీటి కష్టాలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి దాపురించింది.
నిర్మాణాల పేరుతో తోడేస్తున్నారు
బొమ్మనహాళ్, కణేకల్లు: బొమ్మనహాళ్, కణేకల్లు మండలా ల్లోని వేదవతి, పెద్ద, చిన్న హగరి నదుల్లో రోజూ వందలాది ట్రాక్టర్ల ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనుల ముసుగులో ఐదేళ్లలో బొమ్మనహాళ్, కణేకల్లు, డి.హీరేహాళ్ మండలాల్లోని అధికార పార్టీ నాయకులు వేదావతి హగరిని తోడేశారు. బళ్లారి, ఉరవకొండ, గుంతకల్లు, తదితర ప్రాంతాల్లో ఇసుకకు డిమాండ్ ఉండటంతో పగలు అధికార పార్టీ నాయకులు వారి స్థావరాలకు తరలించి రాత్రివేళల్లో టిప్పర్ల ద్వారా సరిహద్దులు దాటిస్తున్నారు. గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణం ముసుగులో అనుమతులు రాయించుకుని ఒక్కొక్క ట్రిప్పు ఇసుకను కర్ణాటకలో రూ.8 నుంచి రూ.9 వేలు, గుంతకల్లులో రూ.10 వేలు, ఉరవకొండలో 8 వేలు, యర్రగుంటలో రూ.4,500 చొప్పున అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు.
వాగులు, వంకలు ఛిద్రం
శింగనమల, బుక్కరాయసముద్రం: వైకాపా నాయకుల ధన దాహానికి వాగులు, వంకలు ఛిద్రమవుతున్నాయి. గార్లదిన్నె, శింగనమల మండలాల్లో ప్రవహిస్తున్న పెన్నా నదిని ఎక్కడపడితే అక్కడ తవ్వేస్తున్నారు. తరిమెల, కల్లుమడి, కొప్పలకొండ తదితర గ్రామాల నుంచి ఇసుక తరలివెళుతోంది. రాత్రిళ్లు జేసీబీలు ఏర్పాటు చేసి ట్రాక్టర్‌ల ద్వారా తెల్లవారే వరకు ఇసుక తోడేస్తున్నారు. నిత్యం 50 ట్రాక్టర్లు జిల్లా కేంద్రం, గార్లదిన్నెకు వెళుతున్నాయి. ఒక్కో ట్రాక్టర్ రూ.4 వేలతో విక్రయించి సొమ్ము చేసుకొంటున్నారు. రోజుకు రూ.2 లక్షలు ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. బుక్కరాయసముద్రం మండలంలోని నీలంపల్లి, చెదుల్ల గ్రామాల్లో వాగులు, వంకలను తవ్వేస్తున్నారు. ఇక్కడ పట్టపగలే ఇసుక తరలిస్తున్నారు. నిత్యం 120 నుంచి 150 ట్రాక్టర్లు వెళుతున్నాయి.
హద్దేలేని అక్రమ రవాణా
తాడిపత్రి: పట్టణ పరిసరాల్లో ఉన్న పెన్నానదిలో ఇసుకను అధికార పార్టీ నాయకులు యథేచ్ఛగా అక్రమంగా రావాణా చేస్తున్నారు. అధికారుల అండదండలు తోడవడంతో బరితెగించి పట్టపగలే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. పెన్నానది తాడిపత్రి పురపాలిక, మండలంలో సుమారు 20 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. వీరాపురం, ఆలూరు, సజ్జలదిన్నె, హుస్సేనాపురం, అక్కన్నపల్లి, తాడిపత్రి పురపాలికలోని నందలపాడు, శ్రీనివాసపురం, చిన్నపొలమడ, కోమలి, ఇదుగూరు, చుక్కలూరు గ్రామాల్లో వైకాపా శ్రేణులు వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి లక్షల రూపాయలు గడిస్తున్నారు. రోజూ 30 టిప్పర్లు, 150 ట్రాక్టర్ల ఇసుకను నంద్యాల, బళ్లారి తదితర దూర ప్రాంతాలతోపాటు స్థానికంగా కూడా విక్రయిస్తున్నారు.
ఒక్క ట్రాక్టరునూ అడ్డుకోలేదు..వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్ల పాటు సహజ వనరులను కొల్లగొడుతూ వైకాపా నాయకులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. తిమ్మలాపురం హగరి నుంచి రోజుకు 100-150 ట్రిప్పుల ఇసుకను వివిధ ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకున్నారు. ఒక్కొక్క ట్రిప్పు రూ.5000 నుంచి రూ.6000 వరకు ఇసుకను ట్రాక్టర్‌ల ద్వారా వివిధ గ్రామాల విక్రయించి దందా సాగించారు.

## నమ్ముకుంటే.. మోసపోయాం

పుత్తూరు : రాత్రింబవళ్లు పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషిచేసిన గోపాలమిత్రల భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారింది.. తాను అధికారంలోకి రాగానే గోపాలమిత్రలను క్రమబద్ధీకరించి, వేతనాలు పెంచుతానని ప్రజాసంకల్ప పాదయాత్రలో నేటి సీఎం జగన్ నాడు హామీ ఇచ్చారు.. దీంతో గోపాలమిత్రలు ఎంతో సంబరపడ్డారు.. తమ జీవితాలకు వెలుగు వస్తుందని ఆశపడ్డారు.. చివరకు వారి ఆశలు అడియాశలుగానే మిగిలాయి.. పాదయాత్ర చేసి ఏడేళ్లు, పదవిలోకి వచ్చి ఐదేళ్లు పూర్తయినా ఇప్పటివరకు వారికి ఇచ్చిన హామీలు పట్టించుకున్న పాపాన పోలేదు.. ఉద్యోగ భద్రత అటుంచితే తమను ఉంచుతారో లేదో అన్న అనుమానం వారిలో కలుగుతోంది.
చంద్రబాబు పథకమనే నిర్లక్ష్యం..
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు సకాలంలో వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు



గోపాలమిత్ర పథకాన్ని తెచ్చారు. గత ఎన్నికలకు ముందు రూ.3 వేలు ఇస్తున్న వేతనాన్ని.. చంద్రబాబు రూ.6,500కు పెంచారు. ఆ సమయంలో గోపాలమిత్రల సంఘం నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకునే వీరికి నేడు సీఎం జగన్ అన్యాయం చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
ఉద్యోగ భద్రత ఏదీ..?
గత ఇరవై ఏళ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో పాడి సంతతి పెపొందించేందుకు ఎంతో కోసం కష్టపడి పనిచేస్తున్నాం. ఉద్యోగ భద్రత కల్పిస్తామని సీఎం జగన్ పాదయాత్రలో హామీ ఇచ్చారు. ఆ హామీ ఇంతవరకు నేరవేరలేదు. కనీసం వేతనాలు పెంచుతారని ఆశిస్తే అందులోనూ నిరాశే ఎదురైంది.చంద్రబాబు పుత్తూరు
ఉపాధికి గండికొట్టారు
తమకు కనీసం వేతనం కింద రూ.15 వేలు ఇవ్వాలి. తాము అధికారంలోకి వస్తే గోపాలమిత్రలను క్రమబద్ధీకరి స్తామని జగన్ హామీ ఇచ్చారు. అధికారంలోకి ఐదేళ్లు పూర్తయి మళ్లీ ఎన్నికలు వస్తున్నా ఇప్పటివరకు ఆ విషయాన్ని పట్టించుకోలేదు. తమకు 20 ఏళ్లు అనుభవం ఉన్నా.. తమను కాదని సచివాలయాల్లో డిప్లొమో చేసిన వారిని వీహెచ్‌ఏలుగా నియమించడంతో తమ ఉపాధికి గండి పడింది. దీంతో మా కుటుంబాలు వీధిన పడే పరిస్థితి ఏర్పడింది.జయరామిరెడ్డి, తిమ్మాపురం
పట్టించుకోకపోవడం దారుణం..
పాదయాత్రలో ఓట్లకోసం మాట ఇచ్చి తరవాత తమ సమస్యలు పట్టించుకోలేదు. కనీసం మా విజ్ఞప్తిని పరిశీలించలేదు. మా నాయకులను కలిసేందుకు వెళ్లినా వారు సైతం సమయం ఇవ్వకుండా దాటవేశారు. వేతనం పెంచడం మాట అటుంచితే ఉద్యోగ భద్రతపై ఆశలు ఉండటం లేదు. గోపాలమిత్రలు, పెనుమూరు మండలం

## ఏదీ 'మంచి'గా ఇవ్వ'నీ'య'రు'

కలిదిండి : తక్కువ ఖర్చుతో పేదలకు శుద్ధి చేసిన తాగునీటిని సరఫరా చేయాలన్న లక్ష్యంతో తెదేపా ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఎన్టీఆర్ సుజల స్రవంతి'కి వైకాపా ప్రభుత్వం మంగళం పాడింది. ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ఆక్వా రంగం గణనీయంగా విస్తరించడం.. భూగర్భ జలాలు కలుషితంగా మారడం వంటి కారణాలతో శుద్ధజలం తాగాలంటే అదృష్టంగా భావించాల్సిన రోజులు దాపురించాయి. ఈ నేపథ్యంలో అక్కరకు రావాల్సిన ఈ పథకాలు ప్రభుత్వ నిర్లక్ష్యంతో మూలనపడ్డాయి. పేదలకు శుద్ధజలాన్ని అందకుండా చేశాయి.
ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద 51 చోట్ల శుద్ధజలం సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అధికారిక లెక్కల ప్రకారం వాటిల్లో ఇప్పుడు 33 పని చేస్తున్నట్లు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పనిచేసేవి వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. ఉద్దేశపూర్వకంగా కొన్నిచోట్ల పథకాన్ని నిలిపివేస్తే.. మరమ్మమతులు చేయించకపోవడంతో మరికొన్ని మూలకు చేరాయి.
మరమ్మతులకు నోచుకోక..
కొయ్యలగూడెం మండలం రామానుజపురం పంచాయతీ కార్యాలయం వద్ద 2019లో రూ.2.20లక్షలతో పథకం ఏర్పాటు చేశారు. రెండేళ్ల తరవాత పరికరాలు చెడిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. వైకాపా ప్రభుత్వం వచ్చిన తరవాత ఆ పథకం నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. నేటికీ మరమ్మతులు చేయలేదు. ఆర్వో కంట్రోల్ ప్యానల్, ట్యాంకర్లు, సిలెండర్లు, తదితర సామగ్రి నిరుయోగంగా మారాయి.
ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో నాలుగేళ్లుగా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పథకం మూలకు చేరింది. ఏళ్ల తరబడి కలుషితనీటి బారిన పడిన ఈ గ్రామ ప్రజలకు అప్పట్లో ఇది వరంగా మారింది. పట్టించుకొనే వారు లేకపోవడంతో నిరుపయోగంగా మారి మళ్లీ కలుషిత నీరే దిక్కయ్యిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.
విగ్రహం ఏర్పాటుకు పథకం నిర్వీర్యం
నిడమర్రు మండలం కొవ్విడిలో శుద్ధజల పథకం వైకాపా అధికారం చేపట్టిన నాటి నుంచి నిర్వహణకు నీళ్లొదిలారు.వైఎస్ఆర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు స్థానిక వైకాపా నాయకులు మంచినీటి పథకాన్ని గతేడాది జూన్‌లో పడగొట్టేశారు. ఇది వివాదాలకు దారి తీసింది.
మూలకు చేర్చి..కైకలూరు మండలం ఆటపాకలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని వైకాపా అధికారంలోకి వచ్చాక మూలకు చేర్చింది. చిన్నపాటి మరమ్మతులు కూడా చేయలేక కొత్త యంత్రాలు నిర్వీర్యం చేసి ఆ భవనాన్ని కూల్చివేశారు. అదే చోట అంగన్‌వాడీ భవన నిర్మాణం చేపట్టారు. ఓ వైపు ఆక్వా.. ఇంకోవైపు కొల్లేరుతో శుద్ధలానికి మొహంవాచిన గ్రామస్థులకు మళ్లీ కలుషిత నీరే దిక్కవుతోంది. నిత్యం డబ్బులు వెచ్చించి దాహం తీర్చుకునే ఆర్థిక స్థోమత లేక అల్లాడుతున్నారు.
నాడు రూ.5.... నేడు రూ.30
మా ఊరిలోని సుజలాం రక్షిత నీటి ప్లాంటు ద్వారా రూ.5కే 20 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసేవారు. మంచి నీటి ప్లాంటు స్థానంలో వైఎస్ఆర్ విగ్రహం పెట్టేందుకు వైకాపా నాయకులు 2011 జూన్‌లో దీనిని పడగొట్టారు. ఆక్వా చెరువులు ఉండటంతో పంచాయతీ బోరు నీరు తాగలేం.సారికి లెనిన్ బాబు, క్రొవ్విడి
పంచాయతీ బోరు నీరే తాగుతున్నాం
ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్న లక్ష్యంతో 2018లో ఎన్టీఆర్ సుజల పథకంలో భాగంగా నీటి ప్లాంటు ఏర్పాటు చేశారు. దీని ద్వారా రూ.5లకే 20 లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు అందించారు. వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత దీని నిర్వహణ గాలికొదిలేసింది. ఫిల్టర్‌బెడ్లు కూడా లేవు. పంచాయతీ బోరు నీటిని తాగుతున్నాం.పత్సా వంశీకృష్ణ, గోపినాథపట్నం

చరకలు



# యువతకు శిక్షణ

డోన్ : పారిశ్రామిక శిక్షణ సంస్థల్లో శిక్షకుల కొరత వేధిస్తోంది. తూతూమంత్రంగా కోర్సుల నిర్వహణ సాగుతోంది. నైపుణ్యాలు లేక విద్యార్థులు ఆధునిక కాలంలో పోటీపడలేకపోతున్నారు. నంద్యాల జిల్లాలో ఐదు, కర్నూలు జిల్లాలో మూడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 2,094 మంది వివిధ ట్రేడుల్లో శిక్షణ పొందుతున్నారు. శిక్షణాధికారులు (టీవోలు), ఉప శిక్షణాధికారులు (డీటీవోలు), ఇన్‌స్ట్రక్టర్లు (ఏటీవోలు), సాంకేతిక సహాయకుల (టెక్నికల్ అసిస్టెంట్లు) కొరత ఎక్కువగా ఉంది. కొత్త కోర్సులు గానీ, కొత్త యంత్రాల ఏర్పాటు గానీ జరగ లేదు.

ఒప్పంద ఉద్యోగులే

జిల్లాలో నంద్యాల, బేతంచెర్లలో ప్రభుత్వ ఐటీఐలను 2022 ఆగస్టులో ఏర్పాటు చేశారు. నంద్యాలలో ప్రిన్సిపల్, సూపరింటెండెంట్ మాత్రమే రెగ్యులర్‌గా ఉద్యోగులు కాగా, మిగిలిన పోస్టుల్ని భర్తీ చేయలేదు. బేతంచెర్లలోని ఐటీఐలో డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్, 2 టెక్నికల్ అసిస్టెంట్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

నాన్‌టీచింగ్ సిబ్బంది కొరతే

డోన్ ఐటీఐలో నలుగురు సీనియర్ అసిస్టెంట్లకు ఒక పోస్టు ఖాళీగా ఉంది. ఫార్మాసిస్టు పోస్టు పదేళ్ల నుంచి, డ్రస్సర్ పోస్టు ఆరేళ్ల నుంచి, పార్ట్‌టైమ్ మెడికల్ ఆఫీసర్ పోస్టు 15 ఏళ్ల నుంచి ఖాళీగా ఉన్నాయి. పది ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్) పోస్టులను ఏడాది కిందట



పొరుగుసేవల పద్ధతిన నియమించారు. రాత్రి కాపలాదారుల రెండు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. అవుకు ఐటీఐలో సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది.

ఎక్కడెక్కడ ఎలా ఉందంటే

డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 10 ట్రేడుల్లో 484 మంది శిక్షణ పొందుతున్నారు. ఎనిమిదేళ్ల కిందట డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, మెకానిక్ డీజిల్ కోర్సులు చెప్పేందుకు శిక్షకులు లేరు. 13 మంది డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్లకు ఒక్కరు మాత్రమే ఉండగా, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు పదేళ్ల నుంచి ఖాళీగానే ఉన్నాయి.

కర్నూలు బాలికల ఐటీఐలో రెగ్యులర్ ప్రిన్సిపల్ లేక ఇన్‌ఛార్జితో నడిపిస్తున్నారు. ఆరుగురు డిప్యూటీ ట్రైనింగ్ అధికారులకు ఒక్కరే ఉన్నారు. ఏటీవోలు లేకపోవడం గమనార్హం. జూనియర్ అసిస్టెంట్, జూనియర్ స్టెనో, క్లాస్-4 పోస్టులు ఖాళీ.

కర్నూలు డీఎల్టీసీలో అయిదు ట్రేడులుండగా, 216 మంది శిక్షణ పొందుతున్నారు. డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ మాత్రమే శిక్షణ ఇస్తున్నారు. అసిస్టెంట్ ట్రైనింగ్ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్, స్టెనో, డ్రస్ మేకింగ్‌లకు ఒక్కరే శిక్షణ ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. ఇద్దరు సాంకేతిక సహాయకుల పోస్టుల్ని భర్తీ చేయాల్సి ఉంది.

ఆలూరు ఐటీఐకి కర్నూలు డీఎల్టీసీ ప్రిన్సిపల్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ట్రైనింగ్ ఆఫీసర్, డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ పోస్టులు భర్తీ చేయలేదు. ఇక్కడ ఏడుగురు శిక్షకులకు అయిదుగురు ఒప్పంద పద్ధతిన పని చేస్తున్నారు.

అవుకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల భవనం శిథిలావస్థకు చేరింది. సబ్‌జైలు గదుల్లోనూ, ఆరుబయట చెట్ల కింద విద్యార్థులకు బోధిస్తున్నారు. ఇక్కడ సరైన భవనం లేకపోవడం లోటే. ఏటీవోలు 18 మందికి రెగ్యులర్ ఒక్కరూ లేరు. 10 మంది ఒప్పంద పద్ధతిన పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు.

శ్రీశైలంలోని సున్నిపెంటలో 260 మందికి గానూ ప్రస్తుతం 140 మంది తర్ఫీదు పొందుతున్నారు. సిబ్బంది కొరత వేధిస్తోంది. కళాశాల కూడా దూరంగా ఉండటంతో ఇబ్బందులెదరవుతున్నాయి. డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్లు ఎనిమిది మందికి ఇద్దరు ఉన్నారు. ముగ్గురు టెక్నికల్ అసిస్టెంట్లు, డ్రస్సర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏటీవోలు 12 మందికి ఆరుగురు గుత్త పద్ధతిన ఉన్నారు.

# తాటిపూడిని వీడనున్న గ్రహణం

విజయనగరం : సుమారు ఆరేళ్ల తరువాత తాటిపూడి పర్యాటకానికి గ్రహణం వీడే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2018-19లో గోదావరి, కృష్ణా నదుల్లో జరిగిన పడవ ప్రమాదాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా బోటు షికారును ప్రభుత్వం నిషేధించింది. ఆపై కొన్నాళ్లకు కొన్ని ప్రాంతాల్లో అనుమతులు ఇచ్చినా.. ఇక్కడ నిషేధం కొనసాగింది. దీంతో తాటిపూడి పర్యాటక అభివృద్ధి కుంటుపడి, పర్యాటకులు ముఖం చాటేశారు.

త్వరలో నాణ్యతా పరీక్షలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంజూరైన రెండు ఎకో టూరిజం కేంద్రాల్లో తాటిపూడిలోని గిరి వినాయక కేంద్రం ఒకటి. అటవీశాఖ ఆధ్వర్యంలో వన సంరక్షణ సమితికి చెందిన గిరిజనుల నిర్వహణలో ఈ కేంద్రం నడిచేది. గత ఆరేళ్లుగా బోటు షికారు నిలిచిపోవడం, రహదారి సౌకర్యం లేకపోవడంతో పర్యాటకులు ఇక్కడికి రాలేకపోయారు. దీంతో రూ.కోట్లు వెచ్చించి కట్టిన కాటేజీలు నిరుపయోగంగా మారాయి. ఓ పక్క ఆదాయం లేకపోగా.. మరోపక్క నిర్వహణకు, ఉద్యోగుల జీతాలకు రూ.వేలు ఖర్చు అవుతోంది. ఆదాయ వనరులు సమకూరకుంటే, పెట్టిన రూ.కోట్ల ప్రజాధనం వృథా అవుతుందని భావించిన జిల్లా అటవీశాఖ అధికారి ఈ కేంద్రాన్ని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. పర్యాటకులను ఆకర్షించేందుకు బోటు షికారు కీలకం కావడంతో అటవీశాఖ తరఫున జలవిహారం అనుమతులు కోసం విజయవాడలో ఉన్న ఇన్‌లాండ్ వాటర్‌వేస్ సంస్థకు లేఖ రాశారు. బోట్ల పరిస్థితిని (ఫిట్‌నెస్) పరిశీలించేందుకు అధికారులు రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సుమారు రూ.3 లక్షలతో బోట్లకు మరమ్మతులు చేపడుతున్నారు. లైఫ్ జాకెట్లు, బోయే(ప్రమాదం జరగకుండా నీటిలో తేలే పరికరాలు) సిద్ధం చేస్తున్నారు. బోటు పరిమితిని బట్టి ఇన్సూరెన్సు చేయిస్తున్నారు. పది రోజుల్లో అధికారుల బృందం గిరివినాయక పర్యాటక కేంద్రాన్ని పరిశీలించనుంది.

సిద్ధం చేస్తున్నాం- డీఎఫ్‌వో, విజయనగరం ఎస్.వెంకటేష్

బోటు విహారం కోసం అనుమతులు మంజూరు చేయాలని లేఖ రాశాం. బోట్ల నాణ్యతను పరిశీలించేందుకు సంబంధిత శాఖ అధికారులు త్వరలో రానున్నారు. అందుకోసం సిద్ధం చేస్తున్నాం. అన్నీ అనుకూలిస్తే నెల రోజుల్లో షికారు అందుబాటులోకి వస్తుంది.

# దోచుకునోళ్లకు దోచుకున్నంత!



పాడేరు : మహా విశాఖ నగరపాలక సంస్థలో అనధికార వ్యక్తులు రాజ్యమేలుతున్నారు. వీరిలో అధికశాతం వైకాపా నేతల అనుచరులే. వారు చెప్పిందే వేదంగా చెలామణి అవుతోంది. దొరికిన మేరకు దోచుకుని పంచుకుంటున్నారు. నిబంధనలు, చట్టాలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇదేమిటని జీవీఎంసీ ఉన్నతాధికారులు, పాలకవర్గ సభ్యులు అభ్యంతరం చెప్పడంలేదు. జీవీఎంసీలో కొందరు అధికారులు వారి నిర్ణయాలకు మద్దతు తెలిపి అవినీతికి సహకరిస్తున్నారు.

ప్లాస్టిక్ నిషేధ బృందాల హల్‌చల్: నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగానికి అడ్డుకట్ట వేయడానికంటూ ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేశారు. మొత్తం నాలుగు బృందాల్లో పదేసి మంది చొప్పున నియమించారు. వారు దుకాణాల్లో తనిఖీలు చేసి నిషేధిత ప్లాస్టిక్ కవర్లు దొరికాయని ఇష్టానుసారంగా అపరాధ రుసుములు విధిస్తున్నారు. కొందరు వార్డు వాలంటీర్లనే ఆయా బృందాల్లో నియమించారు. ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున వేతనం ఇస్తున్నారు. వారు వసూలు చేస్తున్న అపరాధ రుసుముల్లో 10శాతం కూడా జీవీఎంసీకి చేరడంలేదని సమాచారం. రూ.లక్షల మొత్తంలో నిధులు వైకాపా నేతలు, అధికారుల జేబుల్లోకి వెళుతున్నాయి. జీవీఎంసీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉండగా, ప్రత్యేకంగా ప్లాస్టిక్ నిషేధం పేరిట బృందాలను ఏర్పాటు చేయడం తీవ్ర విమర్శలకు తావిచ్చినా ఖాతరు చేయడం లేదు.

అనధికార భవనాలను గుర్తించడానికి: నగరంలో అనధికార భవనాలను గుర్తించడానికి ప్రత్యేకంగా ఓ బృందాన్ని ఏర్పాటు చేశారు. అందులో వైకాపా నాయకులు సిఫార్సు చేసిన సిబ్బందిని నియమించారు. వారు వార్డుల్లో తిరుగుతూ అనధికార నిర్మాణాలను గుర్తించి కొందరు వైకాపా నాయకులకు సమాచారం చేరవేస్తున్నారు. సంబంధిత యజమానులను పిలిపించి బేరాలు పెడుతున్నారు. డబ్బులు ఇస్తే అక్రమమైనా సక్రమం చేస్తున్నారు. కొన్నిసార్లు అన్ని అనుమతులు ఉన్న భవనాలపై కూడా దాడులు చేసి యజమానులను బెదిరించి డబ్బులు గుంజుతున్నారు. ఆ డబ్బంతా జీవీఎంసీలో కీలకమైన వైకాపా నేతల జేబుల్లోకి వెళుతోంది. నగరంలో రాత్రి పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను సంబంధిత విభాగ అధికారులకు కాకుండా ఓ అగ్నిమాపకశాఖ అధికారికి అప్పగించారు. ఆయన వైకాపా పెద్దలకు ఇష్టులు కావడమే కారణం. కార్మికుల హాజరులో అక్రమాలు జరుగుతున్నా ఆ అధికారి తనకేమీ పట్టనట్లు ఉంటున్నారు. దీంతో కింది స్థాయి సిబ్బంది ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతున్నారు. తాజాగా ఆయనకే జీవీఎంసీ క్రీడల నిర్వహణ బాధ్యతలను అప్పగించడం గమనార్హం.

మెకానికల్ విభాగంలో విశ్రాంత అధికారి పెత్తనం: జీవీఎంసీ మెకానికల్ విభాగాన్ని ఓ ఆర్టీసీ విశ్రాంత అధికారి నియంత్రిస్తున్నారు. ఆ విభాగంలో ఆయన చెప్పిందే వేదం.

పనుల ప్రతిపాదనలు, టెండర్లను ఆయనే ఖరారు చేస్తున్నారు. నెలకు రూ.70వేల వేతనం ఇవ్వడంతోపాటు, ఒక వాహనం, అటెండర్‌ను ఆయనకు సమకూర్చారు. జీవీఎంసీలో సమర్థులైన అధికారులు, సిబ్బంది ఉన్నా సంబంధంలేని వ్యక్తులకు ప్రాధాన్యమివ్వడం వెనుక అనుమానాలు కలుగుతున్నాయి. జీవీఎంసీలో పారిశుద్ధ్య వాహనాలను పర్యవేక్షించే జీపీఎస్ వ్యవస్థను ఐదు నెలల క్రితం ఓ గుత్తేదారుకు అప్పగించారు. ఆయన నగరంలో ఉండడం లేదు. జీపీఎస్‌కు సంబంధించిన వివరాలు సరిగ్గా సమర్పించడం లేదు. దీనిపై అధికారులెవరైనా గుత్తేదారును సంప్రదిస్తే ఉన్నతాధికారులతో మాట్లాడతానంటూ సమాధానమి స్తున్నారు. అయినా ఠంఛనుగా ఆయనకు నిధులు చెల్లిస్తున్నారు.

# తప్పుకోవడానికి సిద్ధం



పాడేరు : 'సాగునీటి చెరువుల పునరుద్ధరణకు సంబంధించి టెండరులో పేర్కొన్నట్లు మేం కొంతమేర పనులు చేశాం. వాటిలో కొన్ని పనులకు బిల్లులు ఇప్పటికీ అందలేదు. సకాలంలో సొమ్ములు ఇవ్వక మిగతా పనులు చేయడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. చాలా కాలంగా బిల్లుల కోసం ఎదురుచూసి ఆఖరికి ఓ నిర్ణయానికి వచ్చాం. ఇక మీరు సొమ్ములిచ్చినా, ఇవ్వకున్నా పనులైతే చేయడానికి ఆసక్తిగా లేం.. మా టెండరు ఒప్పందాన్ని మధ్యలోనే ముగించేయండి (ప్రి క్లోజర్)' అంటూ పలువురు గుత్తేదారులు జలవనరుల శాఖ అధికారులను అభ్యర్థిస్తున్నారు.

ప్రపంచ బ్యాంకు నిధులతో నాలుగేళ్ల క్రితమే ఉమ్మడి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సమీకృత సేద్య, వ్యవసాయ పరివర్తన ప్రాజెక్టు (ఏపీఐఐఏ టీపీ) ద్వారా 64 గొలుసుకట్టు చెరువులను అభివృద్ధి చేయడానికి సంకల్పించారు. దీనివల్ల 14,123 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని అంచనా వేశారు. రూ.28.99 కోట్లతో 37 పనులకు మూడేళ్ల క్రితమే టెండర్లు పిలిచి 21 పనులను గుత్తేదారు సంస్థలకు అప్పగించారు. వారు కొంత మేర పనులు చేసినా బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చూసి వెనకడుగు వేస్తున్నారు. పునరుద్ధరణ పనులను మధ్యలోనే వదిలేసి మా సంగతి తేల్చేయండి వెళ్లిపోతామంటూ సంబంధిత అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. దీంతో రూ.కోట్ల పనులు మంజూరు దశ నుంచి ముందడుగు వేయలేకపోతున్నాయి.

చేతులెత్తేసిన గుత్తేదారులు.. ఉమ్మడి జిల్లాలో 37 ప్యాకేజీల్లో 64 చెరువులను పునరుద్ధరించాలనుకున్నారు. అందులో 10 ప్యాకేజీలకు టెండర్లు ఎవరూ వేయలేదు. మరో ఆరు పనులు ఇంకా టెండరు ఒప్పంద దశలోనే మగ్గుతున్నాయి. 21 పనులు మొదలుపెట్టి మూడున్నరేళ్లు దాటుతున్నాయి. ఒక్క పనీ పూర్తిచేయకుండానే చేతులెత్తేస్తున్నారు. తమ టెండర్లు ముగించి సెటిల్ చేయాలని కోరడంతో జలవనరుల శాఖ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఆయా పనులు వివరాలు, గుత్తేదారులు ఎంత మేర చేశారు..? వారికి ఎప్పుడెప్పుడు ఎంతమేర బిల్లులిచ్చారో తెలపాలంటూ జిల్లా అధికారులను ఆదేశించారు.ఇదీ పనుల తీరు..

రాంబిల్లి మండలం దిమిలి వద్దనున్న తామరచర్ల కాలువ ద్వారా 1045 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందాలి. దీని అభివృద్ధికి రూ.97.37 లక్షల అంచనా విలువతో 2019లోనే గుత్తేదారుకు అప్పగించారు. చేయాల్సిన కాలపరిమితిని రెండుసార్లు పొడిగించినా ఈ పని ఇంకా మొదలుకాలేదు. కాంట్రాక్టర్ తన టెండరు ఒప్పందాన్ని రద్దు చేయాలని అధికారులను కోరుతున్నారు.

ఎస్.రాయవరం మండలం వేమగిరిలో ఉమ్మడి చెరువుతో పాటు 12 అనుసంధాన చెరువులు, కాలువలను బాగుచేయడానికి రూ.7.47 కోట్లతో పనులు గుత్తేదారుకు 2020లో అప్పగించారు. 2022 నవంబర్ నాటికే పనులు పూర్తిచేయాలి. కేవలం 15 శాతం మాత్రమే చేసి వదిలేశారు.

అనకాపల్లి మండలంలో ఎరకన్నదొర చెరువును రూ.1.87 కోట్లతో అభివృద్ధి చేయడానికి కాంట్రాక్టర్‌కు పని అప్పగించారు. కేవలం అయిదు శాతం పనులే చేసి నిలిపేశారు. దీంతో ఆయకట్టుదారులకు సాగునీటి సమస్య తీరకుండా పోయింది.

చింతపల్లి మండలం తాజంగి జలాశయం అభివృద్ధికి రూ.92.21 లక్షలు కేటాయించారు. బిల్లుల చెల్లింపులపై అనుమానంతో గుత్తేదారు ఆరుశాతం పనులే చేసి నిలిపేశారు. కొయ్యూరు మండలంలో లుబ్బర్తి జలాశయం అభివృద్ధికి రూ.44.19 లక్షలు మంజూరు చేశారు. గుత్తేదారు 75 శాతం పనులు చేశారు. వాటికి సకాలంలో బిల్లులు అందకపోవడంతో మిగతా పనులు నిలిపేశారు. ఈ పనుల నుంచి గుత్తేదారులు తప్పుకోవడానికి సిద్ధమంటున్నారు.

# హక్కు.. కేంద్రంలో చిక్కు

కర్నూలు : ప్రజాస్వామ్యంలో 'ఓటు' వజ్రాయుధం.. అర్హులంతా 'హక్కు' వినియోగించుకొనేలా చూడటం.. ఓటర్లు ఇబ్బంది పడకుండా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి.. ఈ ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఇందుకు విరుద్ధంగా ఉంది. ప్రతి కేంద్రంలో ఏదో ఓ సమస్య నెలకొంది. నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు (ఏఈఆర్వోలు), బీఎల్వోలు పూర్తి స్థాయిలో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో 3,807 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వృద్ధులు, దివ్యాంగులు ఓటేసేందుకు వీలుగా ర్యాంపులు, విద్యుత్తు సౌకర్యం, నీటి సరఫరాతో కూడిన మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, ఓటు వేసి బయటకు వచ్చేందుకు పోలింగ్ కేంద్రాల్లో దారులు సక్రమంగా ఉండాలి.శాశ్వత టాయ్‌లెట్లు ఏర్పాటు చేయలేని పక్షంలో అవసరమైన పోలింగ్ స్టేషన్ల దగ్గర బయో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలి. ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా విత్ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేయాలి. అందుకు అవసరమైన ప్లగ్ పాయింట్ ఏర్పాటు చేయాలి.

# అందని నీరు.. ఆగని కన్నీరు

ఆళ్లగడ్డ : పడకండ్ల పరిధిలోని సర్వే నం.9లో పూడిక తీత పనులు జరుగుతుండగా రైతులు అడ్డుకున్నారు. పరిహారం మంజూరైనా అందకపోవడంతో పనులకు ససేమిరా అంటున్నారు. అధికారులు నచ్చచెప్పి పనుల్ని చేయించినా చాలామందికి ఇప్పటికీ పరిహారం అందకపోవడంతో కాల్వల నిర్మాణానికి అంగీకరించడం లేదు. మేజరు, మైనర్ కాల్వల నిర్మాణం 100 శాతం పూర్తి కావడం లేదు.

ఏళ్లుగా తెలుగు గంగ కాల్వల పనులు ఒక అడుగు ముందుకు ఆరగడుగులు వెనక్కి అన్నట్లు జరుగుతున్నాయి. దీని పరిధిలోని పంట కాల్వల నిర్మాణం పూర్తి కాకపోవడంతో రైతులు నీటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. 2023లో తెలుగు గంగ ప్రధాన కాల్వ, మేజరు, మైనర్ కాల్వల పనులకు ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో రూ.18 కోట్లు ఖర్చు పెట్టారు. క్షేత్రస్థాయిలో మాత్రం కాల్వలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది జూన్, జులైలో మేజరు, మైనరు కాల్వల్లో పూడికతీత పనులు జరిగిన నెలల వ్యవధిలోనే ముళ్లచెట్లతో ఇవి నిండిపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకాలేర్పడ్డాయి. మేజరు, మైనర్ కాల్వల పూడికతీత పనులు ప్రొక్లెయిన్లతో చేశారు. కల్వర్టుల వద్ద నీటి ప్రవాహానికి ఆటంకాలు ఉన్నా సరిచేయకపోవడంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు.

ఎప్పటికి పూర్తవుతాయో...?

2005లో తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి సాగు నీటిని పంట పొలాలకు తరలించాలని బ్లాక్ ఛానెళ్లు, మేజరు కెనాల్స్, మైనర్, సబ్ మైనరు, ఫీల్డు ఛానెళ్ల నిర్మాణ పనుల్ని చేపట్టారు. 2009 నుంచి



ఈ పనులు ఆగిపోగా...వాటి పూర్తికి అడుగులు సక్రమంగా పడటంలేదు. గతేడాది గుత్తేదారుతో ఏర్పడిన సమస్యల్ని పరిష్కరించినప్పటికీ మేజర్, మైనర్ కాలువల నిర్మాణం జరగకపోవడం, కనీసం పంట కాల్వల తవ్వకాలైనా పూర్తి చేద్దామంటే రైతులకు పరిహారం సక్రమంగా ఇవ్వకపోవడంతో అడ్డంకులు ఏర్పడ్డాయి. పరిహారం అందలేదని పొలాల్లో కాలువల తవ్వకాల పనులకు భూ నిర్వాసితులు అడ్డుపడుతున్నారు. ఇలా పనులు ఎక్కడిక్కడ పడకేశాయి. కొన్నిచోట్ల పరిహారం రాలేదని తవ్విన కాల్వలను రైతులు పూడ్చేశారు. ఇలా అన్ని ఆటంకాల వల్ల తెలుగుగంగ నీటిని రైతులు వినియోగించుకోలేకపోతున్నారు.

కల్వర్టుల అనుసంధాన, పరిహార సమస్య-మోహన్‌రెడ్డి, ఏఈ, తెలుగు గంగ 21, 24 బ్లాక్‌ల్లో అహోబిలం రహదారిని దాటే క్రమంలో మేజరు కాల్వలు కల్వర్టులతో అనుసంధానం చేయకపోవడం సమస్యకు ముఖ్య కారణం. రహదారులశాఖతో సమావేశమై సమస్యను పరిష్కరించుకోవాల్సి ఉంటుంది. నీరు పారకపోవడంతో కొందరు కాల్వలను పూడ్చేశారు. మేజరు కాల్వలు పూర్తయితే పూడ్చిన వాటిని తవ్వించి నీటిని పారిస్తాం. వచ్చే ఏడాది పంట కాల్వల నిర్మాణం ప్రారంభించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల పరిహారం అందకపోవడం వల్ల కూడా కాల్వల నిర్మాణం జరగడం లేదు.

ఆళ్లగడ్డ సబ్ డివిజన్‌లో తెలుగు గంగ వివరాలు

బ్లాక్‌లు : 21 నుంచి 37

ప్రధాన కాల్వ : 58కి.మీ నుంచి 96 కి.మీ వరకు

ప్రస్తుతం జరిగిన పనులు : 21 నుంచి 24 బ్లాక్ వరకు, 28 నుంచి 37 బ్లాక్ వరకుఅటవీ అనుమతుల : 25 నుంచి 27 బ్లాక్ వరకు

కారణం ఆగిన పనులు వచ్చిన నిధులు : రూ.18 కోట్లు

ఆయకట్టు : 78 వేల ఎకరాలు

# మంజూరై నాలుగేళ్లు.. పూర్తికి ఇంకెన్నేళ్లో?

విజయనగరం : విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని సాగునీటి ప్రాజెక్టుల్లో నాగావళి నదిపై ఉన్న నారాయణపురం ఆనకట్ట ఒకటి. రెండు జిల్లాల్లోని లక్షల మంది రైతులు ఈ ప్రాజెక్టుపై ఆధారపడుతున్నారు. ఆధునికీకరణ చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం చూపడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆయకట్ట రైతులకు ఏటా సాగునీటికి కష్టాలు తప్పడం లేదు.

నారాయణపురం ఆనకట్టను 1960లో నిర్మించారు. ఇది పూర్తిగా పాడైంది. దీన్ని పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు తెదేపా ప్రభుత్వం (జైకా) నిధులతో 2019లో ముందుకు వచ్చి రూ.112.10 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కుడి, ఎడమ కాలువలు, ఆనకట్టపై ఉన్న షట్టర్ల వ్యవస్థ, కుడి, ఎడమ వైపు ఉన్న ప్రధాన నియంత్రికలు, ఆనకట్టకు సపోర్టుగా ఉన్న కాంక్రీటు యాప్రన్, రాతికట్ట నిర్మాణాలు పునరుద్ధరించడం తదితర పనులు 18 నెలల్లో చేపట్టాల్సి ఉంది. 2019 ఎన్నికల్లో తెదేపా అధికారం కోల్పోవడంతో వైకాపా ప్రభుత్వం రెండేళ్ల పాటు పనులు ఊసే మరిచింది. రెండేళ్ల తర్వాత పనులు చేపట్టింది. నాలుగేళ్లలో 35 శాతం మాత్రమే పూర్తయ్యాయంటే ఏవిధంగా జరుగుతున్నాయో తెలుస్తుంది. దీంతో ఏటా ఖరీఫ్‌లో సాగునీటి కష్టాలు తప్పడం లేదు.

ఏడు నెలల్లో పూర్తయ్యేనా?

ఆధునికీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేసేందుకు ప్రభుత్వం గుత్తేదారులకు అనుమతులు మంజూరు చేసింది. ఫేజ్-1లో ఆనకట్ట, ఎడమ కాలువ ఆధునికీకరణకు రూ.62.46 కోట్లు మంజూరు చేశారు. ఇంత వరకూ 35 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. 65 శాతం పనులు చేపట్టాల్సి ఉంది. ఫేజ్-2లో నారాయణపురం కుడి ప్రధాన కాలువ ఆధునికీకరణకు, లైనింగ్ పనులకు రూ.49.64 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు కూడా 35 శాతం మాత్రమే అయ్యాయి. ఏడు నెలల గడువులో ఎంత మేరకు పనులు చేపడతారో వేచి చూడాలి.

ఏడు మండలాలకు సాగునీరు

ఆనకట్ట ద్వారా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల, బూర్జ, ఆమదాలవలస, శ్రీకాకుళం, గార మండలాల్లో అధికారికంగా 37,053 ఎకరాలకు, అనధికారికంగా మరో 20 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. సకాలంలో పనులు చేపట్టకపోవడంతో శివారుకు సాగునీరు అందడం లేదు. సకాలంలో ఆధునికీకరణ పనులు పూర్తిచేసి సాగునీటి కష్టాలు లేకుండా చూడాలని ఆయకట్ట రైతులు రెండు జిల్లాల కలెక్టర్లను, అధికారులను, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.సంక్రాంతి తర్వాత చేపడతాం: ఆనకట్ట ఆధునికీకరణ పనులకు ఈ ఏడాది ఆగస్టులోపు పూర్తి చేయాలని ప్రభు త్వం ఆనుమతులు మంజూరు చేసింది. ఇప్పటికే గుత్తేదారుకు సమాచారం ఇచ్చాం. సంక్రాంతి తర్వాత ఆనకట్ట, కుడి, ఎడమ కాలువల పనులు చేపడతాం. త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఇదే విషయాన్ని ఇప్పటికే గుత్తేదారుకు చెప్పాం.కె.మురళీకృష్ణ, డీఈఈ

## రహదారి గుంతల్లో.. తట్టెడు మట్టేయలేక పాట్లు

చిత్తూరు : చంద్రగిరి నియోజకవర్గంలోని పలు కీలక రహదారులు గుంతలు తేలి ప్రయాణికులు నరకం చూస్తున్నారు. నిధులు కేటాయించినా బిల్లుల చెల్లింపుపై భరోసా లేకపోవడం.. మరో వైపు ఎన్నికలు ముంచుకొస్తుండటంతో రహదారిపై కాస్త మట్టి వేసేవారు కరవయ్యారు. పాకాల మండలంలో కీలకమైన దామలచెరువు-నేంద్రగుంట రహదారి మరమ్మతులు ప్రహసనంగా మారాయి. దామలచెరువు నుంచి గుమ్మడివారిఇండ్లు వరకు విస్తరణ పనులు జరగ్గా మిగతా భాగాన్ని వదిలిపెట్టడంతో కష్టాలు కొనసాగుతున్నాయి. భాకరాపేట నుంచి యల్లమంద మీదుగా పీలేరుకు వెళ్లే రోడ్డు, చంద్రగిరి



నుంచి రైల్వే ఫీడర్ వరకు వెళ్లే రోడ్ల పరిస్థితి సైతం ఇలాగే ఉంది. దామలచెరువు నుంచి పులిచెర్లకు వెళ్లే మార్గంలో మొగరాల వద్ద భారీ గుంతలు పడ్డాయి. గుంతల్లో నీరు లేకుండా తాత్కాలికంగా గాడులు తీసి వదిలిపెట్టారు. రంగంపేట - పదిపుట్లబైలు మార్గంలో వరదప్పనాయుడుపేట నుంచి పదిపుట్లబైలు (కొమ్మిరెడ్డిగారిపల్లి క్రాస్) వరకు తారు వేసినా పలుచోట్ల గుంతలు పెద్దవి అవుతున్నాయి.

సగం.. సగం పనులతో..పుంగనూరు, పూతలపట్టు, చంద్రగిరి నియోజకవరాల్లో ఆరు మండలాల ప్రజలు తిరుపతికి వెళ్లేందుకు అనువైన దామలచెరువు-నేంద్రగుంట మార్గంలో నిత్యం బస్సులతోపాటు వందలాది ఆటోలు, లారీలు, ఇతర వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఇటీవల దామలచెరువు నుంచి గుమ్మడివారి ఇండ్లు గ్రామం వరకు డబుల్ రోడ్డును విస్తరించారు. అక్కడి నుంచి పాకాల మీదుగా నేంద్రగుంట వరకు మరమ్మతులు చేపడుతున్నట్లు అధికారులు ప్రకటించారు. గతనెలలో ఊట్లవారిపల్లి రైల్వే వంతెన నుంచి కమతంపల్లి పరిసరాల్లో కొంతమేర తారు వేసి ఆపేశారు. ఊట్లవారిపల్లి, పాకాల రైల్వే గేటు, ఉప్పువంక పరిసరాల్లో పెద్దపెద్ద గుంతలు తేలడంతో దారుణంగా మారింది. నిధుల కేటాయింపు ఇలా..

చంద్రగిరి నుంచి రైల్వే ఫీడర్ వరకు 3.5 కి.మీ. రోడ్డు మరమ్మతులకు నాబార్డు నుంచి రూ.1.10 కోట్లు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. దామలచెరువు-నేంద్రగుంట రహదారిపై గుమ్మడివారిఇండ్లు నుంచి నేంద్రగుంట వరకు రహదారి మరమ్మతులకు రూ.1.70 కోట్లు మంజూరై టెండరు ప్రక్రియ పూర్తయ్యాక పురోగతి కరవైంది. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట నుంచి యల్లమంద మీదుగా పీలేరుకు వెళ్లే 21 కి.మీ. రహదారికి రూ.5 కోట్ల కేటాయింపులతో సరిపెట్టారు.

మరమ్మతులు చేయిస్తాం

దామలచెరువు-నేంద్రగుంట రహదారితో పాటు మిగతా ప్రాంతాల్లోనూ రహదారుల పనులు చేసేలా గుత్తేదారులతో మాట్లాడుతున్నాం. ప్రజాప్రతినిధుల సహకారంతో పునఃప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. మాధవన్, ఏఈ, ర.భ. శాఖ

## మట్టి కొండలు మాయం

కాకినాడ : వైకాపా నాయకుల కన్నుపడితే చాలు మట్టి కొండలయినా కరిగిపోవాల్సిందే. చీకటి పడగానే పని మొదలుపె డతారు. పొక్లెయిన్లలో తవ్వి, వందలాది లారీల్లో తరలించేస్తారు. ఎవరైనా ప్రశ్నిస్తే బుజ్జగిస్తారు లేదా బెదిరిస్తారు. అధికారులు సైతం పట్టించుకోరు. దీనికి ప్రత్యక్ష తార్కాణం తాళ్లపూడి మండలం తాడిపూడి సమీపంలోని చింతలపూడి పథకం కాలువ మట్టే. ఈ జలాలను తరలించేందుకు తాళ్లపూడి, గోపాలపురం మండలాల సరిహద్దుల్లో కాలువలు తవ్వారు. వచ్చిన మట్టిని చింతలపూడి, తాడిపూడి పథకాలకు సంబంధించిన కాలువల మధ్యలో వేశారు. అది కాస్తా కరిగిపోతోంది. తాళ్లపూడి మండలంలోని తుపాకులగూడెం, సూరయ్యపేట, అన్నదేవరపేట, గోపాలపురం మండలంలోని గోపవరం, భీమోలు, గుడ్డిగూడెం సమీపంలో తవ్విన మట్టిగుట్టలు కొండల్లా ఉన్నాయి. తుపాకులగూడెం, భీమోలు మధ్య కాలువ జనసంచారాలకు దూరంగా ఉంటుంది. రెండు మండలాల సరిహద్దు కావడంతో ఇరువైపులా కిందిస్థాయి సిబ్బంది అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత చందనా సంపాదించుకుంటున్నారు. ఈ సరిహద్దుల సమీపంలో నాలుగైదు చోట్ల అక్రమార్కులు రాత్రిళ్లు తవ్వేస్తున్నారు. పెద్ద ఎత్తున తవ్వడంతో గుంతలు ఏర్పడుతున్నాయి.

నిబంధనలు నిల్..లారీ మట్టి రూ.4వేల నుంచి రూ.8 వేల వరకు విక్రయిస్తున్నారు. గ్రావెల్, సారవంతమైన మట్టిని బట్టి ధర పెంచుతున్నారు. అనుమతులున్న చోట నుంచి తీసుకొస్తే దూరం బట్టి ధర రూ.7వేల నుంచి రూ.10వేలు ఉంటుంది. దీనికి రవాణా ఖర్చులు అదనం. తాళ్లపూడి, గోపాలపురం తదితర పరిసరాల్లోని పచ్చని పంట భూములను మెరక చేసి లేఔట్లు వేస్తున్నారు. అందుకోసం వందలాది లారీల్లో మట్టి తరలిస్తున్నారు. ఎలాంటి వాహన, బిల్లుల తనిఖీలు జరగట్లేదనే విమర్శలు ఉన్నాయి. అనధికార లేఔట్లు వేసి, రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించి కాలువలు తవ్వడంతో వచ్చిన మట్టి నీటిపారుదల శాఖకు చెందినది. ఆ శాఖలో సిబ్బంది కొరత ఉంది. ఆయా శాఖల సమన్వయం లేకపోవడంతో అక్రమ దందా యథేచ్ఛగా



సాగిపోతుంది. ఒకవేళ అధికారులు దృష్టి సారించిన రాజకీయ ఒత్తిళ్లతో వెనుకడుగు వేస్తున్నారు. ఫిర్యాదు చేశాం..గతంలో అక్రమ తవ్వకాలపై నాలుగు, అయిదుసార్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని చింతలపూడి ఎత్తిపోతల పథకం డీఈ రాజేశ్వరరావు చెబుతున్నారు. మళ్లీ దందా సాగిస్తే నిఘా పెడతామని అంటున్నారు. మట్టి అక్రమ రవాణా చేసేవారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వైకాపా నాయకులపై అదే పార్టీ శ్రేణుల ఫిర్యాదుసారవంతమైన మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. మైనింగ్ అధికారుల అనుమతి లేకుండా పచ్చని చేలను మెరక చేసి లేఔట్లుగా మారుస్తున్నారు. రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. అధికారులు కూడా చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. ఇదంతా చేస్తోంది అచ్చంగా అధికార పార్టీ నాయకులే. అదే పార్టీకి చెందిన మరో వర్గంతో విభేదాలు రావడంతో బహిరంగ రహస్యం రచ్చకెక్కింది. దీనిపై స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు.

# నాణ్యతకు బీటలు!



అనంతపురం : ఇళ్లు ఎంత పదిలంగా ఉంటే అన్ని ఏళ్లు గుర్తుండి పోతుందన్నది నమ్మకం. అనంతపురం జిల్లాలో పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలు నాసిరకంగా సాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు నిర్మాణం చేసుకోవడానికి స్థానికంగా ఉన్న గుత్తేదారులకు ఇస్తుండగా లేఅవుట్లలో రాప్తాడు ఎమ్మెల్యే బంధువుకు చెందిన సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి ఏమాత్రం చాలడం లేదు. రాయదుర్గంలో హేమ జ్యోతికి పేదలందరికీ ఇళ్లు కింద మంజూరు అయింది. అదనంగా రూ.1.30 లక్షలు అంటే మొత్తంగా 3.10 లక్షలు ఇచ్చినా నాసిరకంగా నిర్మాణం చేయడంతో ప్రారంభం కాక ముందే ఇంటి ముందు భాగం పై కప్పు కుప్పకూలింది. గృహనిర్మాణసంస్థ ఆధ్వర్యంలో చేపట్టే నిర్మాణాలు ప్రతి దశలోనూ పరిశీలించిన అనంతరమే బిల్లులు మంజూరు అవుతాయి. సక్రమంగా పర్యవేక్షించక పోవడంతో నిర్మాణ దశలోనే పగుళ్లు ఇవ్వడం, పునాది దశ పటిష్టంగా లేక దెబ్బతింటున్నాయి.

పునాది భద్రమేనా?

బుక్కరాయసముద్రం పశులూరు గ్రామ పంచాయతీ లే అవుట్‌లో రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి సంబంధించిన సంస్థ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని పేదలకు ఇళ్లు నిర్మాణం మూడేళ్ల క్రితం ప్రారంభించారు. పునాదులు మాత్రమే వేసి వదిలేశారు. మూడు లేఅవుట్లలో పునాదులకే పరిమితం అయింది. ఒక లే అవుట్‌లో మాత్రం తీరు మట్టం అయింది. పునాదులు నాసిరకంగా చేపట్టడంతో పెళ్లలు ఒరిగి పోతున్నాయి. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పునాదులు వంకర టింకరగా ఉన్నాయి. ఎత్తు, పల్లాలతో నిర్మాణం చేశారు. వర్షం వస్తే పునాదుల్లోకి నీరు చేరి కుంగి పోయే ప్రమాదం ఉంది. జిల్లా కేంద్రానికి 10కి.మీ. దూరం ఉండటంతో ప్రజలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. గుత్తేదారు పునాదులకు వచ్చిన సొమ్మును తీసుకొని నిర్మాణం చేయకుండా పూర్తిగా ఆపేశారు. ఆరునెల్లుగా ఎలాంటి పనులు చేపట్టక పోవడంతో ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం అయ్యే ఆస్కారం ఉంది.

నాసిరకంగా పనులు

మూడేళ్ల క్రితం కళ్యాణదుర్గం పురపాలక పరిధిలో గూబనపల్లి లే అవుట్‌లో 382 ప్లాట్లకు 342 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో 181 లబ్ధిదారులు నిర్మించుకున్నారు. 161 ఇళ్లు గుత్తేదారులకు ప్రభుత్వం అప్పగించింది. ఇంటి లోపల సిమెంటు ప్లాస్టింగ్, విద్యుత్తు సౌకర్యం, రంగులు లేవు. ఇంటి బయట మాత్రమే రంగు వేశారు. నిర్మాణాలు సక్రమంగా చేయక పోవడంతో తలుపుల ఫ్రేమ్‌లు, పై భాగాల్లో బీటలు వచ్చాయి. నిర్మాణ సమయంలో నీరు సక్రమంగా వేయకపోవడం, నాసిరకంగా పనులు చేయడంతోనే బీటలు వచ్చినట్లు చెబుతున్నారు. పటిష్టం ఏదీ? అనంతపురం నియోజకవర్గంలో 18,899 ఇళ్లు మంజూరు అయ్యాయి. ఇందులో 4,541 ఇళ్లు ప్రారంభమే కాలేదు. నాలుగున్నరేళ్లలో 2,656 మాత్రమే పూర్తి అయ్యాయి. ఇంకా 11,702 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. నగరంలోని ప్రజలకు రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని ఆలమూరు లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. మొత్తం 5,370 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మొత్తం 3450 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటిదాకా 300 వరకు తుది దశకు చేరుకున్నాయి. మరో 1450 ఇళ్లు స్లాబు దశకు చేరుకున్నాయి. ఇంకా 1650 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. కొన్ని పునాది దశలో ఉండగా బీములు వేసిన అనంతరం పెట్టిన సిమెంటు పెల్లలు పక్కకు పడిపోతున్నాయి. కొన్ని ఇళ్లు నిర్మాణ దశలోనే పగుళ్లు ఇస్తున్నాయి. స్లాబు పటిష్టంగా వేయక పోవడంతో నాణ్యత కొరవడింది. ఎగుడు దిగుడుగా సిమెంటు పెళ్లలుతో గోడలు కట్టారు. పెళ్లలు నాణ్యత లేకపోవడంతో నిర్మాణ దశలోనే పగిలిపోతున్నాయి. ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలతోపాటు డ్వాక్రా మహిళలతో అదనంగా రూ.35 వేలు కట్టించుకున్నా ఆశించిన స్థాయిలో నిర్మాణాలు సాగడం లేదు.

## వందల్లో రోగులు.. ఒక్కరే వైద్యుడు



అనంతపురం : గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో తగినంత మంది వైద్యులు లేక రోగులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. రోజూ ఒక వైద్యుడు మాత్రమే ఉంటున్నారు. గుత్తి, పామిడి, పెద్దవడుగూరు తోపాటు సరిహద్దులో ఉన్న కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ప్యాపిలి, తుగ్గలి మండలాల రోగులకు ఈ ఆసుపత్రే దిక్కు. నిత్యం ఇక్కడికి సుమారు 600 మంది రోగులు వస్తుంటారు. ఆంగ్లేయుల కాలంలో ఏర్పాటైన ఈ ఆసుపత్రిలో నాడు-నేడు కింద ప్రభుత్వం రూ.2.90 కోట్లతో వైద్యుల బ్లాక్, మహిళా వార్డు నిర్మించింది. ఇక్కడ 52 పడకలు ఉన్నాయి. పడకల స్థాయి పెద్దదే అయినా రోగులకు కనీస సౌకర్యాలు, వసతులు లేవు. ముఖ్యంగా వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

ఇదీ పరిస్థితి: ఆసుపత్రిలో 10 మంది వైద్యులకుగాను ఆరుగురు మాత్రమే ఉన్నారు. వారిలో అందుబాటులో ఉండేది ఒక్క వైద్యుడే. ఇద్దరు గైనకాలజిస్టులు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దాంతో మహిళా రోగులు ఇబ్బంది పడుతున్నారు. కాన్పులు కూడా జరగడం లేదు. చాలా మంది గుంతకల్లు, అనంతపురం ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఆప్తమాలజిస్టు అప్పుడప్పుడు వచ్చి వెళుతున్నారు. చెవి, ముక్కు గొంతు వ్యాధి నిపుణురాలు మరో ఆసుపత్రికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. వారంలో ఒకరోజు వైద్యాధికారి ఉంటారు. ఆయన సదరం క్యాంపులతోపాటు ఇతర విధులకు తాడిపత్రి, శింగనమల ఆసుపత్రులకు వెళుతుంటారు. వైద్యులు విధులకు రాకుండా ఉండటంతో ప్రభుత్వం దృష్టిలో ఖాళీలు ఉండటం లేదు.

ఇబ్బందులు వాస్తవమే

గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి కేటాయించిన వైద్యులు సెలవుపై వెళ్లారు. పోస్టులు ఖాళీగా ఉండటం లేదు. అందుకే ప్రభుత్వం కూడా వైద్యులను నియమించడం లేదు. పోస్టులు ఖాళీగా ఉంటే నియామకం చేస్తారు. వైద్యుల కొరతతో ఇబ్బందులు ఉన్నమాట వాస్తవమే. డాక్టర్ వెంకటరమణ, వైద్యాధికారి, సీహెచ్, గుత్తి

## రుషికొండపై జగన్నాటకం..!

విశాఖపట్నం: ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆధ్వర్యంలో రుషికొండ మీద నిర్మించిన రాజసౌధాన్ని ఎన్నికల ముందు ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. పర్యాటకశాఖ ఇంతకుమునుపెన్నడూ ఖర్చు చేయని విధంగా ఈ ఒక్క చోటే దాదాపు రూ.450 కోట్లు ఖర్చు చేసి అత్యంత విలాసవంతంగా ఈ ప్యాలెస్‌ను నిర్మించారు. రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ రిసార్టు పేరుతో తీర ప్రాంత నియంత్రణ జోన్ (సీఆర్‌జడ్) అనుమతుల తీసుకున్న ఏపీటీడీసీ పర్యాటకశాఖ మంత్రి రోజా చేతుల మీదుగా ప్రారంభించనుంది. ఆది నుంచి అత్యంత వివాదాస్పదమైన ఈ ప్రాజెక్టును ఏవిధంగా కొనసాగిస్తారనేది ఆసక్తిగా మారింది. ముఖ్యమంత్రి అవసరాలకు వీలుగా నిర్మించిన భవనాలను అందుకోసమే ఉంచుతారా? మరే ఇతర అవసరాలకైనా వినియోగిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. సీఎం తాత్కాలిక వసతికి అనువుగా ఉంటుందని గతంలో గుర్తించడం గమనార్హం.

త్వరలో ఎన్నికలు జరగనున్న తరుణంలో 'రిసార్టు' కోసమే ఈ నిర్మాణాలనే భావన కలిగేలా ఆకస్మికంగా ప్రారంభిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తరువాత అధికార పార్టీలో కీలక నేతలకు లీజుకు అప్పగిస్తారన్న ప్రచారం సాగుతోంది. మొదట ఈ ప్రాజెక్టుకు సంబంధించి 'సమీకృత పర్యాటక సముదాయం' పేరుతో 2021 జనవరిలో ఏపీటీడీసీ ఆసక్తి ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి ప్రతిపాదనలు(ఆర్‌ఎఫ్‌పీ)ఆహ్వానించింది. 65 ఎకరాల్లో విదేశీ, స్వదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా నిర్మించేలా రెండు దశల్లో రూ.230 కోట్లతో పనులు చేపట్టాలని పేర్కొంది. విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా ఏడు నక్షత్రాల హొటల్ నిర్మిస్తున్నట్లు అప్పటి పర్యాటకశాఖ మంత్రి ఊదరకొట్టారు. ఆ తర్వాత 2021 జులైలో రిసార్టు పునరుద్ధరణ (రీడెవలప్‌మెంట్ ఆఫ్ రిసార్టు ఎట్ రుషికొండ) ప్రాజెక్టుగా మార్చి పనులు మొదలెట్టారు.



అనుమతులు ఒకలా.. పనులు మరోలా: పునరుద్ధరణ పనులకు ఏపీటీడీసీ కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి 9.88 ఎకరాలకు తీర ప్రాంత జోన్ (సీఆర్‌జడ్) అనుమతి తీసుకుంది. జీవీఎంసీ నుంచి మాత్రం భవన నిర్మాణాల (బిల్డింగ్) ప్లాన్ కోసం 65 ఎకరాలకు అనుమతి కోరడం అప్పట్లో వివాదాస్పదమైంది. అనంతరం జీవీఎంసీకి సమర్పించిన ప్లాన్‌లోని భవనాలకు సంబంధించిన ఆకృతులు పర్యాటక వసతులకు వీలుగా లేవు. దాదాపు అన్ని నిర్మాణాల ఆకృతులు కార్యాలయాలను పోలి కనిపించాయి. ఇది అప్పట్లో చర్చనీయాంశమైంది. చివరిగా వేంగి, గజపతి, కళింగ, విజయనగరం బ్లాక్స్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. మొదటి నుంచి: రుషికొండను అక్రమంగా తవ్వేసిన తీరును మొదటి నుంచి పర్యావరణవేత్తలు తప్పుపట్టారు. చివరికి హైకోర్టు, జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ)లో కేసులు దాఖలయ్యాయి. హైకోర్టు ఆదేశాల మేరకు అయిదుగురు సభ్యుల నిపుణుల కమిటీ రుషికొండ మీద సర్వే చేపట్టి పలు ఉల్లంఘనలు వాస్తవమేనని అప్పట్లో తేల్చింది. ఆ తర్వాత హైకోర్టు కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వశాఖ (ఎంవోఈఎఫ్)ను పరిశీలనకు ఆదేశించింది. ఎంవోఈఎఫ్ సైతం నిపుణుల కమిటీతో పరిశీలించింది. దీనికి సంబంధించి తుది తీర్పు త్వరలో రానుంది.

## క్రమబద్ధీకరణ పేరుతో వసూళ్లు?!

అనకాపల్లి : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో దందాల పర్వం సాగుతోంది. 2014 సంవత్సరానికి ముందు చేరిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వం విడుదల చేసిన జీవోలను ఆసరాగా చేసుకొని అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగుల నుంచి సొమ్ములు వసూళ్లు చేస్తున్నారు. 'ఇప్పుడు కాకుంటే.. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుంది. ఈ ప్రక్రియ అంతా నిలిచిపోతుంది, తర్వాత వచ్చే ప్రభుత్వం మిమ్మల్ని రెగ్యులర్ చేయవచ్చు, చేయకపోవచ్చు. రెగ్యులర్ ఉద్యోగాలు ఎందుకు పోగొట్టుకుంటారు' అని వారిని సున్నితంగా హెచ్చరించినట్లు తెలిసింది. కార్యాలయంలో ఓ అధికారి రూ.30వేల చొప్పున వసూలు చేయగా, అదే కార్యాలయంలో మహిళా అధికారి ఒకరు ఒక్కొక్కరి నుంచి రూ.10వేల చొప్పున వసూలు చేసినట్లు చెబుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మొత్తం 329 మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ ఉద్యోగులుగా అర్హత పొందారు. వీరిలో ల్యాబ్ టెక్నీషియన్ 18, ఫార్మసిస్టు 14, ఎం.పి.హెచ్.ఎ 278, పి.ఎం.ఒ.ఒ. 1, ఎ.ఎన్.ఎం 18 మంది ఉన్నారు. వీరిని రెగ్యులర్




చేయించే ప్రక్రియంతా విశాఖపట్నం డి.ఎం.హెచ్.ఒ కార్యాలయం నుంచే జరుగుతుంది. ఇక్కడి విషయాలను డి.ఎం.హెచ్.ఒ డాక్టర్ పి.జగదీశ్వరరావు వద్ద ప్రస్తావించగా తాము ఎవరి నుంచీ వసూళు చేయలేదన్నారు. తన పేరు చెప్పి ఎవరైనా చేసి వుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పలు ఉద్యోగాలు భర్తీ చేయడం జరిగిందని, ఎక్కడా తనకు అవినీతి మరక అంటలేదన్నారు.

## పొలాలన్నీ బీళ్లు.. ప్రచారానికే నీళ్లు

చిత్తూరు: 'అనంతపురం జిల్లా రైతుల పంటలు ఎండితే నాకేంటి? చెరువులు నింపకున్నా వచ్చే ఇబ్బందేమీ లేదు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఎదురైనా ఫర్వాలేదు. నా రాజకీయ ప్రయోజనాలే ముఖ్యం' అన్నట్లుగా ఉంది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహారశైలి. తెదేపా అధినేత చంద్రబాబు సొంత నియోజకవర్గం చిత్తూరు జిల్లా కుప్పానికి కృష్ణా జలాలు తెచ్చానని చెప్పుకొనేందుకు ముఖ్యమంత్రి చిత్రవిచిత్ర విన్యాసాలకు దిగారు. పూర్తిస్థాయిలో కుప్పం బ్రాంచ్ కాలువ (కేబీసీ)ను బాగు చేయకుండా, అందులోని చెట్లు, జమ్ము తొలగించకుండా కృష్ణా జలాలు తరలించేందుకు సన్నద్ధమయ్యారు. కుప్పాన్ని తన సొంత నియోజకవర్గం పులివెందులలాగా చూస్తానని మాటలు చెప్పిన జగన్.. మూడున్నరేళ్లపాటు కేబీసీలోని పది శాతం నిర్మాణ పనులను ఎందుకు విస్మరించారని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. హంద్రీ నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వరప్రదాయిని. ఇందులో భాగమైన కుప్పం బ్రాంచ్ కాలువను తెదేపా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రూ.575 కోట్లతో 123 కిలోమీటర్ల మేర కాలువ పూర్తయితే పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో ఎనిమిది మండలాల్లోని 110 చెరువులకు నీరు అందుతుంది. వాటి పరిధిలోని 6,300 ఎకరాల ఆయకట్టు సస్యశ్యామలం అవుతుంది. భూగర్భ జలమట్టం పెరిగి అన్నదాతలకు ఇక్కట్లు తప్పుతాయని చంద్రబాబు భావించి పనుల వేగంగా చేయించారు.

**నాణ్యతకు తిలోదకాలిచ్చి..**

ప్రస్తుతం హడావుడిగా చేపడుతున్న కాలువ లైనింగ్ పనుల్లోనూ నాణ్యతకు తిలోదకాలిచ్చారు. తుది గమ్యస్థానమైన పరమసముద్రం చెరువు వద్ద కాలువకు కొన్నిరోజుల క్రితమే లైనింగ్ వేసినా అప్పుడే పగుళ్లు వచ్చాయి. రానున్నది వేసవి కాలమైనా కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని కాలువ చెంత ఉన్న చెరువులు మినహా మిగిలిన జలవనరులను నింపేందుకు శ్రద్ధ చూపడం లేదు.

- ముఖ్యమంత్రి వస్తారేమోనని హడావుడి..: ఈ నెలలో సీఎం జగన్ ప్రారంభోత్సవానికి వస్తారని అధికారులు భావిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి నీళ్లు విడుదల చేశారు. అవి చిత్తూరు జిల్లాకు చేరేలోగా కాలువల్లోని పిచ్చిమొక్కలు తొలగించే అవకాశమున్నా పైపైన పనులు చేసి మమ అనిపించారు. వి.కోట మండలంలో ఇప్పుడు కూడా పనులు చేస్తున్నారు. కొన్నిచోట్ల అదీ లేదు.

తెదేపా హయాంలోనే 90 శాతం పూర్తి

చంద్రబాబు అప్పట్లో అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టించి 87 శాతం పనులు పూర్తి చేయించారు. 121 కి.మీ మేర కాలువ తవ్వించగా కేవలం 2.2 కి.మీ మాత్రమే పెండింగ్‌లో ఉంది. రూ.490 కోట్ల విలువైన పనులు చేశారు. 2019 జనవరిలో వి.కోట మండలం కృష్ణాపురానికి కృష్ణా జలాలు వచ్చాయి.

13 శాతానికి వైకాపా కుప్పిగంతులు

వైకాపా అధికారంలోకి వచ్చాక ఎక్కడి పనులు అక్కడే నిలిచాయి. గతేడాది సెప్టెంబరు 23న సీఎం జగన్ కుప్పం వచ్చినప్పుడు ఆరు నెలల్లోనే కుప్పం బ్రాంచ్ కాలువ పూర్తి చేస్తానని హామీ ఇచ్చినా నిలబెట్టుకోలేకపోయారు. 15 నెలల్లో కేవలం రెండు కిలోమీటర్ల కాలువ, స్ట్రక్చర్లు నిర్మించారు.

రైతుల విస్మయం

కుప్పం ప్రాంతానికి కృష్ణా జలాలు వస్తున్నా చెరువులు నింపకపోవడం, పొలాలకు నీరు ఇవ్వకపోవడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. కేబీసీ టెయిల్ ఎండ్‌గా ఉన్న కుప్పం పరమసముద్రం చెరువుకు మాత్రమే సరఫరా చేస్తున్నారు. పెద్దపంజాణి మండలం అప్పినపల్లె వద్ద ఒకవైపు ఉన్న కేబీసీ కాలువను పూర్తిగా మట్టితో పూడ్చి పలమనేరు వైపు కృష్ణా జలాలు వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. అక్కడ ఎండగట్టి.. కర్నూలు, హంద్రీ- నీవా ఆయకట్టు కు ఒక్క తడికైనా నీరు ఇవ్వాలని ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదు. వారి తరఫున ఆందోళనకు దిగిన ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌తోపాటు మరికొందరిపై కేసులు నమోదు చేశారు. ఒకచోట పంటలు ఎండబెట్టి.. మరో ప్రాంతంలో చెరువులు నింపకుం డానే కాలువల్లో నీళ్లు ప్రవహించేలా చేయటంలో అంతర్యం ఏంటని అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు.

చురకలు



## గోల్డ్ డిజైన్ లో జాన్వీ జివ్వుమనిపిస్తోందే!

జాన్వీకపూర్ కెరీర్ జెట్ స్పీడ్ తో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్..టాలీవుడ్ అంటూ రెండు భాషల్ని దున్నేస్తుంది. దేవర రిలీజ్ కాకుండానే తెలుగు నాట తనేంటో నిరూపిస్తుంది. మామ్ ఇమేజ్ తో అవకాశాలు దక్కించుకుంటుందా? తన ప్రతిభని గుర్తించి ఇస్తున్నారా? అన్నది తెలియదు గానీ జాన్వీ ఖాతాలో మాత్రం అన్నీ స్టార్ హీరోల చిత్రాలే కనిపిస్తున్నాయి. మామ్ ఇమేజ్ తోనే దక్కించుకుంటుంది? అన్నది ఓ సెక్షన్ ఆడియన్స్ అనుకుంటున్నా? అలా దక్కించుకోవడం అంత సులభమైన విషయం. మామ్ బ్రాండింగ్ ఎంత తన మీద ప్రభావం చూపినా ట్యాలెంట్ లేకపోతే అవకాశాలివ్వరు. ఆ విషయంలో జాన్వీ ముందే అలెర్ట్ అయింది. బాలీవుడ్ లో ప్రూవ్ చేసుకోవడంతోనే ఇక్కడా అవకాశాలు దక్కుతు



న్నా యన్నది మరికొంత మంది వాదన. ఆ వాదనలు ఎలా ఉన్నా తెలుగు నాట ఆరంభమే పాన్ ఇండియా చిత్రాలు ఒడిసి పట్టుకోవడం అన్నది అన్నింటిని మించిన గొప్ప అవకాశం . ఇంకా చెప్పాలంటే బాలీవుడ్ కంటే గొప్ప లాంచింగ్ తెలుగులో నే దక్కింది అన్నది వాస్తవం. హిందీలో ధడక్ చేసిన సమయంలో అందులో హీరో కొత్తోడు. కానీ తెలుగులో తొలి సినిమానే యంగ్ టైగర్ ఎన్టీఆర్ తో నటించే ఛాన్స్ అందుకుంది. ఎన్నో సినిమాలు చేసిన అనుభవం ఉన్న స్టార్ సరసన జాన్వీని ఎంపిక చేయడం అంటే గొప్ప విషయమే. ఆ సంగతి పక్కనబెడితే జాన్వీ ఫ్యాషన్ ఎంపికల గురించి చెప్పాల్సిన పనిలేదు. నటిగా మ్యాకప్ వేసుకోవడానికి ముందే అమ్మడు నెట్టింట భారీ ఫాలోయింగ్ సంపాదించింది. తనదైన మార్క్ ఎంపికలతో సోషల్ మీడియాలో దూసుకుపోయింది. నటి అయిన తర్వాత ఆ వేగం ఏ స్థాయికి చేరిందో చెప్పాల్సిన పనిలేదు. తాజాగా అమ్మడు న్యూ డిజైన్ లో తళకులీని పిక్ ఒకటి నెట్టింట వైరల్ అవుతుంది. అందులో అమ్మడు గోల్డ్ కలర్ పొడి డిజైన్ లో తళకు లీనింది. అమ్మడు స్కిన్ టోన్ డ్రెస్ లో కలిసిపోయింది. బ్యాక్ గ్రౌండ్ లోనే అదే కలర్ తో నిడిపోయింది. ఇంకే ముందు పిక్ అంతా గొల్డ్ మయం అయింది. ఈ సెషల్ జాన్వీ పూర్తిగా డ్రెస్ ఎలివేషన్ పైనే దృష్టి పెట్టింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది.

## నయనతార మనసు గెలిచిన సినిమా ఇదే!

లేడీ సూపర్ స్టార్ నయనతార ఇప్పటివరకూ ఎన్నో సినిమాల్లో నటించింది. ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించింది. యాక్షన్ చిత్రాలు..లేడీ ఓరియేంటెడ్ చిత్రాలు..అవసరం మేర సీత పాత్రలు ఒకటేంటి? వెండి తెరపై నయన్ చేయని సాహసమంటూ లేదనే చెప్పాలి. పాత్రని బట్టి తనను తాను మౌల్డ్ చేసుకుని ప్రేక్షకుల హృదయా ల్లో స్థానం సంపాదించిన నటి ఆమె. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోగల నటి అని ప్రూవ్ చేసుకుంది. మరి నయనతార మెచ్చిన పాత్ర ఏది? ఆమె ఎక్కువగా ఇష్టపడే రోల్ ఏది? ఆ సినిమా ఏంటి? అంటే నయన్ మనసులో సైతం అలాంటి సినిమా..పాత్ర ఒకటి ఉందని తాజాగా లీక్ ఇచ్చింది నయన్. సూపర్



స్టార్ రజనీకాంత్ నటించిన 'బిల్లా' చిత్రాన్ని విష్ణు వర్ధన్ అజిత్ హీరోగా ఆ చిత్రాన్ని రీమేక్ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో అజిత్ కి జోడీగా నయనతార నటించింది. నయన్ గ్లామర్ పాత్ర యువతని ఓ ఊపు ఊపేసింది అనడంలో ఎలాంటి సందేహం లేదు. అజిత్ యాక్షన్ కి నయన్ గ్లామర్ తోడవ్వడంతోనే సినిమా అంత పెద్ద విజయం సాధించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో నయనతార ఈ సినిమా తనకు బాగా నచ్చిన చిత్రంగా రివీల్ చేసింది. 'బిల్లా' సినిమా తన కెరీర్ టర్న్ చేసిందని అంది. అంతకుముందు వరకూ గ్రామీణ వాతావరణం ఉన్న పాత్రలు పోషించడం అప్పుడే 'బిల్లా' లో గ్లామర్ పాత్ర రావడంతో తన కెరీర్ మొత్తం మారిపోయిందని తెలిపింది. రోటీన్ పాత్రల నుంచి 'బిల్లా' రోల్ తనని డీవియేట్ చేసిందని... ఎలాంటి పాత్రలు ఎంచుకుంటే ఆడియ న్స్ కి కనెక్ట్ అవుతుందన్నది ఆ సినిమా ఓ మార్గాన్ని వేసిందని చెప్పుకొచ్చింది. గ్లామరస్ గా నటించడం కోసమే ప్రత్యేకంగా ఆసినిమా అంగీకరించినట్లు రివీల్ చేసింది. ఇప్పటివరకూ ఈ విషయాన్ని ఎక్కడా రివీల్ చేయలేదని ...ఆ పాత్ర గురించి బయట మాట్లాడటం కూడా ఇదే తొలిసారి అని నవ్వేసింది.




## శ్రద్దా దాస్ రంగీలా బీట్.. మత్తుగా కిక్కిచ్చేలా..




గ్లామరస్ బ్యూటీగా తనకంటూ ఒక ప్రత్యేకమైన క్రేజ్ అందుకుంటున్న శ్రద్ధదాస్ అప్పుడప్పుడు కొన్ని చిన్న సినిమాలతో సరికొత్తగా కనిపిస్తోంది. వీలైనంతవరకు డిఫరెంట్ కంటెంట్ ఉన్న సినిమాలే చేయాలని చూస్తున్నా ఈ బ్యూటీ ఇప్పుడు మరో ప్రయోగాత్మకమైన సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆమె నటించిన కొత్త సినిమా పారిజాత పర్వం అనే టైటిల్ తో రాబోతోంది. ఈ సినిమాలో శ్రద్ధదాస్ ఒకవైపు తన గ్లామర్ ను హైలైట్ చేస్తూనే మరొకవైపు తన పాత్రతో చాలా డిఫరెంట్ గా కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. ఇక సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ కూడా మొదలయ్యాయి. రీసెంట్ గా ఈ సినిమాలోని ఒక పాటను విడుదల చేశారు. రంగ్ రంగ్ రంగీలా అనే ఆ పాటను శ్రద్ధదాస్ పాడడం విశేషం. వినేవారికి మత్తుగా ఉండేలా అమ్మడు ఈ పాటను ఆలపించింది. ఇక పాటలో మరొకవైపు తన డాన్స్ స్టెప్పులతో కూడా మాయ చేసింది. చూస్తుంటే అమ్మడు నెవ్వర్ బిఫోర్ అనేలా దర్శనం ఇవ్వబోతున్నట్లు అనిపిస్తుంది. ఈ సినిమాను త్వరలోనే విడుదల చేయాలని అనుకుంటున్నారు. ఇప్పటివరకు తనలోని నటిని హైలెట్ చేస్తూ వచ్చిన అమ్మడు ఇప్పుడు సింగర్ గా కూడా సరికొత్తగా దర్శనమిచ్చింది. సరస్వతి పుత్ర రామ జోగయ్యశాస్త్రి రచించిన ఈ పాటకు రే సంగీతం అందించాడు. ఇక సినిమాను వనమాలి క్రియేషన్స్ పై మహిధర్ రెడ్డి దివేష్ నిర్మిస్తూ ఉండగా అనంత సాయి సహనిర్మాతగా ఉన్నారు. ఇక ఈ సినిమాను సంతోష్ కందుపాటి డైరెక్ట్ చేస్తున్నాడు. ఎలాగైనా ఈ సినిమాతో మంచి సక్సెస్ అందుకునే మళ్లీ ఫామ్ లోకి రావాలి అని శ్రద్ధదాస్ ప్రయత్నం చేస్తోంది.

చాలా యంగ్ ఏజ్ లోనే సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శ్రద్దా 2008లో సిద్దు ఫ్రమ్ శ్రీకాకుళం అనే సినిమాతో తెలుగు వారికి పరిచయమయ్యింది. ఆ సినిమా మంచి టాక్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ తరువాత వరుసగా రెండేళ్ల వరకు అమ్మడు గ్యాప్ లేకుండా ఏడాదికి నాలుగైదు సినిమాలు చేసుకుంటూ వచ్చింది. కేవలం హీరోయిన్ గానే కాకుండా సపోర్టింగ్ రోల్స్ కూడా చేసింది. ఇక ఇప్పుడు పారిజాత పర్వం అనే సినిమాతో మళ్లీ చాలా రోజుల తర్వాత ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మరి ఈ సినిమా ఎలాంటి ఫలితన్ని అందుకుంటుందో చూడాలి.

## జక్కన్న, మహేష్.. ఇది ఫస్ట్ టాస్క్





ఆర్ఆర్ఆర్ తర్వాత చాలా గ్యాప్ తీసుకున్న రాజమౌళి ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబుతో సినిమా చేయడానికి రెడీ అవుతోన్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్ తో పాన్ వరల్డ్ రేంజ్ లో ఈ సినిమా తెరకెక్కనుంది. విజయేంద్రప్రసాద్ స్క్రిప్ట్ కి తుది మెరుగులు దిద్దుతున్నారు. జక్కన్న కూడా ఈ స్క్రిప్ట్ మీద వర్క్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే స్క్రిప్ట్ లాక్ అయిన వెంటనే జక్కన్న వర్క్ షాప్ స్టార్ట్ చేయనున్నాడంట. సుమారు రెండు నెలల పాటు మూవీకి సంబందించిన వర్క్ షాప్ నిర్వహించబోతున్నట్లు తెలుస్తోంది.

ఈ వర్క్ షాప్ లో భాగంగా మొదటి మూడు వారాలు ఆర్ట్ డైరెక్టర్, కెమెరామెన్ లతో జక్కన్న షూటింగ్, లొకేషన్స్, సెట్ వర్క్, విజువలైజేషన్ కి సంబందించిన డిస్కషన్ ఉంటుందంట. తరువాత మహేష్ బాబు వర్క్ షాప్ లో జాయిన్ అవుతారని టాక్. మహేష్ పై టెస్ట్ షూట్ కూడా ఈ వర్క్ షాప్ లో భాగంగా చేయనున్నారంట. వర్క్ షాప్ కంప్లీట్ అయిన తర్వాత సినిమా షూటింగ్ ప్రారంభిస్తారని సమాచారం. ఈ ఏడాదిలో ఆఖరులో లేదంటే వచ్చే ఏడాది ఆరంభంలో జక్కన్న మహేష్ తో సినిమాని సెట్స్ పైకి తీసుకొని వెళ్లనున్నారు. ఈ సినిమాకి సంబంధించి క్యాస్టింగ్ ని ఫైనల్ చేసే పనిలో ప్రస్తుతం జక్కన్న ఉన్నారని ప్రచారం నడుస్తోంది. ఇండోనేషియాకి చెందిన బ్యూటీని మహేష్ బాబుకి జోడీగా ఇప్పటికే ఖరారు చేశారని టాక్. అలాగే కొంతమంది హాలీవుడ్ స్టార్స్ ని కూడా ఈ సినిమాలో కీలక పాత్ర కోసం ఎంపిక చేయనున్నారని తెలుస్తోంది. ఏది ఏమైనా జక్కన్న, మహేష్ సినిమా మాత్రం ఈ సారి హాలీవుడ్ లో అందరి దృష్టిని ఆకర్షిస్తుంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆర్ఆర్ఆర్ తోనే జక్కన్న హాలీవుడ్ టెక్నీషియన్స్ ని, జేమ్స్ కామెరూన్, స్టీవ్ స్పిల్ బర్గ్ లాంటి స్టార్ దర్శకులని మెప్పించారు. నాటునాటు సాంగ్ కి ఆస్కార్ కూడా అందుకున్నారు.

ఇప్పుడు మహేష్ బాబు మూవీతో ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తారనేది చూడాలి.

## అంబానీ కోడలు సోదరి హెయిర్ సెలూన్ ఓనర్?

ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న వివాహ వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంత్ అంబానీ – రాధిక మర్చంట్ ప్రీవెడ్డింగ్ వేడుకలు చాలా కోలాహలంగా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఒకరితో ఒకరు ఘాఢంగా ప్రేమలో ఉన్న ఈ జంట జనవరి 2023లో ముంబైలోని యాంటిలియా మాన్షన్‌లో తమ నిశ్చితార్థం జరుపుకున్నారు. అప్పటి నుంచి ఈ జంట పెళ్లి అంగరంగ వైభవంగా జరుగుతుందని అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. 12 జూలై 2024న పెళ్లికి సిద్ధమవుతున్నందున, అనంత్ –రాధికకు ప్రీ వెడ్డింగ్ వేడుకలు మార్చి 1, మార్చి 2, మార్చి 3న గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ప్లాన్ చేసారు. ఈ వేడుకల్లో కాబోయే వధువు రాధికతో పాటు ఆమె సోదరి అంజలి కూడా అందరి దృష్టిని ఆకర్షించింది. అయితే అంబానీల కోడలు సోదరి గురించి ఎవరికెంత తెలుసు? అంటే తెలుసుకోవాల్సింది చాలానే ఉంది. అంజలి రాధిక మాదిరిగానే వ్యాపార యజమానుల కుటుంబం నుండి వచ్చినప్పటికీ తన సొంత వ్యాపారాన్ని నడుపుతున్న ఒక స్వావలంబన కలిగిన యువతి. అంజలి వ్యాపారవేత్తగా సాహసోపేతమైన ప్రయాణం సాగిస్తోంది. గుజరాత్‌లోని



కచ్ అంజలి స్వస్థలం. ఆమె 1989లో ముంబైలో జన్మించింది. అంజలి మర్చంట్ విద్యాభ్యాస సమయంలో ది కేథడ్రల్ , జాన్ కానన్ స్కూల్‌లో చదివారు. ఆమె వీరేన్ – శైలా మర్చంట్‌ల పెద్ద కుమార్తె. ఎకోల్ మొండియేల్ వరల్డ్ స్కూల్‌లో ఆమె తర్వాత చదువుకున్నారు. తన విద్యను పూర్తి చేసిన తర్వాత, అంజలి స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో బీఎస్సీ పూర్తి చేయడానికి బాబ్సన్ కాలేజీకి వెళ్లింది. గ్రాడ్యుయేషన్ తర్వాత తన %వీదీూ% పొందేందుకు అంజలి లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో చేరింది. అటుపై అంజలి 2010లో ఒక సెమిస్టర్ కోసం వర్జీనియా విశ్వవిద్యాలయంలో విదేశాలలో చదువుకుంది. తన సెమిస్టర్ ఎట్ సీ సమయంలో అంజలి పన్నెండు వేర్వేరు దేశాలను సందర్శించింది. కెనడా, స్పెయిన్, మొరాకో, ఘనా, చైనా, జపాన్ సహా ఇతర ప్రదేశాలలో ప్రాజెక్ట్‌లపై పని చేసింది. 2006లో అంజలి పబ్లిసిస్‌లో అడ్వర్టైజింగ్ ఇంటర్న్‌గా తన జర్నీని ప్రారంభించింది. 2009లో మెర్క్‌లో ఇంటర్న్‌గా పనిచేసింది. 2012లో అంజలి తన తండ్రి కంపెనీ అయిన ఎన్‌కోర్ హెల్త్‌కేర్‌లో మార్కెటింగ్ మేనేజర్‌గా పని చేయడం ప్రారంభించింది. అంజలి 2017లో బేయర్‌లో పని చేసాక 2021లో మళ్లీ శిక్షణ పొందింది. అంజలి మైలోన్ మెటల్స్ అండ్ ఎన్‌కోర్ హెల్త్‌కేర్‌లో డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అంజలి 'టర్న్ ది క్యాంపస్' సహ–స్థాపకురాలు. ఇది మైలాన్ స్టీల్స్ ..తన కుటుంబ వ్యాపారానికి డైరెక్టర్‌గా పనిచేయడంతో పాటు, కళాశాల విద్యార్థులు ఉద్యోగుల కోసం ఉద్దేశించిన ఆన్‌లైన్ మార్కెట్ ప్లేస్. కానీ 2012లో వ్యాపారం చేయడం మానేసింది. 2018లో అంజలి ప్రత్యేకమైన హెయిర్ సర్వీస్‌లను అందించడంలో ప్రత్యేకత కలిగిన హెయిర్ సెలూన్‌ల నెట్‌వర్క్ అయిన డ్రైఫిక్స్‌కి సహ వ్యవస్థాపకురాలుగా మారింది. టబు, అలియా భట్ సహా అనేక మంది బి–టౌన్ ప్రముఖులు దీనికి ప్రచారం చేస్తున్నారు.

## అందాల ఈ వాణి అదుర్స్

నాని హీరోగా నటించిన ఆహా కళ్యాణం సినిమాతో సౌత్ ఇండియన్ ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ వాణి కపూర్. మొదటి సినిమా ఫ్లాప్ అవ్వడంతో వాణి కపూర్ మళ్లీ సౌత్ లో కనిపించలేదు. అయితే బాలీవుడ్ లో ఈ మధ్య కాలంలో వరుసగా ఆఫర్లు దక్కించుకుంటూ బిజీ బిజీగా ఉంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి దశాబ్ద కాలం దాటినా కూడా ఇప్పటి వరకు వాణి కపూర్ పట్టుమని పది సినిమాలు చేయలేదు. అయితే సోషల్ మీడియాలో మాత్రం వాణి కపూర్ కి మంచి ఫాలోయింగ్ ఉంది.

8 మిలియన్ ల కంటే ఎక్కువగానే ఈ అమ్మడు సోషల్ మీడియా ఫాలోవర్స్ ని సొంతం చేసుకుంది. సోషల్ మీడియాలో మరోసారి ఈ అమ్మడు అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేసింది.



ఆకట్టుకునే అందం తో పాటు ఎప్పుడూ కూడా తన ప్రతిభ కనబర్చుతూ ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోలు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. స్లీవ్ లెస్ డ్రెస్ లో అందాల వాణి కపూర్ అందం కు అంతా ఫిదా అవుతున్నారు. క్లీవేజ్ షో తో పాటు టైట్ డ్రెస్ లో అందాల ఆరబోత చేయడం ద్వారా ముద్దుగుమ్మ వాణి కపూర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేస్తే ముందు ముందు మరింత బిజీ అవ్వడం ఖాయం అన్నట్లుగా ఇండస్ట్రీ వర్గాల వారు కామెంట్స్ చేస్తున్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536